# వేకువ సమయం

సంపుటి: 14 సంచిక: 246 EKUVA SAMAYAM TELUGU DAILY తేది: బుధవారం 14 అక్టోబర్ 2026

* Mahabubnagar * Hyderabad * Miryalaguda & Rangareddy సంపాదకులు : కె.భాస్కర్‌రావు రూ.2.00/- పేజీలు 12





**ఢిల్లీ, అక్టోబర్ 13, సమయం ప్రతినిధి:** టెక్నాలజీ, డేటా, నాలెడ్జ్, ఇన్నోవేషన్ అనేవి నేటి ప్రపంచంలో అత్యంత కీలక శక్తులని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. వాటిని కొందరి ప్రయోజనాలకే పరిమితం చేయకుండా.. కోట్లాది మందికి కొత్త అవకాశాలు కల్పించేందుకు ఉపయోగించాలని పిలుపునిచ్చారు. ఈ మేరకు మంగళవారం బ్లూమ్‌బర్గ్ న్యూ ఎకానమీ ఫోరమ్‌లో మాట్లాడిన ఆయన.. పోటీకి బదులుగా సహకారం, నియంత్రణకు బదులుగా సాధికారత లక్ష్యంగా ముందుకు సాగాలని సూచించారు. ప్రపంచవ్యాప్తంగా అనిశ్చిత పరిస్థితులు నెలకొన్నప్పటికీ.. భారత ఆర్థిక వ్యవస్థ మాత్రం బలమైన పునాదులపై నిలిచి ఉందని ఈ సందర్భగా మోదీ ప్రస్తావించారు. దీంతో 2026-27 ఆర్థిక ఏడాది తొలి త్రైమాసికంలో జీడీపీ వృద్ధి 7.8 శాతంగా నమోదైందని పేర్కొన్నారు. హరిత ఇంధన రంగంలోనూ భారత్ గణనీయమైన వృద్ధిని సాధించిందన్నారు. 2014లో దేశ పునరుత్పాదక ఇంధన సామర్థ్యం సుమారు 75 గిగావాట్లుగా ఉండగా.. ప్రస్తుతం అది 300 గిగావాట్లకు ఎగబాకిందని చెప్పుకొచ్చారు. దీంతో స్వచ్ఛ ఇంధన రంగం కొత్త ఆర్థిక అవకాశాలకు మార్గం సుగమం చేస్తోందని తెలిపారు మోదీ.




**న్యూఢిల్లీ, సమయం ప్రతినిధి:** కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీకి సుప్రీంకోర్టులో ఊరట లభించింది. ప్రధాని నరేంద్ర మోదీపై చేసిన 'చౌకీదార్ చోర్ హై' వ్యాఖ్యలకు సంబంధించిన పరువు నష్టం కేసులో ట్రయల్ కోర్టు విచారణపై సర్వోన్నత న్యాయస్థానం స్టే విధించింది. ఈ కేసులో రాహుల్ దాఖలు చేసిన పిటిషన్‌పై స్పందించాలని మహారాష్ట్ర ప్రభుత్వానికి 4 వారాల గడువు విధిస్తూ.. నోటీసులు జారీ చేసింది. ఈ మేరకు జస్టిస్ విక్రమ్ నాథ్, జస్టిస్ అపరేష్ కుమార్ సింగ్‌లతో కూడిన ధర్మాసనం ఆదేశాలు జారీ చేసింది. కాగా.. 2018లో రాఫెల్ యుద్ధ విమానాల ఒప్పందంపై జరిగిన రాజకీయ వివాదం నేపథ్యంలో రాజస్థాన్‌లో నిర్వహించిన ర్యాలీలో ప్రధాని మోదీని ఉద్దేశించి రాహుల్ ఈ వ్యాఖ్యలు చేశారు. దీనిపై బీజేపీ నేత మహేశ్ శ్రీశ్రీమల్ పరువు నష్టం దావా వేశారు. ఈ పిటిషన్‌పై ముంబైలోని గిర్గావ్ మేజిస్ట్రేట్ కోర్టు 2019లో విచారణ చేపట్టింది. అయితే.. ఆ కేసును కొట్టివేయాలంటూ రాహుల్ పిటిషన్ దాఖలు చేయగా.. దానిని బాంబే హైకోర్టు ఇటీవల తిరస్కరించింది. దీంతో ఆయన సుప్రీంకోర్టును ఆశ్రయించారు. తాజాగా ట్రయల్ కోర్టు విచారణపై స్టే విధిస్తూ అత్యున్నత న్యాయస్థానం ఆదేశాలు జారీ చేసింది.




**హైదరాబాద్, అక్టోబర్ 13:** సింగరేణి కార్మికులకు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క గుడ్ న్యూస్ చెప్పారు. సింగరేణిలో కారుణ్య నియామకాలు, కార్మికులకు ఇళ్ల స్థలాలకు సంబంధించి కీలక ప్రకటనలు చేశారు. ఈరోజు (మంగళవారం) మీడియాతో మాట్లాడుతూ.. సింగరేణిలో 38,738 మంది పర్మనెంట్ ఉద్యోగులు, కాంట్రాక్ట్ ఉద్యోగులు 29,715 మంది పని చేస్తున్నారని తెలిపారు. వారి సంక్షేమం కోసం కొన్ని కీలక నిర్ణయాలు తీసుకున్నామని చెప్పారు. సింగరేణిలో కారుణ్య నియామకాలను 15 రోజుల్లో పూర్తి చేస్తామని ప్రకటించారు. మారుపేర్ల అంశానికి సంబంధించి 15 రోజుల్లో శాశ్వత పరిష్కారం చూపిస్తామన్నారు. మెడికల్ ఇన్‌వ్యాలిడేషన్ కోసం కార్మికులు కొత్తగూడెం వెళ్లాల్సి వస్తోందని.. ఇకపై సింగరేణిలో ఏరియా ఆస్పత్రుల్లోనే మెడికల్ ఇన్‌వ్యాలిడేషన్ పరీక్షలు చేసే సౌకర్యాన్ని కల్పించనున్నట్లు తెలిపారు. కరోనా సమయంలో విధులకు హాజరుకాకుండా డిస్మిస్ అయిన వారిని విధుల్లోకి తీసుకోవాలని నిర్ణయించామని డిప్యూటీ సీఎం వెల్లడించారు. వన్ టైమ్ ఆప్షన్ కింద వారికి అవకాశం ఇస్తున్నట్లు చెప్పారు. సింగరేణికి చెందిన 1250 ఎకరాల్లో జీవో 76 ప్రకారం అర్హులకు ఇళ్ల స్థలాల పట్టాలు ఇస్తామన్నారు. ఇప్పటికే ఆక్రమణలో ఉన్న వారిలో అర్హులకు పట్టాలు ఇవ్వనున్నట్లు తెలిపారు. హౌసింగ్ కాలనీ నిర్మించి కార్మికులకు అందిస్తామని.. కార్మికుల సొంత ఇంటి కలను నిజం చేస్తామని చెప్పారు. నెహ్రూ హౌసింగ్ కాలనీ పేరిట ఇళ్ల నిర్మాణం చేపడతామన్నారు. ఏరియా హాస్పిటల్స్‌ను కార్పొరేట్ హాస్పిటల్స్‌కు దీటుగా అభివృద్ధి చేస్తామని భట్టి స్పష్టం చేశారు. సూపర్ స్పెషలిస్ట్ డాక్టర్లు పనిచేసేలా చర్యలు తీసుకుంటామన్నారు. సింగరేణి ప్రాంతాల్లో ఉచితంగా క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహిస్తామని ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క పేర్కొన్నారు.

**మానవీయకోణంలో నిర్ణయం: మంత్రి శ్రీధర్ బాబు**

సింగరేణి కార్మికుల ప్రయోజనాల కోసం మానవీయ కోణంలో తాము నిర్ణయం తీసుకున్నామని మంత్రి శ్రీధర్ బాబు తెలిపారు. సింగరేణి కార్మికులను బీఆర్ఎస్ దోపిడీ చేసిందని ధ్వజమెత్తారు.




**హైదరాబాద్, అక్టోబర్ 13, సమయం ప్రతినిధి:** ఉపాధి హామీ పథకంలో పని చేస్తున్న ఎఫ్‌టీఈ ఉద్యోగులకు తెలంగాణ ప్రజా ప్రభుత్వం దసరా కానుక అందించింది. ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉన్న గ్రాట్యుటీ సమస్యకు పరిష్కారం చూపుతూ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. సుమారు 3,800 మంది ఉద్యోగులకు గ్రాట్యుటీ ప్రయోజనం కల్పిస్తూ జీవో జారీ చేసింది. మంత్రి సీతక్క ప్రత్యేక చొరవతో దాదాపు 20 ఏళ్లుగా ఉద్యోగులు చేస్తున్న పోరాటానికి ఫలితం దక్కిందని ఉద్యోగ సంఘాల ప్రతినిధులు హర్షం వ్యక్తం చేశారు. ఉద్యోగుల సర్వీసు, రిటైర్మెంట్‌కు సంబంధించిన నిబంధనల ప్రకారం కనీసం రూ.4 లక్షల గ్రాట్యుటీతో పాటు, పదేళ్ల సర్వీసు పూర్తిచేసే ఉద్యోగులకు రూ.10 లక్షల వరకు ప్రయోజనం లభించనున్నట్లు పేర్కొన్నారు. ఈ నిర్ణయంతో దీర్ఘకాలంగా సేవలందిస్తున్న ఉద్యోగులకు రిటైర్మెంట్ సమయంలో ఆర్థిక భరోసా లభించనుంది. తమ సమస్యను పరిష్కరించేందుకు చొరవ చూపిన మంత్రి సీతక్కకు ఎఫ్‌టీఈ ఉద్యోగుల సంఘం కృతజ్ఞతలు తెలిపింది. అలాగే గ్రాట్యుటీ మంజూరుకు సహకరించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి.. ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కకు ఉద్యోగులు ధన్యవాదాలు తెలిపారు. ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్న తమ డిమాండ్ నెరవేరడం పట్ల ఉద్యోగులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఉద్యోగుల సంక్షేమమే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని మంత్రి సీతక్క స్పష్టం చేశారు. ఉద్యోగుల హక్కులు, ఆత్మగౌరవానికి తమ ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని, ఏళ్ల తరబడి పరిష్కారం కాని సమస్యలకు దశలవారీగా పరిష్కారం చూపుతున్నామని పేర్కొన్నారు. కష్టపడి పనిచేసిన ఉద్యోగులు పదవీ విరమణ తర్వాత ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కోకూడదన్నదే ప్రభుత్వ సంకల్పమని తెలిపారు. దీర్ఘకాలం సేవలందించిన ఉద్యోగులకు జీవిత చరమాంకంలో ఆర్థిక భద్రత కల్పించడం ప్రభుత్వ బాధ్యతగా భావిస్తున్నామని వెల్లడించారు. ఈ నేపథ్యంలో గ్రాట్యుటీ మంజూరు నిర్ణయం ఎఫ్‌టీఈ ఉద్యోగులకు ఎంతో ఊరటనివ్వనుంది. ఉద్యోగుల సంక్షేమానికి ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం తమ 20 ఏళ్ల పోరాటానికి గుర్తింపుగా నిలుస్తుందని ఉద్యోగ సంఘం ప్రతినిధులు అభిప్రాయపడ్డారు. తమ న్యాయమైన డిమాండ్‌ను గుర్తించి అమలు చేసిన సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి సీతక్కకు మరోసారి కృతజ్ఞతలు తెలిపారు.




**హైదరాబాద్, (సమయం ప్రతినిధి):** నగరంలోని బేగంపేటలో భారీ బైక్ దొంగతనాల ముఠాను పోలీసులు పట్టుకున్నారు. ఈ ముఠాకు సంబంధించి ఇద్దరు నిందితులను అరెస్ట్ చేసి.. వారి నుంచి 36 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. వీటి విలువ సుమారు రూ.20 లక్షలు ఉంటుందని పోలీసులు వెల్లడించారు. గత మూడు నెలలుగా ప్రత్యేక దర్యాప్తు చేపట్టిన బేగంపేట క్రైమ్ టీమ్ ఈ ముఠా గుట్టును రట్టు చేసింది. నగరంలో వరుసగా జరుగుతున్న బైక్ చోరీలపై దృష్టి సారించిన పోలీసులు, దొంగతనాలు జరిగిన ప్రాంతాలు, నిందితుల కదలికలు, ఇతర ఆధారాలను పరిశీలిస్తూ దర్యాప్తు కొనసాగించారు. ఈ క్రమంలో నిందితులను గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. వీరి అరెస్టుతో మొత్తం 42 బైక్ దొంగతనాల కేసులను ఛేదించినట్లు పోలీసులు వెల్లడించారు. ముఖ్యంగా బస్టాండ్లు.. పార్కింగ్ ప్రదేశాలను లక్ష్యంగా చేసుకుని ఈ ముఠా చోరీలకు పాల్పడినట్లు దర్యాప్తులో గుర్తించారు. వాహనాలను పార్క్ చేసి వెళ్లిన యజమానులు తిరిగి వచ్చేసరికి బైక్‌లు కనిపించకపోవడంతో పలువురు పోలీసులకు ఫిర్యాదులు చేశారు. ఈ ఫిర్యాదుల ఆధారంగా దర్యాప్తు చేపట్టిన పోలీసులు, చోరీల వెనుక ఉన్న ముఠాను గుర్తించి చర్యలు తీసుకున్నారు. ఒకేసారి 36 బైక్‌లను స్వాధీనం చేసుకోవడంతో బాధితులకు తమ వాహనాలను తిరిగి పొందే అవకాశం ఏర్పడింది.

**సమయం ప్రతినిధి:** భారత్‌లో లద్దాఖ్ అంతర్భాగమని కేంద్ర ప్రభుత్వం మరోసారి స్పష్టం చేసింది. లద్దాఖ్ భారత్‌లో అంతర్భాగం కాదంటూ చైనా వ్యక్తం చేసిన అభ్యంతరంపై గట్టి కౌంటర్ ఇచ్చింది. చైనా అడ్డగోలుగా వాదించినంతమాత్రాన నిజాలు అబద్ధాలు కాలేవని విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి రణ్‌ధీర్ జైస్వాల్ తేల్చి చెప్పారు. మంగళవారం మీడియాతో ఆయన మాట్లాడారు. "కేంద్రపాలిత ప్రాంతం లద్దాఖ్ ఎప్పుడూ భారత్‌లో అంతర్భాగమే. దానిని ఎవరూ భారత్ నుంచి విడదీయలేరు. గతంలో అది మన దేశంలో అంతర్భాగంగా ఉంది. ఇప్పుడూ ఉంది. భవిష్యత్తులోనూ ఉంటుంది. ఎవరూ ఈ వాస్తవాన్ని కాదనలేరు. భారత్‌లో లద్దాఖ్ అంతర్భాగం కాదంటూ చైనా అడ్డగోలుగా వాదించినంతమాత్రాన నిజాలు అబద్ధాలైపోవు" అని జైస్వాల్ తెలిపారు. కాగా.. లద్దాఖ్ ప్రాంతంలో 28 భౌగోళిక ప్రదేశాలను గుర్తిస్తూ కేంద్ర హోం శాఖ ఈనెల 2న కొత్తగా భారత మ్యాప్‌ను విడుదల చేసింది. ఆ మ్యాప్‌పై చైనా అభ్యంతరం తెలిపింది. లద్దాఖ్‌ను భారత్‌లో అంతర్భాగంగా తాము ఎప్పుడూ గుర్తించలేదని, ఆ ప్రాంతంలో భౌగోళిక ప్రదేశాలను గుర్తించడం చట్టవిరుద్ధం అని చైనా పేర్కొంది.







**హైదరాబాద్, అక్టోబర్ 13, (సమయం ప్రతినిధి):** నగరంలోని శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయంలో ఇండిగో విమానానికి సంబంధించిన ఘటన కలకలం రేపింది. హైదరాబాద్ నుంచి శ్రీనగర్‌కు వెళ్లాల్సిన విమానం టేకాఫ్‌కు సిద్ధమైన సమయంలో ప్రయాణికుల లగేజీలో పవర్ బ్యాంక్ ఉన్నట్లు సమాచారం రావడంతో భద్రతా సిబ్బంది అప్రమత్తమ య్యారు. దీంతో రన్‌వేపైకి వెళ్లిన విమానాన్ని తిరిగి వెనక్కి తీసుకెళ్లారు. విమానంలో మొత్తం 173 మంది ప్రయాణికులు ఉన్నట్లు సమాచారం. టేకాఫ్‌కు సిద్ధమైన సమయంలో ఈ విషయం వెలుగులోకి రావడంతో విమానాన్ని నిలిపివేసి, భద్రతా నిబంధనల ప్రకారం తనిఖీలు చేపట్టారు. విమాన ప్రయాణాల్లో లిథియం బ్యాటరీలతో కూడిన పవర్ బ్యాంకుల విషయంలో ప్రత్యేక భద్రతా నిబంధనలు అమల్లో ఉంటాయి. ముఖ్యంగా చెక్-ఇన్ లగేజీలో పవర్ బ్యాంకులను ఉంచడానికి అనుమతి లేదు. ఈ నేపథ్యంలో లగేజీలో పవర్ బ్యాంక్ ఉందన్న సమాచారం రావడంతో అధి కారులు ముందస్తు జాగ్రత్తలు తీసుకున్నారు. ప్రయాణికుల భద్రతకు ప్రాధాన్యమిస్తూ విమానాన్ని వెనక్కి తీసుకెళ్లి అవసరమైన తనిఖీలు నిర్వహించారు. దీంతో కొంతసేపు విమాన ప్రయాణానికి అంతరాయం ఏర్పడింది.

# సంపాదకీయం

## లంచాల్లో మనం విశ్వగురువులం!

ప్రతివారం ఇద్దరో ముగ్గురో ప్రభుత్వ ఉద్యోగులు లంచాలు తీసుకుంటూ అవినీతి నిరోధక శాఖ దాడుల్లో పట్టుబడుతూనే ఉన్నారు. సాధారణంగా ప్రపంచవ్యాప్తంగా చాలా దేశాల్లో చట్టాన్ని ఉల్లంఘించడానికో, తప్పులు చేయడానికో లంచం అడుగుతారు. కానీ, చట్టబద్ధంగా చేయాల్సిన పనిని నిర్వర్తించడానికి సైతం లంచం డిమాండ్ చేసే సంస్కృతి మన దేశంలో మాత్రమే కనిపిస్తోంది! మన ప్రభుత్వోద్యోగులు తాము నిర్వర్తించాల్సిన అధికారిక బాధ్యతను వ్యక్తిగత ఆదాయ మార్గంగా మార్చుకుని, లంచం ఇవ్వగలిగే వారికే సేవలు అందించడం ప్రారంభించి చాలా కాలమైంది. నిత్యం ప్రభుత్వ ఆఫీసుల చుట్టూ తిరగాల్సి వచ్చే సామాన్యులకు ఈ అవినీతి తీవ్రత, దాని విస్తృతి ఎంత దారుణంగా ఉన్నాయో స్పష్టంగా తెలుసు. సమాజంలో మధ్యతరగతి వర్గానికి ఈ అవినీతి అసలు ఒక సమస్యగానే కనిపించకపోవచ్చు. కొందరు ప్రభుత్వ ఉద్యోగులు కోట్లు వెచ్చించి గేటెడ్ కమ్యూనిటీల్లో ఇళ్లు కొంటున్నారు, పిల్లలను విదేశాల్లో చదివిస్తున్నారు, నూతన దంపతుల హనీమూన్‌ను మాల్దీవులలో ఏర్పాటు చేస్తున్నారు. ఇవన్నీ కేవలం తమ నెల జీతంతోనే సాధించామని చెప్పే స్థితి లేదు. మరోవైపు, 'ఇప్పటికీ అద్దె కొంపలోనే ఉన్నాం' అని ఆవేదన చెందే గృహిణి, తన భర్త నిజాయితీని మెచ్చుకోవడానికి బదులు అతని చేతగానితనాన్ని ఎత్తి చూపుతుంది. 'కుటుంబంలో ఒక్కరికి సర్కారీ కొలువు వస్తే, వంశమంతా బాగుపడింది' అనే మెచ్చుకోలు వెనుక బినామీ ఆస్తులు, అవినీతి సంపాదనతో కూడిన లోతైన లంకె దాగి ఉంది. 'ఆ ఐఏఎస్ అధికారి మంచి పోస్టింగ్ కోసం ఎదురు చూస్తున్నారు' అనే వార్తలు, సమాజంలో అవినీతి ఏ స్థాయిలో సాధారణీకరణ అయిందో చాటి చెబుతున్నాయి. 'ఆదాయం వచ్చే సీటు మారితే నెలకు లక్షల్లో నష్టం జరుగుతుంది' అనే వారిలో, లంచాన్ని తమ హక్కుగా భావించే తీరు కనిపిస్తుంది. 'అందరూ చేసే పనే కదా!' అనే మాటలో అవినీతికి సమర్థన లభిస్తుండగా.. 'నేనొక్కడినే తిన్నానా? పైన ఉన్న వారికీ తినిపించలేదా?' అనే వాదనల్లో అవినీతి ముఠాల అక్రమ వలయం స్పష్టమవుతోంది. 'నీతిగా ఉండటానికి నేనేమైనా గాంధీనా?' అనే సమాధానం చూస్తే, నేటి సమాజంలో నిజాయితీ ఎంత అరుదైన విషయంగా, చులకనగా మారిపోయిందో అర్థమవుతుంది. పదవీ విరమణ చేసిన తరువాత గౌరవంగా విశ్రాంతి తీసుకోకుండా, ఎన్నికల వైపు లంఘించేవారు దానిని ఒక సహజ పరిణామంగా చిత్రీకరిస్తున్నారు! ఇటువంటి వారు రాజకీయాల్లో చేరుతున్నంత కాలం, ప్రభుత్వం అవినీతికి వ్యతిరేకమని నమ్మడం కష్టం. అలాగే, విద్యారంగాన్ని వ్యాపారంగా మార్చి కోట్లు ఆర్జించిన వ్యక్తులు, సేవ చేయడానికే రాజకీయాల్లోకి వస్తున్నారని ఎవరూ నమ్మడం లేదు. నీతిగా బతకడం అంటే జీవితంలో ఓడిపోవడమే అని భావించే సమాజంలో, అధికారంలో ఉన్నవారు పదే పదే గెలుస్తుంటే వారు లంచాలు తిననట్టా? లేదా ఇతరులకు తినిపించనట్టా? మనకు చూపిస్తున్న దృశ్యం వెనుక ఉన్న వాస్తవాన్ని ఎందుకు గుర్తించలేకపోతున్నాం?ఏదైనా ఒక శాఖలోని ఉద్యోగి అవినీతి సొమ్ముతో రెడ్ హ్యాండెడ్‌గా పట్టుబడినప్పుడు–'ఇది మా శాఖకు ఎంతో చెడ్డపేరు తెచ్చిపెట్టింది' అని బహిరంగంగా ఖండించిన మంత్రులు ఉన్నారా? లేరు. వారి ఈ మౌనం వెనుక దాగి ఉన్న నిండు సత్యాలేమిటి? ఒక లాభసాటి పదవిని ఎలా దక్కించుకోవాలో, ఆ సీటులో కూర్చుని ఎవరు ఏ స్థాయిలో చెలరేగిపోతున్నారో సంభ్రమాశ్చర్యాలతో చర్చించుకునే ముఠాలకు అధికార కారిడార్లలో కొదవలేదు. అవినీతిని ఒక కళాత్మక నైపుణ్య స్థాయికి తీసుకెళ్లిన వారి పట్ల సమాజంలోనూ, తోటి అధికారుల్లోనూ ఒక రకమైన గౌరవం పెరిగిపోతోంది. ప్రత్యేక శిక్షణ లేకుండానే లంచాల ఆర్జనలో ఇటువంటి 'నైపుణ్యం' సాధించడం సాధ్యం కాదు. ఇలాంటి అధికారులకు ఇతర శాఖల నుంచి కూడా తీవ్రమైన డిమాండ్ ఉంటుంది! నిబంధనలను పక్కనపెట్టి నిధులు రాబట్టగల నేర్పరులైన ఇటువంటి అధికారులను వెతికి మరీ మంత్రుల పేషీల్లో ప్రత్యేక అధికారులుగానో, సలహాదారులుగానో నియమించుకుంటున్నప్పుడు.. సాదాసీదా ఉద్యోగి మాత్రం మేతమేయకుండా గట్టు మీద కూర్చుంటాడా? నిఘా వ్యవస్థలు కునుకు తీస్తున్నప్పుడు ఆ ఉద్యోగి హఠాత్తుగా కోట్లు పోగేసినట్టు చెప్పడం కుదురుతుందా? 'వేల కోట్లు కొల్లగొట్టిన బడా తిమింగలాలను వదిలేసి, కేవలం వందల కోట్లు కూడబెట్టిన చిన్న చేపలను మాత్రమే పట్టుకున్నారు' అనే విమర్శే ఇక్కడ సత్యానికి చాలా దగ్గరగా ఉంటుంది. అంతేకాదు, 'ఒకవేళ నిజంగా అవినీతి ప్రక్షాళన మొదలుపెడితే అసలు ఎంతమందిని ఉద్యోగాల నుంచి తొలగించగలం? అందుకే ఒక పరిమితి దాటకుండా అవినీతిని అదుపు చేయడమే ప్రభుత్వ బాధ్యత' అంటూ ఒక అగ్రనేత చేసే ప్రకటనలోని నిజాయితీని చూడాలి. వంద రూపాయల లావాదేవీలో పది రూపాయల అవినీతి ఆమోదయోగ్యమే అయితే.. అదే ప్రాతిపదికన లక్ష కోట్ల బడ్జెట్‌లో పదివేల కోట్ల అవినీతి కూడా సహజంగానే ఆమోదనీయం అవుతుంది కదా?అణగారిన వర్గాలు ప్రభుత్వ ఉద్యోగాన్ని సాధించాలని పడే ఆరాటం కేవలం సామాజిక గుర్తింపు కోసమే అయి ఉంటే ఎంత బాగుండేదో! అధికారం అనేది ప్రజలందరి ఉమ్మడి వనరు అని, పుట్టుక నుంచి చావు వరకు సామాన్యుడికి దాంతో అవసరం పడుతుందనే స్పృహ అందరికీ ఉంది. కానీ అదే సమయంలో, ప్రభుత్వంపైనే పూర్తిగా ఆధారపడే బలహీన వర్గాల కష్టార్జితాన్ని అధికార బలంతో ఎలా ఒడుపుగా పిండుకోవచ్చో అనే తెలివితేటలు కూడా ఉద్యోగులలో పెరిగిపోతున్నాయి.అవినీతిని అర్థం చేసుకోవడానికి దానికి ఉన్న సామాజిక సందర్భాన్ని కూడా పరిశీలించాలి. నేటి మధ్యతరగతిని ఒక కొత్త ఆకర్షణల ప్రపంచం ఆహ్వానిస్తోంది. అయితే అది శ్రీశ్రీ ఊహించిన 'మరో ప్రపంచం' కాదు. భౌతిక సుఖాలు, విలాసవంతమైన జీవితపు కొత్త రుచుల ప్రపంచం! ఫామ్‌హౌస్‌లు, విదేశీ విద్యలు, అట్టహాసంగా జరిగే డెస్టినేషన్ వెడ్డింగ్‌లు వారిని ఊరిస్తున్నాయి. థాయ్‌లాండ్, వియత్నాం, దుబాయ్, లాస్ ఏంజెల్స్ వంటి విదేశీ తీర్థాల నుంచి.. మానససరోవరం, అయోధ్య, కేదారనాథ్, పశుపతినాథ్‌ల ఆధ్యాత్మిక గమ్యస్థానాల వరకు అన్నీ ఆకర్షిస్తున్నాయి. కేవలం సాధారణ ఉద్యోగాల నెలసరి జీతాలతోనే ఈ ఖరీదైన గమ్యాలను చేరుకోవాలనుకోవడం అమాయకత్వమే అవుతుంది.

# బతుకమ్మ వేడుకలు వైభవంగా నిర్వహించాలి

## అన్ని శాఖలు సమన్వయంతో పక్కా ఏర్పాట్లు చేయాలి: జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్

**మహబూబాబాద్, అక్టోబర్ 13(వేకువ సమయం ప్రతినిధి):** తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు బతుకమ్మ పండుగ ప్రతీక అని, జిల్లాలో బతుకమ్మ ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పక్కా ప్రణాళిక రూపొందించి ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్, మెజిస్ట్రేట్ స్నేహ శబరిష్ ఆదేశించారు. మంగళవారం మహబూబాబాద్ జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఇన్‌చార్జి అదనపు కలెక్టర్లు పురుషోత్తం (స్థానిక సంస్థలు), కె. అనిల్ కుమార్ (రెవెన్యూ)తో కలిసి సంబంధిత అధికారులతో బతుకమ్మ పండుగ ఏర్పాట్లపై కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలో బతుకమ్మ ఉత్సవాల నిర్వహణకు జిల్లా సంక్షేమ శాఖ అధికారిని నోడల్ అధికారిగా నియమించి, అన్ని శాఖల సమన్వయంతో కార్యక్రమాలను విజయవంతం చేయాలని సూచించారు. బతుకమ్మ ఆడే చెరువులు, కుంటలు, దేవాలయాలు తదితర ప్రాంతాల్లో అవసరమైన సౌకర్యాలు కల్పించాలని మున్సిపల్, పంచాయతీరాజ్ అధికారులను ఆదేశించారు. దుర్గామాత విగ్రహాల నిమజ్జన ప్రాంతాల్లో క్రేన్లు, లైటింగ్, పారిశుధ్యం, భద్రతా ఏర్పాట్లు పకడ్బందీగా చేపట్టాలని, వేడుకలకు హాజరయ్యే మహిళలు, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తగిన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు.స్త్రీ, శిశు సంక్షేమ శాఖ, మహిళా భద్రత, సఖి, జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం, మెప్మా, స్వయం సహాయక సంఘాలు, వైద్య ఆరోగ్య శాఖ, రెవెన్యూ తదితర



శాఖల ఆధ్వర్యంలో అమలవుతున్న సంక్షేమ పథకాలపై ప్రదర్శనలు ఏర్పాటు చేస్తూ బతుకమ్మ వేడుకలను నిర్వహించాలని సూచించారు.వేడుకలకు హాజరయ్యే ప్రజాప్రతినిధులకు ప్రోటోకాల్ ప్రకారం ఏర్పాట్లు చేయాలని, గ్రామస్థాయి నుంచి జిల్లా కేంద్రం వరకు విస్తృత ప్రచారం నిర్వహించి ప్రజలు, స్వచ్ఛంద సంస్థలు, అన్ని వర్గాల వారిని ఉత్సవాల్లో భాగస్వాములను చేయాలని కలెక్టర్ పేర్కొన్నారు. తెలంగాణ సాంస్కృతిక సారథి, ఇతర కళాకారుల ద్వారా సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించాలని, ప్రస్తుత పరిస్థితులపై ప్రజలకు అవగాహన కల్పించే పాటలను రూపొందించి ప్రదర్శించాలని తెలిపారు. జిల్లా కేంద్రం, పట్టణాలు, మున్సిపాలిటీలు, గ్రామ పంచాయతీల పరిధిలో జరిగే బతుకమ్మ వేడుకలకు సంబంధించిన ఫొటోలు, వీడియోలను సేకరించాలని అధికారులను ఆదేశించారు.ఈ సమావేశంలో డీఆర్ఓ నాగలక్ష్మి, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ నితీష్ కుమార్, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి విజయచంద్ర, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ రవి రాథోడ్, డీఎస్ఓ రమేష్, మెప్మా ప్రాజెక్ట్ డైరెక్టర్ విజయ, వివిధ శాఖల జిల్లా అధికారులు, సెక్షన్ పర్యవేక్షకులు, ఎంపీడీఓలు, మున్సిపల్ కమిషనర్లు, తహసీల్దార్లు తదితరులు పాల్గొన్నారు.

# శరన్నవరాత్రులలో శైలపుత్రి దేవి అలంకారంలో దర్శనమిచ్చిన శ్రీ వాసవి మాత

గద్వాల : దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలలో భాగంగా నేడు అమ్మవారు శ్రీ శైలపుత్రి దేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. గద్వాల పట్టణం రాజా వీధిలోని శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి దేవాలయం నందు శైలపుత్రీ దేవి రూపంలో అమ్మవారిని సుందరంగా అలంకరించారు తెల్లవారుజాము నుండే ఆలయానికి భక్తులు భారీగా తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు.అమ్మవారికి ప్రత్యేక అభిషేకాలు కుంకుమ పూజలు, నైవేద్యాలు సమర్పించారు. శైలపుత్రి దేవిని దర్శించుకుంటే ఇంట్లో ధాన్యరాశులు, సుఖ సంతోషాలు వెల్లివిరుస్తాయని భక్తుల నమ్మకం. ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు ఆలూరు రాము ప్రధాన కార్యదర్శి నరహరి శ్రీనివాసులు కోశాధికారి పత్తి రత్నాకర్ సభ్యుల ఆధ్వర్యంలో జరుగుతున్నాయి.

**ఆర్యవైశ్య సంఘం మహిళల ఆధ్వర్యంలో కోలాటం వేడుకలు...**నవరాత్రుల సందర్భంగా అమ్మవారి పూజా కార్యక్రమాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు,అర్చనలు, హారతులు నిర్వహించి భక్తులు తమ భక్తిని చాటుకున్నారు.నవరాత్రుల పర్వదినాన్ని పురస్కరించుకుని అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు నిర్వహించారు. అమ్మవారి దర్శనం కోసం భక్తులు తరలివచ్చి పూజల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రామ ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని అమ్మవారిని ప్రార్థించారు. నవరాత్రుల ఆధ్యాత్మిక ప్రాముఖ్యతను చాటిచెప్పేలా మహిళలు కోలాటం ప్రదర్శన నిర్వహించారు. ఈ పూజా కార్యక్రమం భక్తిమయ వాతావరణంలో సాగింది.ఈ కార్యక్రమంలో భక్తులు, గ్రామ ప్రజలు,చిన్నారులు తదితరులు పాల్గొన్నారు.

# తిరుమల తిరుపతికి శాశ్వత తాగునీటి పథకమేదీ?

సమయం ప్రతినిధి :ప్రపంచం నలుమూలల నుంచి యాత్రికులు తిరుమల–తిరుపతికి వస్తుంటారు. దక్షిణాది రాష్ట్రాల సమావేశాలను కేంద్ర ప్రభుత్వం తిరుపతిలోనే నిర్వహిస్తుంది. జాతీయ, అంతర్జాతీయ సెమినార్లు తిరుపతిలో జరుగుతాయి. ఇంతటి ప్రాచుర్యం గల పట్టణానికి శాశ్వత తాగునీటి వసతి లేదు. తిరుపతిలో దాదాపు లక్ష ఇళ్లకు తాగునీరు సరఫరా చేయాలి. తిరుమలకు ప్రతి రోజూ లక్ష మంది వరకూ యాత్రికులు వస్తుంటారు. తిరుమల, తిరుపతిలలో ప్రతి యాత్రికుడు కనీసం మూడు రోజులు గడుపుతాడు. ఇక తిరుపతి కార్పొరేషన్‌ను విస్తరిస్తే పలు గ్రామాల తాగునీటి బాధ్యత మున్సిపల్ కార్పొరేషన్‌పై పడుతుంది. నిన్న మొన్నటి వరకు ఇది స్మార్ట్ సిటీ జాబితాలో ఉంది. తాజాగా కేంద్ర ప్రభుత్వం ఈ పట్టణాన్ని 'ప్రగతి' పథకం కింద ఎంపిక చేసింది. ఈ నేపథ్యంలో తిరుమల తిరుపతికి శాశ్వత ప్రాతిపదికన తాగునీటి వసతి ఉండి తీరాలి. గమనార్హమైన అంశమేమంటే తిరుమలలో ఉండే మినీ జలాశయాలను మినహాయిస్తే తిరుమల తిరుపతి దాహార్తిని తీర్చే ప్రధానమైన వనరు కల్యాణి డ్యామ్. దీని నీటి నిల్వ సామర్థ్యం 0.910 టీఎంసీలైతే, వర్షాభావంతో ఈ ఏడాది అక్టోబరు 5 నాటికి అందులో కేవలం 0.204 టీఎంసీల నీరు మాత్రమే ఉంది.దురదృష్టం కొద్దీ వర్షాభావంతో పాటు ఎల్‌నినో కూడా వచ్చే సంవత్సరం వరకూ కొనసాగితే తిరుమల తిరుపతి పుణ్యక్షేత్రం పరిస్థితి ఏమిటి? కేవలం కండలేరు జలాశయంపై ఆధారపడాలి. అందులోనూ 68 టీఎంసీలకు ప్రస్తుతం 17 టీఎంసీల నీరు మాత్రమే ఉంది. క్రమంగా డెడ్ స్టోరేజ్‌కి చేరుతోంది. తిరుమల తిరుపతి శాశ్వత తాగునీటి పథకంపై ఇంజినీరింగ్ అధికారులు గానీ, స్థానిక ప్రజాప్రతినిధులు గానీ, టీటీడీ బోర్డు గానీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు సమగ్రంగా వివరించినట్లు లేదు. ప్రజాప్రతినిధులు తమ అవసరాల రీత్యా అనేక ప్రతిపాదనలు చేస్తుంటారు. కానీ వాటి సాధ్యాసాధ్యాలు, సాంకేతిక ఇబ్బందులను ఇంజినీరింగ్ అధికారులు ముఖ్యమంత్రికి సవివరంగా నివేదించాలి. ప్రధానంగా ఇంజినీర్ ఇన్ చీఫ్ జాగరూకత వహించాలి. 2025 జూన్‌లో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తిరుపతి పర్యటనకు వచ్చారు. ఈ సందర్భంగా గాలేరు–నగరి రెండో దశలో భాగంగా బాలాజీ రిజర్వాయర్ ద్వారా తిరుమల తిరుపతి ప్రజల దాహార్తిని తీరుస్తామని ప్రకటించారు. అంతేకాదు, ఏర్పేడు సమీపంలో గల మేర్లపాక చెరువు నుంచి కండలేరు జలాలను ఎత్తిపోతల ద్వారా బాలాజీ రిజర్వాయర్‌లో నింపుతామని ప్రకటించారు.సంక్రాంతి సందర్భంగా నారావారిపల్లెలో చంద్రబాబు మకాం చేసినప్పుడు కూడా హంద్రీ––నీవా ఫేజ్––2లో భాగమైన నీవా కాలువ నుంచి రూపొందించిన పథకం ద్వారా కృష్ణా జలాలను కల్యాణి జలాశయంలో నింపుతామని ప్రకటించి, పునాది రాయి వేశారు. ఇటీవల టెండర్లు కూడా పిలిచారు. ఇదిలా ఉండగా ఈ మధ్య మదనపల్లిలో జరిగిన రాయలసీమ రైజింగ్ సభలో ముఖ్యమంత్రి మాట్లాడుతూ, బాలాజీ రిజర్వాయర్ నిర్మాణం జరుగుతుందని ప్రకటించారు. అసలు తిరుమల తిరుపతి తాగునీటికి ఏ పథకం ఉద్దేశించారు? వాస్తవంలో, జిల్లాల్లో ముఖ్యమంత్రి పర్యటించే సమయంలో ఆయా శాఖాధికారులు స్థానిక అంశాలపై ఫీడింగ్ ఇస్తారు. అలా అధికారులు ఇచ్చిన సమాచారం ఆధారంగా ఆయా కార్యక్రమాల్లో ముఖ్యమంత్రి చంద్రబాబు పాల్గొని ప్రసంగించారు.రాష్ట్ర ప్రభుత్వం తిరుమల తిరుపతి తాగునీటి అవసరాలకు రెండు రిజర్వాయర్లను అమలులోకి తెచ్చే విధానపరమైన నిర్ణయం తీసుకున్నదా? అదే నిజమైతే ముఖ్యమంత్రి విధిగా ప్రకటించేవారు. అంతేకాదు, హంద్రీ–నీవా నీళ్లు కల్యాణి డ్యామ్‌కు రావాలంటే ఏడెనిమిది ఎత్తిపోతల ద్వారా, రమారమి 700 కిలోమీటర్ల దూరం నుంచి రావాలి. బహుశా ఆంధ్రప్రదేశ్‌లోనే ఏ పట్టణానికీ ఇలాంటి తరహాలో తాగునీటి పథకం అమలు జరగలేదేమో. ఇంజినీరింగ్ అధికారులు ముఖ్యమంత్రికి సాంకేతిక సంబంధమైన చిక్కులను వివరించి ఉంటే ఆయన అంగీకరించేవారు కాదేమో. ఒకవేళ ఇంతకు మించి వేరే అవకాశం లేదా పథకం లేకపోతే తప్పనిసరిగా దీన్నే అంగీకరించాలి. మరోవైపు 300 కిలోమీటర్ల దూరంలో, పూర్తి గ్రావిటీతో బాలాజీ రిజర్వాయర్ గురించి ముఖ్యమంత్రి పలుమార్లు ప్రకటించి ఉన్నారు. ఇంత గందరగోళం జరుగుతూ ఉంటే తిరుపతి ఎమ్మెల్యేతో పాటు మేయర్ పదవి కోసం ప్రయత్నిస్తున్న నేతలు నిమ్మకు నీరెత్తినట్లు ఉండటమే విషాదం. గాలేరు––నగరి సుజల స్రవంతి పట్టాలెక్కిన 2006లో ఉమ్మడి చిత్తూరు జిల్లాకు చెందిన రెండో దశకు 10 టీఎంసీల నీటి కేటాయింపులు జరిగాయి. ప్రతిపాదించిన ఏడు రిజర్వాయర్లలో మూడు టీఎంసీల సామర్థ్యంతో బాలాజీ రిజర్వాయర్ కూడా ఉంది. ఇందులో ఒక టీఎంసీ నీళ్లు తిరుమల తిరుపతి శాశ్వత తాగునీటికి ఉద్దేశించారు. అప్పట్లో టెండర్లు పూర్తయినా తట్టెడు మట్టి కూడా పడలేదు.రాష్ట్ర విభజనానంతరం చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రి అయిన తర్వాత కొంత కదలిక వచ్చింది. పాత కాంట్రాక్టర్ల స్థానంలో కొత్తవారు వచ్చారు. 250 కోట్ల వ్యయంతో ఉన్న బాలాజీ రిజర్వాయర్ నిర్మాణం ప్రస్తుతం ఎటూకాకుండా ఉంది. దాదాపు 50 కోట్ల రూపాయల పనులు జరిగాయి. ఫస్ట్ ఫేజ్‌కు అటవీశాఖ అనుమతి కూడా లభించింది. అయితే 2019లో జగన్మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయ్యాక ఒక్క జీవోతో రాష్ట్రంలోని 350 టెండర్లు రద్దు చేశారు. ఇందులో ఆయన తండ్రి వై.యస్ రాజశేఖరరెడ్డి హయాంలో జరిగిన టెండర్లు కూడా ఉన్నాయి.ఇలా రద్దయిన టెండర్లలో నిర్మాణంలో ఉన్న బాలాజీ రిజర్వాయర్‌తో పాటు గాలేరు–నగరి రెండో దశకు చెందిన అన్ని టెండర్లూ ఉన్నాయి. ఇన్ని సంవత్సరాలు గడచినా యథాస్థితే కొనసాగుతోంది. ఇటీవల ప్రతిపాదనకు వచ్చిన హంద్రీ–నీవా పథకానికి టెండర్లు పిలిచారు. ఏళ్ల తరబడి నానుతూ ఉన్న బాలాజీ రిజర్వాయర్ మాత్రం ముఖ్యమంత్రి ప్రకటనలకు, కాగితాలకే పరిమితమైంది.

# రాజ్యాంగం కల్పించిన హక్కులను కాలరాస్తున్న సొంత గ్రామం మౌనంగా ఎమ్మెల్యే






## ఎమ్మెల్యే సాక్షిగా దళితులపై అవమానకర వివక్షత మూకుమ్మడి దాడి. చట్టపర చర్యల కోసం ఎస్. పి గారిని ఆశ్రయించిన దళిత బిడ్డలు.

వనపర్తి : పెద్దమందడి మండలం ఎమ్మెల్యే సొంత గ్రామం మంగంపల్లి లో నేటికి అస్పృశ్యత, అసమానతలు,వివక్షత కొనసాగడం నిజంగా నేటి సమాజానికి తలవంపు ప్రజాస్వామ్య హక్కులకు భంగం కలిగించడం అవుతుంది. కాంగ్రెస్ పార్టీ జాతీయ నాయకులు రాహుల్ గాంధీ డాక్టర్. బి.ఆర్.అంబేద్కర్ రాజ్యాంగాన్ని రోజు చేతపట్టుకొని హక్కులు, సమైక్యత,సమానత అని సందేశం ఇస్తారు. ఇక్కడి ఎమ్మెల్యే సొంత గ్రామంలో దళితుల పట్ల వివక్షత, వర్ణవిభేదాలు సృష్టించడం దేనికి సంకేతం దళితులకు సమాధానం చెప్పాలని డిమాండ్. నిన్న గ్రామంలోని ఆలయ పునర్నిర్మాణం కోసం ప్రభుత్వ నిధులు కోటి రూపాయలతో శంకుస్థాపన పూజ కార్యక్రమాలు నిర్వహిస్తున్న సందర్భంగా మాసాని.సుధీర్ దళితులకు ఎందుకు తరతరాలుగా ప్రవేశం కల్పించడం లేదని స్వయంగా వెళ్ళి దర్శనం చేసుకొని వస్తుండగా గ్రామములోని రెడ్డి వర్గం మూకుమ్మడిగా సుధీర్ పై దాడికి ప్రయత్నించి మాదిగలకు ఆలయ ప్రవేశం లేదని ఎందుకు దర్శనం చేసుకున్నావు అని దౌర్జన్యం చేయడం జరిగింది.ఆ సమయములో ఎమ్మెల్యే స్వయంగా పూజలో ఉండి కూడా రెడ్డి వర్గాని సముదాయించకుండా వివక్షత చూపడం రాజ్యాంగ ఉల్లంఘన చేయడం జరిగింది.కొద్దిరోజుల క్రితం స్వయంగా దళితులకు ఆలయ ప్రవేశం కల్పించాలని వినతిపత్రం సమర్పించిన ఎటువంటి చర్యలు తీసుకోకుండా ఒక వర్గానికి వత్తాసు పలకడం దళితుల పట్ల వివక్షత చూపడం దారుణం.

**ఎస్. పికి వినతి:** మంగంపల్లి గ్రామంలో జరుగుతున్న అస్పృశ్యత, అసమానతలకు పాల్పడుతున్న వ్యక్తులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని,దళితులను ఆలయ ప్రవేశం కల్పించాలని,అదేవిధంగా ఆలయంలోకి ఎందుకు ప్రవేశించావు అని నాపై దుర్భాషాలాడిన కుప్పిరెడ్డి. వెంకట్రామా రెడ్డి,ఎద్దుల. శ్రీనివాస్ రెడ్డిలపై ఎస్సీ.ఎస్టీ కేసు నమోదు చేసి చర్యలు తీసుకోవాలని మాసాని.సుధీర్ మరియు దళిత సంఘాలు వినతి పత్రం సమర్పించారు. వినతిపత్రం సమర్పించిన వారిలో గంధం.పరంజ్యోతి ,సిరిగిరి.మన్నెం,పానుగంటి. సురేష్,మంద. రాము, పానుగంటి. రాము, జె.నాగరాజు,తప్పెట. అశోక్, జి. రాహుల్, చిట్యాల. తిరుపతి, వడ్డెమాన్. మహేంద్ర, సిరివట్టి.శంకర్, అంజి తదితరులు ఉన్నారు.

# ప్రశాంతంగా నైపుణ్య శిక్షణ ఫైనల్ పరీక్షలు

## మహిళలు స్వయం ఉపాధి సాధించేందుకు నైపుణ్య శిక్షణ దోహదం





మహబూబ్ నగర్ : మహబూబ్‌నగర్ ఫస్ట్ శిక్షణ కేంద్రంలో మహబూబ్‌నగర్ ఫస్ట్ ఆధ్వర్యంలో, స్థానిక ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ యెన్నం శ్రీనివాస్ రెడ్డి సహకారంతో నియోజకవర్గంలోని నిరుద్యోగ మహిళలకు అందిస్తున్న వివిధ నైపుణ్య శిక్షణ కోర్సులకు సంబంధించిన ఆరవ బ్యాచ్ తుది పరీక్షలు విజయవంతంగా, ప్రశాంత వాతావరణంలో ముగిశాయి. పరీక్షలను సెట్విన్ (SETWIN) అధికారులు, మహబూబ్‌నగర్ ఫస్ట్ పర్యవేక్షకులు గుండా మనోహర్, ఇన్‌ఛార్జ్ నిజలింగప్ప తదితరులు క్షేత్రస్థాయిలో పరిశీలించి పర్యవేక్షించారు. పరీక్షల నిర్వహణ సజావుగా జరిగేలా అవసరమైన ఏర్పాట్లను సమీక్షించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ., నిరుద్యోగ మహిళల్లో వృత్తి నైపుణ్యాలను పెంపొందించి, వారికి ఉపాధి అవకాశాలు కల్పించడంతో పాటు స్వయం ఉపాధి సాధించేలా ప్రోత్సహించడమే ఈ శిక్షణ కార్యక్రమాల ప్రధాన లక్ష్యమని తెలిపారు. శిక్షణ ద్వారా మహిళలు ఆర్థికంగా స్వావలంబన సాధించి తమ కుటుంబాల అభివృద్ధికి తోడ్పడగలరని పేర్కొన్నారు. మహిళల ఆర్థిక సాధికారతకు, ఉపాధి అవకాశాల మెరుగుదలకు ఇటువంటి నైపుణ్య శిక్షణ కార్యక్రమాలు ఎంతగానో దోహదపడతాయని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో సెట్విన్ పరీక్షల నిర్వాహకులు హాజీ అలీ, సరిత, అజిమత్ ఉన్నీసా, లత తదితరులు పాల్గొన్నారు.

# నవరాత్రులలో జములమ్మ దేవికి అభిషేక పూజలు



అమరచింత : అమరచింత మున్సిపాలిటీ పరిధిలో వెలసిన శ్రీ జములమ్మ దేవి ఆలయంలో దసరా దుర్గాదేవి నవరాత్రుల ఉత్సవాలలో భాగంగా ప్రతిరోజు జములమ్మ దేవాలయంలో అభిషేక పూజ కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని అందులో భాగంగా మూడవరోజు మంగళవారం కూడా అమ్మవారికి వేద పండితుల మంత్రోచ్ఛారణ మంగళ వాయిద్యాలతో అమ్మవారికి పంచామృతాలతో పసుపు కుంకుమ అభిషేకంతో పాటు పట్టుచీరతో పుష్పాలతో అలంకరింపజేసి ఒడి బియ్యంతో అమ్మవారికి ఒడినింపి అభిషేక పూజ కార్యక్రమాలు నిర్వహించారు. దేవి నవరాత్రుల ఉత్సవాలలో ప్రతిరోజు అమ్మవారి పూజ కార్యక్రమం జరుగుతుందని కావున భక్తులు నవరాత్రులలో జరిగే నిత్య పూజలకు అమ్మవారిని దర్శనం చేసుకోవాలని జమ్ములమ్మ దేవాలయ కమిటీ అధ్యక్షులు యమ్.నరసింహులు తెలిపారు.

**మూడో రోజు పూజా కార్యక్రమంలో భాగంగా పూజారులు**

దిపేస్ మిశ్రా పల్లవి వెంకటేష్ పద్మమ్మ తాయప్ప ఒకటో వార్డు కౌన్సిలర్ లక్ష్మీ వెంకటేష్, దోమ రవి సరళ, తిరుమలి దామోదర్ జయమ్మ, పారుపల్లి గోవర్ధన్ శిరీష, కొంకతి బాలరాజు మంజుల, అజయ్, ఉదయ్, సుజాత శ్రీనివాసులు సన్నాయి వాయిద్య కారులు బాలరాజు గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

# 27వ రోజుకు చేరుకున్న బీసీ రాజ్యాధికార యాత్ర

## మహబూబ్‌నగర్ నుంచి జడ్చర్ల వైపు సాగుతున్న తీన్మార్ మల్లన్న పాదయాత్ర..

సమయం ప్రతినిధి:బీసీల రాజ్యాధికారమే లక్ష్యంగా ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న చేపట్టిన బీసీ రాజ్యాధికార యాత్ర 27వ రోజు మహబూబ్‌నగర్ నుంచి జడ్చర్ల వైపు సాగుతున్న పాదయాత్రలో దారిపొడవునా ప్రజలను కలుస్తూ, వారి సమస్యలను అడిగి తెలుసుకుంటూ ముందుకు సాగుతున్నారు.మల్లన్న పాదయాత్రకు సంఘీభావం తెలిపిన వికలాంగుడు ప్రజల కష్టాలను ప్రత్యక్షంగా తెలుసుకుంటూ, వారి సమస్యలను వింటూ, బీసీల రాజకీయ చైతన్యం, రాజ్యాధికార ఆవశ్యకతను వివరిస్తూ యాత్రను కొనసాగిస్తున్నారు.




# దేవీ నవరాత్రుల మూడో రోజు.. కీసరగుట్టలో అన్నపూర్ణా దేవిగా దర్శనమిచ్చిన అమ్మవారు

**కీసరగుట్టలో వైభవంగా శ్రీ అన్నపూర్ణ దేవి అలంకరణ**
**దేవి నవరాత్రుల మూడో రోజు ప్రత్యేక పూజలు..**
**భక్తిశ్రద్ధలతో అమ్మవారిని దర్శించుకున్న భక్తులు**



కీసర సమయం ప్రతినిధి అక్టోబర్ 13 : కీసరగుట్ట: దేవి నవరాత్రుల ఉత్సవాల్లో భాగంగా మూడో రోజు కీసరగుట్టలోని శ్రీ భవానీ శివ దుర్గా సమేత రామలింగేశ్వర స్వామి దేవస్థానంలో శ్రీ అన్నపూర్ణ దేవి అలంకరణను వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారిని విశేషంగా అలంకరించి భక్తులకు దర్శనమిచ్చేలా ఏర్పాట్లు చేశారు. ఆలయ అర్చకులు సంప్రదాయబద్ధంగా పూజలు, అర్చనలు నిర్వహించి అమ్మవారికి ప్రత్యేక ప్రార్థనలు సమర్పించారు.హిందూ సంప్రదాయంలో శ్రీఅన్నపూర్ణ దేవి అన్నదానానికి, ఆహార సమృద్ధికి ప్రతీకగా పూజలందుకుంటారు. సమస్త జీవరాశికి ఆహారాన్ని అందించే తల్లిగా అమ్మవారిని భక్తులు కొలుస్తారు.అన్నపూర్ణ దేవి అనుగ్రహంతో ప్రతి ఇంటా అన్నసమృద్ధి వెల్లివిరియాలని, ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో జీవించాలని భక్తులు ప్రార్థించారు.దేవి నవరాత్రుల సందర్భంగా ఆలయంలో ప్రత్యేక అలంకరణలు, పూజా కార్యక్రమాలు భక్తులను ఆకట్టుకుంటున్నాయి. అమ్మవారి దర్శనం కోసం భక్తులు ఆలయానికి చేరుకుని భక్తిశ్రద్ధలతో పూజల్లో పాల్గొంటున్నారు. నవరాత్రుల ఉత్సవాలతో కీసరగుట్ట ఆలయ పరిసరాల్లో ఆధ్యాత్మిక శోభ నెలకొంది. అమ్మవారి కృపాకటాక్షాలు అందరిపై ఉండాలని భక్తులు ఆకాంక్షించారు.

# షాద్‌నగర్‌లోని రుద్రాక్ష శివ హనుమాన్ దేవాలయంలో అన్నపూర్ణ దేవి అలంకరణ



షాద్‌నగర్: రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్ బైపాస్ రోడ్డులోని శివ హనుమాన్ కాలనీలో ఉన్న శ్రీశ్రీశ్రీ రుద్రాక్ష శివ హనుమాన్ దేవాలయంలో దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయి. మంగళవారం, అక్టోబర్ 13న నవరాత్రుల మూడవ రోజు సందర్భంగా అమ్మవారిని అన్నపూర్ణ దేవి అలంకరణలో సుందరంగా అలంకరించారు. ఈ సందర్భంగా ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక అభిషేకం, గౌరీ పూజ, పూజా కార్యక్రమాలు నిర్వహించి హారతులు సమర్పించారు. అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు తరలివచ్చారు. దేవీ శరన్నవరాత్రుల సందర్భంగా తొమ్మిది రోజుల పాటు ప్రతిరోజూ ఉదయం 8 గంటలకు అమ్మవారికి అభిషేకం, గౌరీ పూజ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఆలయ అభివృద్ధి కమిటీ తెలిపింది. కాలనీవాసులు, పుర ప్రముఖులు, భక్తులు, భజన బృందాల సభ్యులు సకాలంలో హాజరై అమ్మవారి పూజా కార్యక్రమాల్లో పాల్గొని అమ్మవారి కృపకు పాత్రులు కావాలని ఆలయ కమిటీ సభ్యులు కోరారు.

సమయం
బుధవారం 14 అక్టోబర్ 2026

# రంగారెడ్డి జిల్లాలో బతుకమ్మ వేడుకల పోస్టర్ ఆవిష్కరణ

## ఈ నెల 15న ఐడీఓసీ ప్రాంగణంలో జిల్లా స్థాయి బతుకమ్మ సంబరాలు

**రంగారెడ్డి, (సమయం ప్రతినిధి):** రంగారెడ్డి జిల్లా కలెక్టర్ శ్రీ నారాయణరెడ్డి, అదనపు కలెక్టర్ డా. కిరణ్మయి సమక్షంలో జిల్లా బతుకమ్మ వేడుకలకు సంబంధించిన పోస్టర్‌ను టీజీఓల సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు డా. కె. రామారావు, శ్రీనేష్ కుమార్ నోరి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగకు విశిష్టమైన ప్రాధాన్యత ఉందని, మహిళల ఐక్యతకు, ప్రకృతి ఆరాధనకు ప్రతీకగా నిలిచే ఈ పండుగను ప్రతి ఒక్కరూ ఉత్సాహంగా జరుపుకోవాలని ఆకాంక్షించారు. టీజీఓల సంఘం రంగారెడ్డి జిల్లా మహిళా విభాగం చైర్‌పర్సన్ శ్రీమతి రేవతి మాట్లాడుతూ ఈ నెల 14న హైదరాబాద్‌లోని నాంపల్లి టీజీఓ భవన్‌లో రాష్ట్రస్థాయి బతుకమ్మ వేడుకలు, 15న రంగారెడ్డి జిల్లా ఐడీఓసీ ప్రాంగణంలో జిల్లా స్థాయి వేడుకలు నిర్వహించనున్నట్లు తెలిపారు. మహిళా ఉద్యోగులందరూ పెద్ద సంఖ్యలో పాల్గొని తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాల వైభవాన్ని చాటుతూ వేడుకలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కేంద్ర మహిళా విభాగం కోశాధికారి శ్రీమతి



శాంతిశ్రీతో పాటు డి. సైదమ్మ, బాలేశ్వరి, రాణి, రాకేష్, మహేష్, ఐశ్వర్య, స్వప్న, సంధ్య, జ్యోత్స్న, ప్రమీల, లావణ్య, స్వాతి, పద్మాంజలి, సమంత, శ్రీదేవి, మైతిలి, రాజ్యలక్ష్మి, రజిత, కరుణ, రవాణి, భాను, పుల్లమ్మ, ప్రశాంతి, మమత, శ్రీలత, భవాని తదితరులు పాల్గొన్నారు.

# బాలికల హక్కులపై అవగాహన.. బయ్యారం పాఠశాలలో ప్రత్యేక కార్యక్రమం







మహబూబాబాద్ జిల్లా; (అక్టోబర్ 13 వేకువ సమయం ప్రతినిధి): జిల్లా మహిళా సాధికారత కేంద్రం ఆధ్వర్యంలో బేటీ బచావో – బేటీ పఢావో' కార్యక్రమంలో భాగంగా అంతర్జాతీయ బాలికా దినోత్సవాన్ని పురస్కరించుకొని మంగళవారం బయ్యారం బాలికల ఉన్నత పాఠశాలలో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పాఠశాల ఇన్‌ఛార్జి ఉపాధ్యాయురాలు లావణ్య అధ్యక్షత వహించగా, ముఖ్య అతిథిగా మండల విద్యాధికారి లక్ష్మణ్ రావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా బేటీ బచావో – బేటీ పఢావో' కార్యక్రమం యొక్క ప్రాముఖ్యతను వివరిస్తూ బాలికల రక్షణ, విద్య, సాధికారత, లింగ సమానత్వంపై విద్యార్థినులకు అవగాహన కల్పించారు. బాలికలు విద్యతో పాటు అన్ని రంగాల్లో రాణించాలని, వారికి సమాన అవకాశాలు కల్పించాలని, బాలికల పట్ల వివక్షను రూపుమాపి వారి ఉజ్వల భవిష్యత్తుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని వక్తలు పిలుపునిచ్చారు. బాలికల్లో సృజనాత్మకతను పెంపొందించడంతో పాటు బాలికల విద్య, హక్కులపై అవగాహన కల్పించే ఉద్దేశంతో 'బేటీ బచావో – బేటీ పఢావో' అంశంపై డ్రాయింగ్, పాటల పోటీలను నిర్వహించారు. ఈ పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థినులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా మహిళా సాధికారత కేంద్రం కో-ఆర్డినేటర్ మహేశ్వరి, అరుణ, సంధ్యారాణి, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

# బడ్జెట్ ఉన్నా...కార్మికులకు అందని మూడు నెలల జీతాలు




మూడు నెలల పెండింగ్ జీతాల చెల్లింపు జాప్యం నిరసిస్తూ నేటి నుంచి జడ్చర్ల ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి కాంట్రాక్ట్ కార్మికుల మెరుపు సమ్మె. తెలంగాణ మెడికల్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) రాష్ట్ర కార్యదర్శి.పి సురేష్ మెరుపు సమ్మె నోటి సంద చేసిన ఆసుపత్రి కార్మికులు.

జడ్చర్ల : తెలంగాణ రాష్ట్ర అతిపెద్ద బతుకమ్మ దసరా పండుగకు కూడా ప్రభుత్వ ఆసుపత్రి కార్మికులకు జీతాలు అందని దుస్థితి నెలకొనడం అత్యంత బాధాకరమని తెలంగాణ మెడికల్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) రాష్ట్ర కార్యదర్శి పి.సురేష్ ఆవేదన వ్యక్తం చేశారు. మూడు నెలల పెండింగ్ వేతన బకాయిలను చెల్లించకుండా తీవ్రమైన నిర్లక్ష్యం ధోరణిని నిరసిస్తూ రేపటి నుండి జడ్చర్ల ఏరియా ప్రభుత్వ ఆసుపత్రి కాంట్రాక్టు పారిశుద్ధ్య సెక్యూరిటీ పేషెంట్ కేర్ కార్మికులు మెరుపు సమ్మెకు దిగుతున్నట్లు తెలుపుతూ ఏఐటీయూసీ ఆధ్వర్యంలో మంగళవారం ఆసుపత్రి సిబ్బందికి మెరుపు సమ్మె నోటీసులు అందజేశారు. ఈ సందర్భంగా పి.సురేష్ మాట్లాడుతూ:– రాష్ట్ర ప్రభుత్వం బతుకమ్మ పండుగ ఉత్సవాలను వాడవాడల ఘనంగా నిర్వహించాలని చెబుతున్న మరోపక్క అధికారుల అలసత్వం కాంట్రాక్టర్ల నిర్లక్ష్యం కారణంగా జడ్చర్ల ఏరియా ఆసుపత్రిలో మాత్రం నెలలు గడుస్తున్న వేతనాలు అందించడం లేదని అన్నారు. ప్రభుత్వం ముందు చూపుతో దాదాపు ఆగస్టు వరకు వేతన బడ్జెట్ విడుదల చేసిందని కానీ కార్మికులకు మాత్రం జులై ఆగస్టు సెప్టెంబర్ నెలలుగా జీతాలే చెల్లించలేదని వాపోయారు. పెండింగ్ జీతాల కోసం అధికారులను కాంట్రాక్టర్ ను ఎన్నిసార్లు విన్నవించిన పట్టించుకోవడంలేదని అప్పుడు ఇప్పుడు అంటూ కహానీలు చెబుతున్నారని మండిపడ్డారు. మూడు నెలలుగా జీతాలు ఇవ్వకుంటే కార్మికుల జీవనం గడిచేది ఎలా అని ప్రశ్నించారు. కావున విధిలేని పరిస్థితుల్లో బుధవారం నుండి మెరుపు సమ్మెకు దిగుతున్నామని, వేతనాలు చెల్లించే వరకు నిరవధిక మెరుపు సమ్మె కొనసాగుతుందని ప్రకటించారు. జిల్లా కలెక్టర్ స్థానిక శాసనసభ్యులు జోక్యం చేసుకొని కార్మికులకు న్యాయం జరిగే విధంగా కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు భాగీ కృష్ణయ్య, ఆస్పత్రి బ్రాంచ్ యూనియన్ నేతలు కార్మికులు నాగరాజ్,రాజేష్, అబ్దుల్ వహీద్, విజయలక్ష్మి, మన్నెమ్మ, అలివేలమ్మ, స్వాతి, శివలీల, పద్మ, భార్గవి,నీరజ, జయమ్మ, లక్ష్మి, మంగమ్మ,శ్రీలత, అంజలి తదితరులు పాల్గొన్నారు.

# కీసర మాంకాలమ్మ అమ్మవారి ఆలయ పునర్నిర్మాణానికి చర్యలు

కీసర సమయం ప్రతినిధి అక్టోబర్ 13: కీసర గ్రామంలోని ప్రధాన కూడలిలో ఉన్న మాంకాలమ్మ అమ్మవారి ఆలయ పునర్నిర్మాణానికి త్వరలో చర్యలు చేపట్టనున్నట్లు ఆలయ వంశపారంపర్య నిర్వాహకులు తెలిపారు. ఈ మేరకు నిర్వాహకులందరూ.. కలిసి త్వరలో సమావేశం ఏర్పాటు చేసుకుని ఆలయ పునర్నిర్మాణంపై చర్చించనున్నట్లు వెల్లడించారు. ఆలయం ప్రధాన రహదారికి సమీపంలో ఉండటంతో ప్రభుత్వ నిబంధనలు, సంబంధిత అనుమతులపై ప్రభుత్వ అధికారులతో చర్చించి ముందుకు సాగుతామని పేర్కొన్నారు. ఆలయ పునర్నిర్మాణానికి అవసరమైన ఆదాయ వనరులను సమకూర్చుకుని, సమష్టి కృషితో నిర్మాణ పనులు చేపట్టేందుకు ప్రణాళిక రూపొందిస్తామని తెలిపారు. మాంకాలమ్మ అమ్మవారి ఆలయ అభివృద్ధికి భక్తులు,



గ్రామస్తుల సహకారంతో పాటు ప్రభుత్వ సహకారం కూడా తీసుకునేందుకు ప్రయత్నిస్తామని ఆలయ వంశపారంపర్య నిర్వాహకులు స్పష్టం చేశారు. మాంకాలమ్మ అమ్మవారి వంశపారంపర్య నిర్వాహకులు, కీసర.

# ఆసుపత్రుల్లో వైద్య సేవల ధరల పట్టిక తప్పనిసరిగా ప్రదర్శించాలి

## కేంద్ర ఆరోగ్య శాఖ చర్యకు స్వాగతం పలికిన ధరంసోత్ సీతారాం నాయక్




మహబూబాబాద్ జిల్లా; అక్టోబర్ 13 (వేకువ సమయం ప్రతినిధి): ఆసుపత్రులు, వైద్యశాలల్లో వైద్య పరీక్షలు, చికిత్సలు, ఇతర వైద్య సేవలకు సంబంధించిన ధరల వివరాలను ప్రజలకు స్పష్టంగా కనిపించే ప్రదేశాల్లో ప్రదర్శించాలనే కేంద్ర ఆరోగ్య శాఖ సూచనను బీజేపీ నాయకులు స్వాగతించారు. ఈ చర్య వల్ల రోగులకు వైద్య ఖర్చులపై ముందస్తు అవగాహన కలుగుతుందని బీజేపీ రాష్ట్ర మండలి సభ్యుడు కాచ్వాల్ శ్యామసుందర్ శర్మ, జిల్లా నాయకుడు ధరంసోత్ సీతారాం నాయక్ పేర్కొన్నారు. కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ అక్టోబర్ 12న రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలకు పంపిన లేఖలో వైద్య సేవలు, సదుపాయాలకు సంబంధించిన ధరల పట్టికలను స్పష్టంగా కనిపించే ప్రదేశాల్లో ప్రదర్శించే అంశంపై దృష్టి సారించాలని సూచించినట్లు వారు తెలిపారు. వర్తించే నిబంధనల ప్రకారం స్థానిక భాషతో పాటు ఆంగ్లంలోనూ ధరల వివరాలను ప్రదర్శించడం ద్వారా ప్రజలకు అవసరమైన సమాచారం అందుబాటులో ఉంటుందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ఆసుపత్రులకు వెళ్లే సామాన్య ప్రజలకు వైద్య పరీక్షలు, చికిత్సలు, ఇతర సేవలకు ఎంత ఖర్చవుతుందో ముందుగానే తెలుసుకునే అవకాశం ఉండాలని అన్నారు. ధరల పట్టికలు అందుబాటులో ఉంటే రోగులు తమ ఆర్థిక పరిస్థితికి అనుగుణంగా వైద్య సేవలను ఎంచుకోవచ్చని తెలిపారు. వైద్య బిల్లుల విషయంలో ఏర్పడే సందేహాలు, గందరగోళం, వివాదాలను తగ్గించేందుకు ఈ చర్య ఉపయోగపడుతుందని అభిప్రాయపడ్డారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వం ప్రజారోగ్యానికి, రోగుల ప్రయోజనాల పరిరక్షణకు, వైద్య రంగంలో పారదర్శకతకు ప్రాధాన్యత ఇస్తోందని బీజేపీ నాయకులు పేర్కొన్నారు. కేంద్రం సూచించిన మార్గదర్శకాలను రాష్ట్ర ప్రభుత్వాలు సంబంధిత నిబంధనల ప్రకారం అమలు చేయాలని కోరారు. ప్రజలు కూడా వైద్య పరీక్షలు, చికిత్సలు చేయించుకునే ముందు వాటి ఖర్చుల వివరాలను అడిగి తెలుసుకోవాలని, వైద్య బిల్లులు, చెల్లింపు రసీదులను భద్రపరచుకోవాలని సూచించారు. ధరల విషయంలో సందేహాలు తలెత్తితే ఆసుపత్రి యాజమాన్యాన్ని వివరణ కోరాలని, అవసరమైతే సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లాలని తెలిపారు. వైద్య సేవల ధరలపై స్పష్టమైన సమాచారం అందుబాటులో ఉండటం ద్వారా రోగులకు ప్రయోజనం కలగడమే కాకుండా, వైద్య వ్యవస్థలో జవాబుదారీతనం పెరుగుతుందని బీజేపీ నాయకులు పేర్కొన్నారు.

# మహబూబాబాద్‌లో 14 నా ఆహార వ్యాపారులకు లైసెన్స్ మేళా

## కొత్త లైసెన్సులు, పునరుద్ధరణకు ప్రత్యేక అవకాశం



మహబూబాబాద్ జిల్లా, అక్టోబర్ 13 (వేకువ సమయం ప్రతినిధి):జిల్లాలోని ఆహార వ్యాపారులకు లైసెన్సులు, నమోదు పత్రాలు పొందేందుకు ప్రత్యేక మేళా నిర్వహించనున్నట్లు జిల్లా ఆహార భద్రత అధికారి వి. ధర్మేందర్ తెలిపారు. రాష్ట్ర ఆహార భద్రత కమిషనర్ ఆదేశాల మేరకు అక్టోబర్ 14న ఈ మేళా నిర్వహిస్తున్నట్లు సోమవారం విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లా కలెక్టరేట్‌లోని రెండో అంతస్తులో, ఎస్–2 గదిలో ఉన్న ఆహార తనిఖీ అధికారి కార్యాలయంలో ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు మేళా కొనసాగుతుందని తెలిపారు. ఆహార పదార్థాల విక్రయదారులు, హోటళ్లు, చిరుతిళ్ల దుకాణాల నిర్వాహకులు, ఇతర ఆహార వ్యాపారులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు. కొత్త లైసెన్సులు, నమోదు పత్రాలు పొందడంతో పాటు గడువు ముగిసిన వాటిని పునరుద్ధరించుకోవచ్చని వెల్లడించారు. మరిన్ని వివరాలకు 9000284353 నంబరులో జిల్లా ఆహార భద్రత అధికారి వి. ధర్మేందర్‌ను సంప్రదించాలని సూచించారు.

# సూర్యాపేటకు మంజూరైన బుల్లెట్ రైలును అడ్డుకుంటున్న కాంగ్రెస్ ప్రభుత్వం: మాజీ ఎమ్మెల్యే సంకినేని వెంకటేశ్వరరావు ఆగ్రహం






**సూర్యాపేట, అక్టోబర్ 13, 2026:** కేంద్ర ప్రభుత్వం ఇప్పటికే సూర్యాపేటకు బుల్లెట్ రైలు స్టేషన్‌ను మంజూరు చేసినప్పటికీ, రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం కుట్రపూరితంగా అలైన్‌మెంట్‌ను మారుస్తూ పంపిన ప్రతిపాదనలను వెనక్కి తీసుకోవాలని, మొదటి రెండు ప్రతిపాదనల ప్రకారమే సూర్యాపేట మీదుగా బుల్లెట్ ట్రైన్ మార్గాన్ని కొనసాగించాలని డిమాండ్ చేస్తూ గత 61 రోజులుగా బుల్లెట్ ట్రైన్ సాధన సమితి ఆధ్వర్యంలో నిరంతరాయంగా జరుగుతున్న రిలే నిరాహార దీక్షలకు భారతీయ జనతా పార్టీ (BJP) తన సంపూర్ణ మద్దతును కొనసాగిస్తోంది. ఈ ఉద్యమంలో బీజేపీ శ్రేణులు దీక్షా శిబిరంలో కూర్చుని రాష్ట్ర ప్రభుత్వ మొండి వైఖరిపై నిరసన వ్యక్తం చేశారు. ఈరోజు దీక్షా కార్యక్రమంలో చివేముల మండల పార్టీ అధ్యక్షులు మాధవరపు అనిల్ రావు ఆధ్వర్యంలో ముఖ్య నాయకులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో తరలివచ్చి నిరాహార దీక్షకు కూర్చున్నారు. ఈ కార్యక్రమానికి బీజేపీ రాష్ట్ర నాయకులు, సూర్యాపేట మాజీ శాసనసభ్యులు సంకినేని వెంకటేశ్వరరావు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. దీక్షలో కూర్చున్న చివేముల మండల నాయకులకు ఆయన పూలమాలలు వేసి సంఘీభావం ప్రకటించారు.. ఈ సందర్భంగా లిసంకినేని వెంకటేశ్వరరావు సమావేశంలో మాట్లాడుతూ, రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం సూర్యాపేట జిల్లా ప్రజల పట్ల అవలంబిస్తున్న పక్షపాత, నిరంకుశ వైఖరిపై తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు.

**రాష్ట్ర ప్రభుత్వ కుట్ర బయటపడింది:**

కేంద్ర ప్రభుత్వం మొదట రూపొందించిన ఒకటి, రెండు అలైన్‌మెంట్ల ప్రకారం బుల్లెట్ ట్రైన్ మార్గం జాతీయ రహదారి 65 (NH-65) కి సమాంతరంగా చౌటుప్పల్, సూర్యాపేట, కోదాడ మీదుగా వెళ్ళాల్సి ఉంది. దీని ప్రకారం సూర్యాపేటకు స్టేషన్ కూడా మంజూరైంది. కానీ, ప్రస్తుత రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగా సూర్యాపేటను నిర్వీర్యం చేయడానికి, రూటును మార్చి మూడవ ప్రతిపాదనను (ఫ్యూచర్ సిటీ, హాలియా, వాడపల్లి మీదుగా) కేంద్రానికి పంపి సూర్యాపేట ప్రజల నోటికాడి కూడును లాగేసుకుంటోంది.. రాష్ట్ర ప్రభుత్వ పెద్దల రియల్ ఎస్టేట్ లాభాల కోసమే అలైన్మెంట్ నూ మారుస్తున్నారు..

**కేంద్రం ఇస్తుంటే, రాష్ట్రం అడ్డుపడుతోంది**

ఉమ్మడి నల్గొండ జిల్లాలోనే అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న సూర్యాపేటకు ఇప్పటివరకు సరైన రైల్వే కనెక్టివిటీ లేదనే విషయాన్ని గుర్తించి, కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం ఇక్కడి ప్రజలకు న్యాయం చేస్తూ స్టేషన్ మంజూరు చేస్తే, రాష్ట్ర ప్రభుత్వం మాత్రం రాజకీయ స్వార్థంతో రూట్ మార్పు ప్రతిపాదనలు పంపి అడ్డుపడుతోంది. కేంద్రం రైలు ఇస్తానంటుంటే, రాష్ట్ర ప్రభుత్వం నోటికాడికి వచ్చిన బువ్వను అందరినీ అందుకోనివ్వకుండా చేస్తోంది.

**వైఖరి స్పష్టం చేయాలి – లేదంటే మీజ ఎన్నికల్లో బుద్ధి చెబుతాం:**

ఈ అలైన్‌మెంట్ మార్పుపై కాంగ్రెస్ ప్రభుత్వం మరియు స్థానిక అధికార పార్టీ నాయకులు తమ వైఖరిని తక్షణమే స్పష్టం చేయాలి. సూర్యాపేట ప్రజల ఆకాంక్షలకు విరుద్ధంగా వ్యవహరిస్తే, రాబోయే గ్రాడ్యుయేట్ మరియు ఉపాధ్యాయ ఎమ్మెల్సీ (మీజ) ఎన్నికల్లో ఇక్కడి ప్రజలు, నిరుద్యోగులు, విద్యావంతులు కాంగ్రెస్ పార్టీకి ఓటు రూపంలో తగిన బుద్ధి చెప్పడం ఖాయం.. ఇట్టి రిలే నిరాహార దీక్షలో జిల్లా కౌన్సిల్ సభ్యులు పేర్వాల లక్ష్మణరావు , జిల్లా నాయకులు జంపాల వెంకన్న , రమావత్ ఝలస్త్రష్ణు నాయక్, వీరన్న నాయక్ , దారావత్ బాలు నాయక్ , షేక్ జానీ బాషా , బిట్టు నాగరాజు, మండల నాయకులు దొంగరి అంజయ్య, పగిళ్ల జానయ్య, పెద్దపోలు వీరేందర్ , పటాన్ పాషా, అశోక్, గన్నోజు భరత్ , రవి నాయక్ , ఉపసర్పంచ్ పలస వెంకన్న , కరుణాకర్ ,మరియు ముఖ్య నాయకులు ఉన్నారు. నిరసన దీక్షలో ఉన్న చివేముల మండలం నాయకులకు సంఘీభావం తెలియజేయడానికి మాజీ మున్సిపల్ చైర్మన్ జుట్టుకొండ సత్యనారాయణ , జిల్లా ప్రధాన కార్యదర్శి చల్లమల్ల నరసింహ, మైనారిటీ మోర్చా రాష్ట్ర కార్యదర్శి ఎండి అబిద్ ,అసెంబ్లీ కన్వీనర్ కర్నాటి కిషన్, ప్రధానమంత్రి విశ్వకర్మ యోజన జిల్లా కన్వీనర్ సలిగంటి వీరేందర్, మండల అధ్యక్షులు అలుగుబెల్లి సైదిరెడ్డి, తాళ్లపల్లి మధు, సర్పంచ్ సుందరి రామారావు, జిల్లా నాయకులు పగిళ్ల సుసింధర్ రెడ్డి, పోలగాని ధనుంజయ గౌడ్, అయితగాని జానయ్య గౌడ్, గట్ల ఉమేష్, శివరాత్రి రవి, సిరిపంగి ప్రసాద్, గిలకత్తుల కరుణాకర్ , చేన్నబోయిన రాజేష్, ఎల్గూరి రామ్మూర్తి ,ఆరూరి శివ, జోగం శ్రీనివాస్ , గుండగాని జానీ గౌడ్, కుంచం సురేష్, అయితగాని జనార్ధన్ , గుండగాని మల్లేష్, షేక్ సలీం పాషా , జోగం సాయి , రాపోలు ఉపేందర్ ,ధరావత్ లక్ష్మణ్, బొల్లం సాంబశివరావు , వలపట్ల మహేష్ మరియు ముఖ్య నాయకులు సంఘీభావం తెలియజేశారు.

## దసరా సెలవుల్లో ఇళ్ల భద్రతపై అప్రమత్తంగా ఉండాలి

**ఖాళీ ఇళ్లలో దొంగతనాలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలి..**

**డయల్ 112కు సమాచారం ఇవ్వాలి: కీసర ఇన్‌స్పెక్టర్ బిక్కి రమేష్**



కీసర సమయం ప్రతినిధి : అక్టోబర్ 13: కీసర: దసరా పండుగ సెలవుల నేపథ్యంలో ప్రజలు స్వగ్రామాలకు, బంధువుల ఇళ్లకు వెళ్లే సమయంలో ఖాళీగా ఉండే ఇళ్లలో దొంగతనాలు జరగకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని కీసర ఇన్‌చార్జి పోలీస్ ఇన్‌స్పెక్టర్ బిక్కి రమేష్ సూచించారు. పండుగను ఆనందంగా జరుపుకునే క్రమంలో ఇంటి భద్రతను నిర్లక్ష్యం చేయవద్దని ఆయన ఒక ప్రకటనలో కోరారు. ప్రయాణానికి వెళ్లే ముందు ఇంటి తలుపులకు బలమైన తాళాలు వేయాలని, కిటికీలను సక్రమంగా మూసివేయాలని సూచించారు. ఇంటి ముందు వార్తాపత్రికలు, పాల ప్యాకెట్లు పేరుకు పోకుండా సరఫరాను తాత్కాలికంగా నిలిపివేయాలని తెలిపారు. వీటిని గమనించి ఇల్లు ఖాళీగా ఉన్నట్లు దొంగలు గుర్తించే అవకాశం ఉందని పేర్కొన్నారు. ఇంటి వద్ద ఏర్పాటు చేసిన సీసీటీవీ కెమెరాలు పనిచేస్తున్నాయో లేదో ముందుగానే తనిఖీ చేసుకోవాలని సూచించారు. ఊరికి వెళ్తున్న విషయాన్ని నమ్మకమైన పొరుగువారికి తెలియజేయడంతోపాటు, అవసరమైతే స్థానిక పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందించాలని కోరారు. ప్రయాణ వివరాలను సామాజిక మాధ్యమాల్లో బహిరంగంగా వెల్లడించవద్దని సూచించారు.కాలనీలు, గ్రామాల్లో అపరిచిత వ్యక్తులు అనుమానాస్పదంగా సంచరిస్తే వెంటనే డయల్ 112కు లేదా స్థానిక పోలీసులకు సమాచారం ఇవ్వాలని బిక్కి రమేష్ విజ్ఞప్తి చేశారు. చుట్టుపక్కల ఇళ్లపై నిఘా ఉంచుతూ అనుమానాస్పద కదలికలను పోలీసుల దృష్టికి తీసుకెళ్లాలని సూచించారు. ప్రజలందరూ అప్రమత్తంగా ఉండి పోలీసు శాఖకు సహకరిస్తూ దసరా పండుగను సురక్షితంగా జరుపుకోవాలని ఆయన కోరారు.

## తెలంగాణలో ఓటరు నమోదుకు ప్రత్యేక క్యాంపులు.. తేదీలు ఇవే!

హైదరాబాద్, అక్టోబర్ 13: తెలంగాణలో ఓటర్ల నమోదు, జాబితా సవరణ కోసం ఎన్నికల సంఘం ప్రత్యేక చర్యలు చేపట్టింది. రాష్ట్రవ్యాప్తంగా అక్టోబర్ 15, 16 తేదీల్లో అన్ని పోలింగ్ స్టేషన్లలో ప్రత్యేక శిబిరాలను నిర్వహించనున్నట్లు అధికారులు తెలిపారు. ఓటర్ల జాబితాలో పేరు లేని అర్హులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కొత్త ఓటర్లు, యువత తమ పేర్లను ఓటరుగా నమోదు చేసుకోవడానికి ఈ ప్రత్యేక క్యాంపులు చక్కటి అవకాశం.

## భూ సరిహద్దుల స్పష్టమైన గుర్తింపునకు రీసర్వే దోహదం

## చీకర్లపల్లిలో రీసర్వే పనులను పరిశీలించిన అదనపు కలెక్టర్ హరిప్రియ



మహబూబ్‌నగర్, (సమయం ప్రతినిధి): హన్వాడ మండలం చీకర్లపల్లి గ్రామంలో కొనసాగుతున్న భూముల రీసర్వే పనులను రెవెన్యూ అదనపు కలెక్టర్ జె.ఎల్.బి. హరిప్రియ, శిక్షణ అసిస్టెంట్ కలెక్టర్ సాయి శివానితో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా గ్రామస్థులతో మాట్లాడి రీసర్వే పురోగతిని సమీక్షించారు. జిల్లాలో ఎంపిక చేసిన గ్రామాల్లో ప్రభుత్వ ఆదేశాల మేరకు రీసర్వే నిర్వహిస్తున్నట్లు అదనపు కలెక్టర్ తెలిపారు. భూముల కొలతలను కచ్చితంగా చేపట్టి, సరిహద్దులను స్పష్టంగా గుర్తించేందుకు ఆధునిక రోవర్ సాంకేతికతను వినియోగిస్తున్నట్లు పేర్కొన్నారు. రీసర్వే పూర్తయిన అనంతరం భూ యజమానులకు ల్యాండ్ పార్సెల్ మ్యాప్స్ (ఎల్‌పీఎంలు) అందజేస్తామని, వీటి ద్వారా భూ సరిహద్దులపై స్పష్టత ఏర్పడి భవిష్యత్తులో భూ వివాదాలు, రెవెన్యూ రికార్డుల సమస్యలను నివారించవచ్చని వివరించారు. రీసర్వే పనులను సమర్థంగా పూర్తి చేసేందుకు గ్రామస్థులు అధికారులకు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ ఏడీ అశోక్, హన్వాడ తహశీల్దార్ పాల్గొన్నారు.

## అడవి పందిని ఢీకొని వ్యక్తి మృతి



వేకువ సమయం// మంచిర్యాల //లక్షెటిట్టపేట అక్టోబర్ 13 : లక్షట్ పేట మండలం గుల్లకోట స్టేజి సమీపంలో అడవి పందిని ఢీకొని బైక్ బైక్ పై వస్తున్న దుర్గం రాములు అనే 48 సంవత్సరాల వ్యక్తి మృతి చెందాడు. మృతుని స్వగ్రామం దొడేపల్లి. ఐకెపిలో సి ఎ గా పని చేస్తున్నాడు. నిన్న ఉదయం నాలుగు గంటలకు అంజనీపుత్ర రియల్ ఎస్టేట్ కి చెందిన కొంతమంది ఏజెంట్లతో కలిసి విజయవాడ దైవదర్శనం కి వెళ్తున్న అని చెప్పి ఇంటి నుండి తన బైక్ పై వెళ్లి బైక్ మంచిర్యాల రైల్వే స్టేషన్ లో పెట్టి విజయవాడ దైవదర్శనం ముగించుకుని అర్ధరాత్రి ఒంటిగంట దాటిన తర్వాత ట్రైన్ దిగి తన బైక్ పై దొడేపల్లి స్వగ్రామానికి వస్తున్న క్రమంలో గుల్లకోట స్టేజ్ సమీపంలోని రహదారిపై అడవి పంది అడ్డు రావడంతో దాన్ని తప్పించబోయి అడవి పంది ఢీకొని కిందపడి తలకు బలమైన రక్తపు గాయమై అక్కడికక్కడ చనిపోయాడు మృతునికి భార్య ఇద్దరు కుమారుల సంతానం కలరు మృతుని భార్య సుభాషిని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుగుతుంది అని లక్షట్ పేట ఎస్ఐ గోపతి సురేష్ తెలిపాడు.

## నిబంధనలకు విరుద్ధంగా చికిత్సలు.. మహబూబ్‌నగర్ జిల్లాలో 5 ఫస్ట్ ఎయిడ్ కేంద్రాలు మూసివేత

**అర్హతకు మించి వైద్యం చేయొద్దు.. జిల్లా వైద్యారోగ్య శాఖాధికారి డా. ఏ. శ్రీనివాసులు**



మహబూబ్‌నగర్, (సమయం ప్రతినిధి): నిబంధనలకు విరుద్ధంగా, తమ అర్హతకు మించి వైద్య సేవలు అందిస్తున్న ఐదు ఫస్ట్ ఎయిడ్ కేంద్రాలను జిల్లా వైద్యారోగ్య శాఖాధికారి డా. ఏ. శ్రీనివాసులు మంగళవారం మూసివేశారు. ఫస్ట్ ఎయిడ్ కేంద్రాలు ప్రథమ చికిత్స మాత్రమే అందించాల్సి ఉండగా, కొన్ని కేంద్రాల్లో యాంటీబయాటిక్ ఇంజెక్షన్లు ఇవ్వడం, ఐవీ ఫ్లూయిడ్స్ ఎక్కించడం, నెబ్యులైజర్లను వినియోగించడం వంటి నిబంధనలకు విరుద్ధమైన వైద్య సేవలు అందిస్తున్నట్లు గుర్తించినట్లు అధికారులు తెలిపారు. ఈ నేపథ్యంలో మిడ్జిల్‌లో ఒకటి, అదే మండలంలోని బోయినపల్లిలో ఒకటి, కొత్తపల్లిలో ఒకటి, బాలానగర్ మండలం హేమాజీపూర్‌లో ఒకటి, నవాబ్‌పేట మండలం కాకర్లపహాడ్‌లో ఒకటి చొప్పున మొత్తం ఐదు ఫస్ట్ ఎయిడ్ కేంద్రాలను మూసివేశారు. ఫస్ట్ ఎయిడ్ కేంద్రాలు తమ పరిధిలోని ప్రథమ చికిత్స సేవలకే పరిమితం కావాలని, అర్హతకు మించి చికిత్సలు అందించరాదని డీఎంహెచ్‌వో స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో డా. రాజు (డీఎల్‌వో), నోడల్ అధికారి డా. శివకాంత్, జిల్లా మాస్ మీడియా అధికారి జి. నర్సింహారెడ్డి, హన్మంతు హెల్త్ ఎడ్యుకేటర్ తదితరులు పాల్గొన్నారు.





# కేంద్రమంత్రిని కలిసిన రాష్ట్ర మంత్రులు-రహదారులు మౌలిక వస్తువులను గురించి కేంద్ర మంత్రి దృష్టికి తెచ్చిన మంత్రులు

హైదరాబాద్ : న్యూఢిల్లీలో కేంద్ర రోడ్డు, రవాణశాఖ మంత్రి నితిన్ గడ్కరీని మంత్రులు జూపల్లి కృష్ణారావు కోమటిరెడ్డి వెంకటరెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో కీలక మౌలిక వసతులు, రహదారుల అభివృద్ధిపై సమగ్రంగా చర్చించారు. రాష్ట్ర ప్రయోజనాల దృష్ట్యా మంత్రులు చేసిన పలు ప్రతిపాదనలకు గడ్కరీ సానుకూలంగా స్పందించారు. ముఖ్యంగా ఎల్బీనగర్ – హయత్ నగర్ డబుల్ డెక్కర్ ఎలివేటెడ్ కారిడార్‌కు ఆమోదం తెలపడంతోపాటు జాతీయ రహదారి 167కేపై కృష్ణా నదిపై నిర్మించనున్న హైబ్రిడ్ కేబుల్–స్టేయిడ్, సస్పెన్షన్ తరహా ఐకానిక్ వంతెనకు శంకుస్థాపన కార్యక్రమానికి రావాలని కోరగా.. గడ్కరీ గారు అంగీకారం తెలిపారు. ఈ వంతెన నిర్మాణంతో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ మధ్య అంతర్రాష్ట్ర అనుసంధానం మెరుగుపడటంతోపాటు హైదరాబాద్ నుంచి తిరుపతికి మధ్య 80 కి.మీ ప్రయాణ దూరం తగ్గి, సుమారు 3 గంటల ప్రయాణ సమయం తగ్గుతుందని వివరించారు. ఈ ప్రాంతంలో పర్యాటక అభివృద్ధికి, ఆర్థిక కార్యకలాపాల విస్తరణకు ఈ వంతెన నిర్మాణం దోహద పడుతుందని తెలిపారు. స్థానికులకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయి. ప్రముఖ పుణ్యక్షేత్రమైన



సోమశిల.. ఆధ్యాత్మిక, పర్యాటక హబ్‌గా వృద్ధి చెంది, తెలంగాణలో ఒక మైలురాయిగా నిలవనుందని వివరించారు. కృష్ణా నది, శ్రీశైలం జలాశయ బ్యాక్‌వాటర్స్, నల్లమల అటవీ ప్రాంతం మధ్య ఉన్న సోమశిల.. ప్రకృతి పర్యాటకానికి విశేష అవకాశాలున్న ప్రాంతమని పేర్కొన్నారు. ఐకానిక్ బ్రిడ్జి నిర్మాణంతో ఈ ప్రాంతానికి రవాణా సౌకర్యాలు మెరుగుపడితే పర్యాటకుల రాక గణనీయంగా పెరుగుతుందని వెల్లడించారు. బోటింగ్, పర్యాటకాన్ని ప్రోత్సహించడంతోపాటు స్థానికంగా హోటళ్లు, రవాణా, ఆతిథ్య రంగాల్లో ఉపాధి అవకాశాలు విస్తరిస్తాయన్నారు. అటు హైదరాబాద్ – శ్రీశైలం (NH-765) ఎలివేటెడ్ కారిడార్ కోసం కొత్త ణూ= సిద్ధం చేయాలని మంత్రి గడ్కరీ గారు అధికారులను ఆదేశించారు. పర్వత మాల పథకం కింద తెలంగాణకు 5 కీలక రోప్‌వేల మంజూరుకు హామీ ఇచ్చారు. సేతు బంధన్ పథకం ద్వారా 3 కొత్త ROBలకు అనుమతి ఇవ్వడంతో పాటు హైదరాబాద్ – అమరావతి గ్రీన్‌ఫీల్డ్ హైవేపై సానుకూల స్పందించారు. రాష్ట్రంలో 34 పనులకు CRIF నిధుల కేటాయింపు ప్రక్రియపై కేంద్ర అధికారులకు మంత్రి గడ్కరీ ఆదేశాలు జారీ చేశారు. వీటితోపాటు NH-65 (హైదరాబాద్–విజయవాడ – మచిలీపట్నం) విస్తరణ పనులను వేగవంతం చేస్తామని గడ్కరీ గారు హామీ ఇచ్చారు. పుల్లూరు నుండి నల్గొండ వరకు గల రాష్ట్ర రహదారులను జాతీయ రహదారులు (NH)గా అప్‌గ్రేడ్ చేసే అంశంపై సానుకూలత వ్యక్తం చేశారు.

## గ్రామస్థాయి నుంచి నిరుపేదల వరకు.. ఉచిత న్యాయ సేవలపై చైతన్యం పెంచాలి

### పారా లీగల్ వాలంటీర్లకు స్వాతి మురారి దిశానిర్దేశం




మహబూబాబాద్ జిల్లా: అక్టోబర్ 13 (వేకువ సమయం ప్రతినిధి): సమాజంలోని నిరుపేదలు, అణగారిన వర్గాలకు ఉచిత న్యాయ సేవలు చేరువ చేయడంలో పారా లీగల్ వాలంటీర్లు కీలక పాత్ర పోషించాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి స్వాతి మురారి సూచించారు. ప్రజలకు న్యాయ హక్కులపై అవగాహన కల్పిస్తూ, న్యాయ సాయం అవసరమైన వారికి అండగా నిలవాలని పిలుపునిచ్చారు. మంగళవారం జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో వివిధ న్యాయ సహాయ కేంద్రాల్లో సేవలందిస్తున్న పారా లీగల్ వాలంటీర్లతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కేంద్రాల పనితీరును రికార్డుల ఆధారంగా పరిశీలించి, వాలంటీర్లతో మాట్లాడి వారు అందిస్తున్న సేవలు, ఎదుర్కొంటున్న సమస్యలు, క్షేత్రస్థాయిలో ఎదురవుతున్న సవాళ్లను తెలుసుకున్నారు. ఈ క్రమంలో ఇప్పటివరకు సంస్థ సహకారంతో పరిష్కారమైన సమస్యలు, సాధించిన విజయాలను వాలంటీర్లు వివరించారు. వారి సేవలను స్వాతి మురారి అభినందించారు. ప్రజలకు న్యాయ సాయం అందించడంలో మరింత బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు.

**న్యాయ సేవలపై అవగాహన గ్రామస్థాయికి చేరాలి**

న్యాయ సాయం అవసరమైన నిరుపేదలకు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ రక్షణ కవచంలా నిలుస్తుందని స్వాతి మురారి పేర్కొన్నారు. ఉచిత న్యాయ సేవలు, లోక్ అదాలత్‌లు, న్యాయ సలహా కేంద్రాల ప్రాముఖ్యతను గ్రామస్థాయిలో ప్రజలకు వివరించాలని తెలిపారు. న్యాయ సాయం పొందే మార్గాలపై అవగాహన కల్పించి, బాధితులకు సత్వర న్యాయం అందేలా అంకితభావంతో పనిచేయాలని పారా లీగల్ వాలంటీర్లకు దిశానిర్దేశం చేశారు.

## పోతు మురళి కుటుంబీకులకు కాంగ్రెస్ నేతల పరామర్శ



అమరచింత : తెలంగాణ రాష్ట్ర పశుసంవర్ధక శాఖ, పాడి పరిశ్రమ అభివృద్ధి శాఖ, మత్స్యశాఖ, క్రీడలు మరియు యువజన శాఖల మంత్రిలి డాక్టర్ వాకిటి శ్రీహరి ఆదేశానుసారంగా,అమరచింత మండల కేంద్రంలో ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన కాంగ్రెస్ పార్టీ బీసీ సెల్ అధ్యక్షుడు పోతు శ్రీధర్ తండ్రి పోతు మురళి కుటుంబాన్ని TG టాడీ టాపర్స్ ఫైనాన్స్ కార్పొరేషన్ వైస్ చైర్మన్ కేశం నాగరాజు గౌడ్ పరామర్శించారు. ఈ సందర్భంగా మృతుడు పోతు మురళి కుటుంబ సభ్యులతో మాట్లాడి వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. కుటుంబ పెద్దను కోల్పోవడం బాధాకరమని, ఆ కుటుంబానికి కలిగిన లోటు తీర్చలేనిదని పేర్కొంటూ తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఈ కష్ట సమయంలో కుటుంబ సభ్యులు ధైర్యంగా ఉండాలని, మనోధైర్యాన్ని కోల్పోకూడదని సూచించారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఎల్లప్పుడూ ప్రజలకు అందుబాటులో ఉంటారని, పోతు శ్రీధర్ కుటుంబానికి కాంగ్రెస్ పార్టీ అండగా నిలుస్తుందని కేశం నాగరాజు గౌడ్ భరోసా ఇచ్చారు. పార్టీ కార్యకర్తల కుటుంబాలకు కష్టసమయాల్లో అండగా నిలవడం తమ బాధ్యత అని పేర్కొన్నారు. ప్రజలతో, పార్టీ శ్రేణులతో సత్సంబంధాలు కొనసాగిస్తూ, అవసరమైన సమయంలో వారికి తోడుగా ఉండేందుకు కాంగ్రెస్ పార్టీ నాయకత్వం కృషి చేస్తుందని తెలిపారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులకు తన సానుభూతిని తెలియజేస్తూ, మృతుడి ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు. ఈ కార్యక్రమంలో అమరచింత మండల, పట్టణ కాంగ్రెస్ పార్టీ నాయకులు, మున్సిపాలిటీకి చెందిన నాయకులు, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొని పోతు మురళి గారి కుటుంబ సభ్యులకు తమ సానుభూతిని తెలియజేశారు.

## కీసర దుర్గామాత మండపానికి దాతగా స్వర్ణలత మహేష్ గౌడ్

### అమ్మవారి సేవలో భాగస్వామ్యం.. భక్తిభావాన్ని చాటుకున్న చిత్తార్ల కుటుంబం



కీసర సమయం ప్రతినిధి అక్టోబర్ 13 : కీసర: శ్రీదేవి శరన్నవరాత్రి మహోత్సవాల సందర్భంగా మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా కీసరలో కొలువుదీరిన దుర్గామాత మండపానికి చిత్తార్ల స్వర్ణలత మహేష్ గౌడ్ దాతగా ముందుకొచ్చారు. అమ్మవారి ఉత్సవాల నిర్వహణకు తన వంతు సహకారం అందిస్తూ భక్తిభావాన్ని, సేవా నిరతిని చాటుకున్నారు. శరన్నవరాత్రి ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో, వైభవంగా నిర్వహించేందుకు భక్తులు, దాతలు అందించే సహకారం ఎంతో కీలకమని స్థానికులు పేర్కొన్నారు. ఆధ్యాత్మిక కార్యక్రమాలకు సహకారం అందించడం ద్వారా సమాజంలో భక్తి, సేవాభావం, ఐక్యత మరింత బలపడతాయని అభిప్రాయపడ్డారు. అమ్మవారి సేవలో భాగస్వామ్యం కావడం సంతోషకరమైన విషయమని, దుర్గామాత ఆశీస్సులు ప్రతి కుటుంబంపై ఉండాలని భక్తులు ఆకాంక్షిస్తున్నారు. చిత్తార్ల స్వర్ణలత మహేష్ గౌడ్ కుటుంబం సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని కోరుకుంటున్నారు. కీసరలో శరన్నవరాత్రి ఉత్సవాలు భక్తుల సందడితో కొనసాగుతున్నాయి.

# భూ సమస్యల శాశ్వత పరిష్కారానికి రీ-సర్వే





## జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

**వేకువ సమయం, మంచిర్యాల జిల్లా,అక్టోబర్ 13, 2026:** భూ సమస్యలను శాశ్వతంగా పరిష్కరించడంతో పాటు భూముల హద్దులను పక్కాగా నిర్ధారించి, భూ రికార్డులలో పారదర్శకత లక్ష్యంగా ప్రభుత్వం రీ-సర్వే కార్యక్రమాన్ని చేపట్టిందని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. మంగళవారం జిల్లాలోని చెన్నూరు మండలం కోనంపేట గ్రామంలో ఏర్పాటు చేసిన సమగ్ర భూ సర్వే అవగాహన సదస్సుకు మండల తహసిల్దార్ మల్లికార్జున్, అధికారులతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రీ సర్వే లో భాగంగా జిల్లాలోని ప్రతి మండలంలో తొలి విడతగా 2 గ్రామాలను ఎంపిక చేసి ప్రక్రియ నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. పాత భూ రికార్డులలోని సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవడం జరుగుతుందని, భూముల విస్తీర్ణం, హద్దులు, యాజమాన్య వివరాలకు సంబంధించి ప్రతి అంశాన్ని క్షుణ్ణంగా పరిశీలించడం జరుగుతుందని తెలిపారు. కొన్ని సందర్భాలలో వాస్తవంగా ఉన్న భూమి కంటే రికార్డులలో ఎక్కువ విస్తీర్ణం నమోదవడం, భూమి ఎక్కువగా ఉన్నప్పటికీ రికార్డులలో తక్కువగా నమోదవడం, భూ ఆక్రమణలు, హద్దుల వివాదాలు, గ్రామాల సరిహద్దులకు సంబంధించిన సమస్యల పరిష్కారానికి కృషి చేయడం జరుగుతుందని. రీ-సర్వే ద్వారా ప్రతి భూమిని క్షేత్రస్థాయిలో కొలిచి, హద్దులను సాంకేతిక పరికరాల సహాయంతో వాస్తవ విస్తీర్ణాన్ని నిర్ధారించి సంబంధిత రికార్డులు, మ్యాపులను సిద్ధం చేయడం జరుగుతుందని తెలిపారు. గ్రామాల సరిహద్దులలో ప్రభుత్వ భూములు, ఇతర భూముల ఆక్రమణలకు సంబంధించిన సమస్యలను రీ-సర్వే ద్వారా గుర్తించి, నిబంధనల ప్రకారం పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. రీ-సర్వే నిర్వహించే తేదీకి సంబంధించి భూయజమానులకు ముందుగానే నోటీసులు అందజేయడం జరుగుతుందని, భూముల కొలతలు నిర్వహించే తేదీకి కనీసం వారం రోజుల ముందే సమాచారం అందించేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. నోటీసులో పేర్కొన్న తేదీన భూయజమానులు తప్పనిసరిగా తమ భూముల వద్ద అందుబాటులో ఉండాలని, వాస్తవ హద్దులను సర్వే సిబ్బందికి చూపించి, రికార్డులలో నమోదైన విస్తీర్ణం, క్షేత్రస్థాయిలో ఉన్న విస్తీర్ణాన్ని పరిశీలించుకోవాలని తెలిపారు. రీ-సర్వే పూర్తయిన అనంతరం ప్రతి భూమికి సంబంధించిన హద్దులు, విస్తీర్ణం, యాజమాన్య వివరాలతో మ్యాపులు రూపొందిస్తామని, భవిష్యత్తులో భూముల క్రయవిక్రయాలు జరిగినప్పుడు సంబంధిత రికార్డులు, మ్యాపుల ఆధారంగా భూమి బదిలీ వివరాలను నమోదు చేసేందుకు అవకాశం ఉంటుందని తెలిపారు. తద్వారా భూముల హద్దుల విషయంలో తలెత్తే వివాదాలను తగ్గించడంతో పాటు, భూముల యాజమాన్య వివరాలను స్పష్టంగా నిర్వహించేందుకు వీలు కలుగుతుందని తెలిపారు. భూముల రికార్డుల నిర్వహణ మరింత పారదర్శకంగా మారుతుందని తెలిపారు. భూయజమానుల సహకారం ఉంటే నిర్ణీత సమయంలో సర్వే పూర్తి చేసి, సంబంధిత మ్యాపులను సిద్ధం చేయడంతో పాటు, నిబంధనల ప్రకారం కొత్త పట్టాదారు పాస్ పుస్తకాల జారీకి చర్యలు తీసుకోవచ్చని తెలిపారు. జిల్లాలోని నెన్నెల మండలంలోని 2 గ్రామాలలో, తాండూరు మండలంలోని రాంపూర్ గ్రామంలో రీ-సర్వే నిర్వహించగా, సుమారు 95 శాతం వరకు సమస్యలు పరిష్కారమయ్యాయని, వారసత్వంగా వచ్చిన భూముల పంపకం, కుటుంబ సభ్యుల మధ్య భూముల వాటాల విషయంలో ఒప్పందాలు లేకపోవడం వంటి కొన్ని సమస్యలు మినహా, అనేక భూ వివాదాలను పరిష్కరించేందుకు రీ-సర్వే దోహదపడిందని తెలిపారు. అంతకుముందు మండల కేంద్రంలో కొనసాగుతున్న వెనుకబడిన తరగతుల సంక్షేమ వసతి గృహ నిర్మాణ పనులను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. 100 పడకల ప్రభుత్వ ఆసుపత్రి పనులను పరిశీలించి ప్రారంభానికి సిద్ధం చేయాలని అధికారులకు సూచించారు. గోదావరి పుష్కర ఘాట్ పనులను మున్సిపల్ కమిషనర్ మారుతి ప్రసాద్ తో కలిసి పరిశీలించి పనులు వేగవంతం చేయాలని తెలిపారు. చెన్నూర్ మున్సిపల్ పరిధిలో కొనసాగుతున్న అమృత్ 2.0 పథకం పనులను పరిశీలించి పనులను వేగవంతం చేసి ప్రతి ఇంటికి నిరంతరం త్రాగునీరు సరఫరా చేసే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. మండలంలోని సోమనపల్లి లో చేపట్టిన యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాల పనులను పరిశీలించి పనులు వేగవంతం చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# పామిరెడ్డిపల్లె సమీపంలో ఐటీఐ కళాశాల ఏర్పాటుకు స్థల పరిశీలన





అమరచింత : తెలంగాణ రాష్ట్ర పశుసంవర్ధక, పాడి పరిశ్రమ అభివృద్ధి, మత్స్య, క్రీడలు మరియు యువజన శాఖల మంత్రి డాక్టర్ వాకిటి శ్రీహరి ఆదేశాల మేరకు, అమరచింత మండల పరిధిలోని పామిరెడ్డిపల్లె గ్రామ సమీపంలో ఐటీఐ (పారిశ్రామిక శిక్షణ సంస్థ) కళాశాల ఏర్పాటుకు సంబంధించి స్థలాన్ని TG టాడీ టాపర్స్ ఫైనాన్స్ కార్పొరేషన్ వైస్ చైర్మన్ కేశం నాగరాజు గౌడ్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఐటీఐ కళాశాల ఏర్పాటుకు అనువైన స్థలం, విద్యార్థులకు అందుబాటులో ఉండే సౌకర్యాలు, భవిష్యత్తులో కళాశాల అభివృద్ధికి అవసరమైన అంశాలపై ప్రాథమికంగా పరిశీలన జరిపారు. అమరచింత మండలంతో పాటు పరిసర గ్రామాల విద్యార్థులకు సాంకేతిక విద్యను అందుబాటులోకి తీసుకురావడం, యువత నైపుణ్యాలను పెంపొందించడం, ఉపాధి అవకాశాలను మెరుగుపరచడం వంటి లక్ష్యాలతో ఈ ప్రతిపాదనకు ప్రాధాన్యత ఏర్పడింది. ఐటీఐ కళాశాల ఏర్పాటుతో స్థానిక యువతకు ప్రయోజనం అమరచింత మండలం పామ్ రెడ్డి పల్లె గ్రామం లో ఐటీఐ కళాశాల ఏర్పాటు జరిగితే పదో తరగతి పూర్తి చేసిన విద్యార్థులకు వివిధ సాంకేతిక కోర్సుల్లో శిక్షణ పొందే అవకాశం లభిస్తుంది. దీనివల్ల విద్యార్థులు తమ ప్రాంతంలోనే నైపుణ్య విద్యను అభ్యసించడంతో పాటు, పరిశ్రమల్లో ఉద్యోగాలు పొందేందుకు, స్వయం ఉపాధి అవకాశాలను అందిపుచ్చుకునేందుకు ఉపయోగపడుతుంది. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల పేద, మధ్యతరగతి కుటుంబాలకు చెందిన విద్యార్థులకు ఇది ఎంతో ప్రయోజనకరంగా ఉంటుంది. స్థానిక యువతకు విద్యా, ఉపాధి అవకాశాలు పెంపొందించే దిశగా మంత్రి డాక్టర్ వాకిటి శ్రీహరి ప్రత్యేక చొరవతో చేపడుతున్న అభివృద్ధి ప్రయత్నాల్లో భాగంగా ఈ స్థల పరిశీలనకు ప్రాధాన్యత సంతరించుకుంది. కళాశాల ఏర్పాటుకు సంబంధించి తదుపరి చర్యలు, అవసరమైన అనుమతులు, ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం ముందుకు సాగాల్సి ఉంటుంది. ఈ కార్యక్రమంలో DCC వనపర్తి జిల్లా కార్యదర్శి రమేష్ ముదిరాజ్, అమరచింత కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు టి. రవికాంత్, అమరచింత మున్సిపా లిటీ చైర్‌పర్సన్ జింక సువర్ణ రవి యాదవ్ , వైస్ చైర్‌పర్సన్ ఎస్. రాధ అరుణ్ కుమార్ , మార్కెట్ కమిటీ డైరెక్టర్లు శ్యామ్ కుమార్, కమలాకర్ గౌడ్ , పోసిరి విష్ణు , ఎస్టీ సెల్ అధ్యక్షుడు హనుమంతు నాయక్ , కిసాన్ సెల్ అధ్యక్షుడు లక్ష్మీకాంత్ రెడ్డి, మాజీ జెడ్పిటిసి వెంకటయ్య , పామ్ రెడ్డి పల్లె గ్రామ మాజీ సర్పంచ్ పావని వెంకట్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షుడు బిసి రెడ్డి, పురుషోత్తం , దామోదర్ , కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా ఇంచార్జ్ రవికుమార్, కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు. అమరచింత ప్రాంత యువతకు నాణ్యమైన సాంకేతిక విద్య అందుబాటులోకి తీసుకు రావడం, స్థానికంగా ఉపాధి అవకాశాలను పెంపొందించడం వంటి అంశాలపై ఐటీఐ కళాశాల ఏర్పాటు ప్రతిపాదన ప్రాధాన్యతను సంతరించుకుంది.

# ఎమ్మెల్యే సొంత గ్రామంలోనే దళితులకు గుడి ప్రవేశం నిరాకరణ?

**మంగంపల్లిలో సంచలన ఘటన**
**దర్శనం చేసుకున్నందుకు దళిత కుటుంబంపై దౌర్జన్యం - ఎమ్మెల్యే మేనమామ వెంకటరాం రెడ్డిపై ఆరోపణలు.**



వనపర్తి , అక్టోబర్ 13 : 75 ఏళ్ల స్వతంత్ర భారతంలో, రాజ్యాంగం అందరికీ సమాన హక్కులు కల్పించినా... గుడి గోపురం నీడలో ఇంకా కుల వివక్ష పాతుకుపోయే ఉందా? దేవుడి ముందు అందరూ సమానమే అని చెబుతున్న ఈ కంప్యూటర్ యుగంలో కూడా, దళితుడు గుడి మెట్టు ఎక్కితే తప్పా?

అవును, ఇదే ప్రశ్న ఇప్పుడు వనపర్తి జిల్లాను తీవ్రంగా కుదిపేస్తోంది. చదువుకున్న సమాజం సిగ్గుతో తలదించుకునేలా, మానవత్వం మంటగలిసేలా ఓ ఘటన వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి సొంత గ్రామం పెద్దమందడి మండలం మంగంపల్లిలో చోటుచేసుకుందనే ఆరోపణలు సంచలనం రేపుతున్నాయి.

**అసలేం జరిగింది :** మంగంపల్లి గ్రామంలో ఆలయ పునర్నిర్మాణం జరుగుతున్న వేళ, మాసాని సుధీర్ తన కుటుంబ సభ్యులతో కలిసి దేవుడిని దర్శించుకుని తిరిగి వస్తుండగా, గ్రామ పెద్దలు అడ్డుకుని దౌర్జన్యానికి పాల్పడ్డారని బాధితుడు ఆరోపిస్తున్నాడు. ఈ దాడికి ఎమ్మెల్యే మేనమామ వెంకటరాం రెడ్డి నాయకత్వం వహించారని సుధీర్ సంచలన ఆరోపణ చేశారు.

**“మేము మనుషులం కాదా?”**

“గ్రామంలో మాదిగలు అంటే ఎందుకంత చిన్నచూపు? మేము చావుల దగ్గర డప్పు కొట్టడానికి, చెప్పులు కుట్టడానికి, ఎలక్షన్ ముందు ఓట్లు వేయడానికి మాత్రమేనా? పోయినంత కాలం బానిస బతుకులేనా?” అంటూ మాసాని సుధీర్ ప్రశ్నిస్తున్నారు. దళితుడికి ఇంత అవమానమా అంటూ ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. “ఇకనైనా మాదిగ బిడ్డలారా మేల్కొండి, మాదిగ అంటే చెప్పులు కుట్టడమే కాదు, రాజ్యాన్ని ఏలే వాళ్లమని మరోసారి గుర్తు చేయాలి. పోరాడితే పోయేది బానిస సంకెళ్లు తప్ప ఏమీ లేదు” ఎమ్మెల్యే సొంత ఊర్లోనే ఇలా జరిగితే, నియోజకవర్గంలో దళితుల పరిస్థితి ఏంటని దళిత సంఘాలు ప్రశ్నిస్తున్నాయి. ఈ ఘటనపై జిల్లా కలెక్టర్, ఎస్పీ జోక్యం చేసుకుని విచారణ జరిపి నిందితులపై ఎస్సీ/ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని డిమాండ్ చేస్తున్నాయి.

# క్రాప్ హాలిడే కాదు... ప్రత్యామ్నాయ ఉపాధి చూపించండి

## మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ డిమాండ్



**మహబూబ్‌నగర్, (సమయం ప్రతినిధి):** రాష్ట్రంలో తాగునీరు, సాగునీరు అందక పంటలు ఎండిపోతుంటే, ప్రభుత్వం ఎల్‌నినోను సాకుగా చూపిస్తూ క్రాప్ హాలిడే ప్రకటించి, పరిపాలనను గాలికి వదిలేసి మంత్రులంతా ఢిల్లీలో మకాం వేశారని ఇప్పటికైనా కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు ప్రత్యామ్నాయ ఉపాధి చూపించాలని మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ డిమాండ్ చేశారు మంగళవారం నాడు హైదరాబాదు లోని తెలంగాణ భవన్లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు ఆయన ప్రభుత్వంపై చేసిన విమర్శలు ఇలా ఉన్నాయి.- రాష్ట్ర ప్రజల సమస్యలపై ప్రభుత్వం ఏమాత్రం ఆలోచిస్తోంది? ప్రజలకు ఏం కావాలి, రాష్ట్రంలో ఏం జరుగుతోందనే విషయాలపై ప్రభుత్వానికి కనీస అవగాహన ఉందా? అన్నారు.

- రైతులకు పంటలు వేసుకోవద్దని క్రాప్ హాలిడే ప్రకటించారు. మరి రైతులకు ప్రత్యామ్నాయం ఏమిటి? వారి జీవనోపాధికి ప్రభుత్వం ఏం సమాధానం చెబుతుంది? అని నిరదీశారు.
- ఎల్‌నినో ప్రభావం పక్క రాష్ట్రాల్లోనూ ఉంది. కృష్ణా నది నుంచి సుమారు 350 టీఎంసీల నీరు దిగువకు వెళ్లినా, కనీసం 30 టీఎంసీల నీటిని కూడా నిల్వ చేసుకోలేక పోయారన్నారు.
- శ్రీశైలం ప్రాజెక్టులో నీటి నిల్వ 185 టీఎంసీల నుంచి 70 టీఎంసీలకు పడిపోయిందని
- సుమారు 60 టీఎంసీల సామర్థ్యం కలిగిన రిజర్వాయర్లు సిద్ధంగా ఉన్నా, మోటార్లను ఆన్ చేయడం లేదన్నారు.
- పక్క రాష్ట్రాలు నీటిని నిల్వ చేసుకుంటుంటే, తెలంగాణ ప్రభుత్వం మాత్రం రైతుల సమస్యలను పట్టించుకోవడం లేదని విమర్శించారు
- ఆల్మట్టి డ్యామ్‌లో 132 టీఎంసీలు, నారాయణపూర్ డ్యామ్‌లో 33 టీఎంసీల నీరు నిల్వ ఉంది.
- మహారాష్ట్ర, కర్ణాటక, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలు నీటిని ఒడిసిపట్టుకుంటుంటే, మన ప్రభుత్వం మాత్రం రైతుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందన్నారు.
- గ్రామాల్లో తాగునీటి సమస్యలు తీవ్రమయ్యాయి. ప్రజలు నీటి కోసం ధర్నాలు చేసే పరిస్థితి ఏర్పడిందని
- ఆసుపత్రుల్లో వైద్యం అందక ఉద్యోగులు, రిటైర్డ్ ఉద్యోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని హెల్త్ కార్డులు పనిచేయక వైద్యం అందక ప్రాణాలు కోల్పోయే పరిస్థితులు ఏర్పడ్డాయని వివరించారు
- రైతులు తమ కళ్ల ముందే పంటలు ఎండిపోతుండటాన్ని చూసి ఆవేదన చెందుతున్నారని కనుక ప్రభుత్వం తక్షణమే పంట నష్టపరిహారం అందించాలని డిమాండ్ చేశారు
- రెండో పంట సాగు చేయవద్దని చెప్పిన ప్రభుత్వం, పంట వేయలేకపోయిన రైతులకు తగిన నష్టపరిహారం అందించాలని
- రైతులపై ఆధారపడిన వ్యవసాయ కూలీలను కూడా ప్రభుత్వం ఆదుకోవాలన్నారు.
- ఆసుపత్రుల యాజమాన్యాలతో సమావేశం నిర్వహించి, ఉద్యోగులు, రిటైర్డ్ ఉద్యోగులు, జర్నలిస్టులకు మెరుగైన వైద్యం అందేలా చర్యలు తీసుకోవాలని
- ఆసుపత్రులకు చెల్లించాల్సిన పెండింగ్ బకాయిలను వెంటనే విడుదల చేయాలన్నారు.
- రేయింబవళ్లు విధులు నిర్వహిస్తున్న పోలీసులకు ఆరోగ్య భద్రత కల్పించాలి. హోంగార్డులు కూడా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు.
- తెలంగాణలో ప్రస్తుత పరిస్థితులు ఎమర్జెన్సీని తలపిస్తున్నాయి. ఫీజు రీయింబర్స్‌మెంట్ కోసం విద్యార్థులు ఆందోళనలు చేస్తున్నారు. రెండు లక్షల ఉద్యోగాలు భర్తీ చేస్తామని ఇచ్చిన హామీని ప్రభుత్వం నిలబెట్టుకోకపోవడంతో నిరుద్యోగులు ఉద్యమిస్తున్నారు. ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు కూడా ఇబ్బందులు పడుతున్నారు.
- ఉద్యోగులు, రిటైర్డ్ ఉద్యోగులకు ఆసుపత్రుల్లో తక్షణమే వైద్యం అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి. వైద్యం అందక ఒక్కరు ప్రాణాలు కోల్పోయినా, అందుకు ప్రభుత్వమే బాధ్యత వహించాల్సి ఉంటుంది.
- పప్పు, ఉప్పు, నూనె వంటి నిత్యావసర వస్తువుల ధరలు రోజురోజుకూ పెరుగుతున్నాయి. సామాన్యులు వాటిని కొనలేని పరిస్థితి ఏర్పడింది. ప్రజలకు గంజి కేంద్రాలు ఏర్పాటు చేయాల్సిన దుస్థితి వచ్చేలా ఉంది.
- ప్రభుత్వానికి ముందుచూపు లేదు. ఏదో ఒక సాకుతో కాలం వెళ్లదీస్తున్నారు. మంత్రులకు భూములు, పైరవీలపై ఉన్న శ్రద్ధ పరిపాలనపై లేదన్నారు.
- ప్రతి శాఖ మంత్రి తన శాఖపై పట్టు సాధించి, పకడ్బందీగా ప్రణాళికలు రూపొందించి అమలు చేస్తే ఇలాంటి పరిస్థితులు తలెత్తవని
- ఆర్థిక ప్రయోజనాల కోసం భూములను నిషేధిత జాబితాలో చేర్చడం, వివిధ దందాల్లో మునిగిపోవడం, చిత్తశుద్ధి లేకపోవడం, పరిపాలనపై పట్టు కోల్పోవడం వల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నరు.
- విద్యుత్ శాఖ మంత్రి విద్యుత్ సరఫరాపై, వ్యవసాయ శాఖ మంత్రి సాగునీరు, ఎరువులు, విత్తనాలు, ధాన్యం కొనుగోలు సంచులు తదితర రైతులకు అవసరమైన వనరులపై ముందస్తు ప్రణాళికతో వ్యవహరించాలి.
- క్రాప్ హాలిడే ప్రకటించడం పరిష్కారం కాదు. పంటలు సాగు చేసుకోలేని రైతులకు ప్రత్యామ్నాయ ఉపాధి, ఆర్థిక సహాయం, నష్టపరిహారం కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు.

# వికలాంగుడు పై మానవత్వం చాటుకొన్న షూమార్ట్ అబ్బు అన్వర్

జోగులాంబ గద్వాల జిల్లా, అక్టోబర్ 13 : గద్వాల పట్టణంలోని తెలంగాణ షూమార్ట్ యాజమాని యూసూఫ్ కుమారుడు అబ్బు అన్వర్ వికలాంగుడి పై మానవత్వం చాటుకున్నాడు. గద్వాల పట్టణానికి చెందిన ఓ నిరుపేద అభాగ్యుడైన వికలాంగుడు వీల్ చైర్ బండి లేక ఇబ్బందులు పడుతున్న విషయాన్ని తెలుసుకున్న తెలంగాణ షూమార్ట్ అబ్బు అన్వర్ వెంటనే స్పందించి వికలాంగుడికి వీల్ చైర్ బండిని అందించి మానవత్వం చాటుకున్నారు. ఈ సందర్భంగా వికలాంగుడు అబ్బు అన్వర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా అబ్బు అన్వర్ మాట్లాడుతూ... అభాగ్యులకు పెద్ద మొత్తంలో సహాయం చేయలేకపోయినా కానీ మనకు ఉన్నంతలో ఎదుటి వ్యక్తులకు సహాయ పడడమే మానవుని ధర్మమని అన్నారు. అందులో ఎంత సహాయం చేసిన కానీ తక్కువే అని అన్నారు. ఇదంతా కూడా నా తండ్రి యూసుఫ్ గారి నుండి వచ్చిన వారసత్వం అని అన్నారు. గతంలో కూడా నిరుపేద అభాగ్యులకు ఎన్నో రకాలుగా సహాయ సహకారాలు అందించిన అబ్బు అన్వర్ కృషి పట్ల పలువురు ప్రశంసలు కురిపిస్తున్నారు.



# యాసంగిలో ఆరుతడి పంటలతో అధిక ఆదాయం సాధించాలి!

## ఎల్‌నినో, వర్షాభావ పరిస్థితులను తట్టుకునేలా పంటల సాగు.. మార్కెట్ డిమాండ్‌కు అనుగుణంగా రైతులు ముందడుగు వేయాలి






మహబూబాబాద్ జిల్లా: అక్టోబర్ 13 (వేకువ సమయం ప్రతినిధి):వాతావరణ మార్పులు, ఎల్‌నినో ప్రభావం, వర్షాభావ పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని యాసంగి సీజన్‌లో రైతులు పంటల సాగులో మార్పులు చేసుకోవాలని, నీటి లభ్యతకు అనుగుణంగా ఆరుతడి పంటలకు ప్రాధాన్యత ఇవ్వాలని ఉద్యాన, పట్టు పరిశ్రమ శాఖ అధికారులు సూచించారు. సంప్రదాయ పంటలకే పరిమితం కాకుండా మార్కెట్‌లో డిమాండ్ ఉన్న కూరగాయలు, పండ్లు, పూలు, ఆయిల్‌పామ్, మల్బరీ, ఉల్లి, మునగ, నూనెగింజలు, అపరాలు వంటి పంటలను సాగు చేస్తూ ఆదాయ మార్గాలను విస్తరించుకోవాలని పిలుపునిచ్చారు.

**పంటల వైవిధ్యంతోనే రైతులకు ఆర్థిక భరోసా**

'మిషన్ వైవిధ్యం - యాసంగిలో ఆరుతడి పంటల సాగు'లో భాగంగా రైతులు పంట మార్పిడిని పాటించాలని, ప్రతి మండలంలో వివిధ రకాల పంటల సాగును ప్రోత్సహించాలని అధికారులు పేర్కొన్నారు. రైతు ఉత్పత్తిదారుల సంఘాలు (ఎఫ్‌పీఓలు), స్వయం సహాయక సంఘాల భాగస్వామ్యంతో కూరగాయలు, పండ్లు, పూల తోటలు, చిరుధాన్యాలు, అపరాలు, నూనెగింజలు వంటి పంటలను విస్తరించాలన్నారు. ఔషధ, సుగంధ తైల పంటలతో పాటు కొబ్బరి, కోకో, అవకాడో వంటి ప్రత్యామ్నాయ పంటల సాగుపై కూడా దృష్టి సారించాలని సూచించారు. బోర్లు, బావుల కింద సాగునీటి లభ్యతను అంచనా వేసుకొని ప్రతి గ్రామంలో మార్కెట్ డిమాండ్ ఉన్న పంటల సాగును విస్తరించేందుకు కృషి చేయాలన్నారు. స్థానిక అవసరాలకు అనుగుణంగా పంటలను ఎంపిక చేసుకోవడం ద్వారా రైతులు మెరుగైన ఆదాయం పొందేందుకు అవకాశాలు ఉంటాయని వివరించారు.

**తక్కువ ఖర్చుతో ఆధునిక సాగు పద్ధతులు**

రైతులు సేంద్రియ వ్యవసాయం, ప్రకృతి సేద్యానికి ప్రాధాన్యత ఇవ్వాలని అధికారులు సూచించారు. రైతు ఉత్పత్తిదారుల సంఘాలు, స్వయం సహాయక సంఘాల ద్వారా కూరగాయల సాగు, పందిళ్ల ఏర్పాటు కోసం అందుబాటులో ఉన్న రాయితీ పథకాలను వినియోగించుకోవాలని తెలిపారు.ప్రజలు నిత్యం వినియోగించే కూరగాయలను పొలం గట్లపై, పొలం చుట్టూ, ఇంటి పెరట్లో, ఇంటి ముంగిట, డాబాలపై సాగు చేయాలని సూచించారు. ఆయిల్‌పామ్, పండ్ల తోటల్లో అంతర పంటలుగా కూరగాయలను సాగు చేయడం ద్వారా అదనపు ఆదాయం పొందవచ్చున్నారు.ప్రోట్రే పద్ధతిలో నారు పెంపకం, ఎత్తు మడుల ఏర్పాటు, మల్చింగ్, బిందు సేద్యం, ఫర్టిగేషన్ వంటి ఆధునిక పద్ధతులను అనుసరించాలని పేర్కొన్నారు. నేల అవసరాలకు అనుగుణంగా సిఫారసు చేసిన ఎరువులు, వేపపిండి, ఆముదం పిండి వినియోగంతో పాటు వేపనూనె పిచికారీ, పసుపు రంగు అట్టల వినియోగం వంటి సమగ్ర సస్యరక్షణ చర్యలు చేపట్టాలని సూచించారు. పందిళ్లపై కూరగాయల సాగు, ట్రెల్లిస్ పద్ధతిలో టమాటా సాగు వంటి విధానాలతో ఉత్పాదకతను పెంచుకోవచ్చున్నారు.

**కార్యక్రమంలో పాల్గొన్న అధికారులు, రైతులు :** ఈ కార్యక్రమంలో జిల్లా ఉద్యానవన, పట్టు పరిశ్రమ శాఖ అధికారి జినుగు మరియన్న, ఎఫ్‌పీఓ రైతులు బి. వెంకటయ్య, యాదగిరి, విజయకుమార్, లింగస్వామి, ఉద్యాన శాఖ క్షేత్రస్థాయి అధికారులు కిషోర్, రమేష్, విజయపాల్, అగస్టిన్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

# నారాయణపేట ప్రభుత్వ ఆసుపత్రిలో అరుదైన శస్త్రచికిత్స విజయవంతం

## 3.5 కిలోల రొమ్ము గడ్డ తొలగింపు..





నారాయణపేట, (సమయం ప్రతినిధి): నారాయణపేట ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో అరుదైన ఫిలోడ్స్ ట్యూమర్‌తో బాధపడుతున్న మహిళకు వైద్యులు విజయవంతంగా శస్త్రచికిత్స నిర్వహించారు. గుడ్మిట్కల్ గ్రామానికి చెందిన శంకరమ్మ ఎనిమిదేళ్లుగా కుడివైపు రొమ్ములో గడ్డతో బాధపడుతుండగా, ఈ నెల 13న వైద్య బృందం శస్త్రచికిత్స చేసి 3.50 కిలోల బరువున్న గడ్డను తొలగించింది. గడ్డ స్వభావాన్ని నిర్ధారించేందుకు బయాప్సీ పరీక్షకు పంపించారు. జనరల్ సర్జరీ విభాగాధిపతి డాక్టర్ మురళీకృష్ణ, డాక్టర్లు వినీల రత్న, రహీం, వివేక్‌తో పాటు అనస్థీషియా వైద్యులు డాక్టర్ నీలవర్ణ, రమాదేవి, సాయికుమార్, నర్సింగ్ సిబ్బంది ఈ శస్త్రచికిత్సలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కె. సంపత్ కుమార్ సింగ్ వైద్య బృందాన్ని అభినందిస్తూ, ఆసుపత్రిలో మెరుగైన వైద్య సేవలు అందిస్తున్నామని తెలిపారు.

# మమతా బెనర్జీపై హత్యాయత్నం..

(సమయం ప్రతినిధి): పశ్చిమ బెంగాల్ మాజీ ముఖ్యమంత్రి మమతా బెనర్జీపై గుర్తుతెలియని మహిళ హత్యాయతానికి పాల్పడిందని తృణమూల్ కాంగ్రెస్ (టీఎంసీ) నేతలు ఆరోపించారు. కోల్‌కతాలోని మమత నివాసం కాళీఘాట్‌లో ఈ ఘటన జరిగిందని వారు పేర్కొన్నారు. టీఎంసీ నేతలు తెలిపిన వివరాల ప్రకారం.. దుర్గా పూజ మంటపాన్ని ఆవిష్కరించేందుకు మమత తన నివాసం నుంచి బయటకు వచ్చారు. ఆ సమయంలో గుర్తు తెలియని మహిళ దూసుకొచ్చి మమతా బెనర్జీ చీరను ఆమె లాగేందుకు యత్నించారు. అయితే, వెంటనే అక్కడున్న టీఎంసీ కార్యకర్తలు, నేతలు ఆ మహిళను అడ్డుకున్నారు. ఆమెను అదుపులోకి తీసుకుని పరిశీలించగా.. ఆ మహిళ దుస్తుల్లో దాచిపెట్టిన కత్తి బయట పడింది. ఆ మహిళను కాళీఘాట్ పోలీసులకు అప్పగించారు. కాగా.. మమతా బెనర్జీకి కల్పించిన భద్రతా ఏర్పాట్లపై టీఎంసీ నేతలు ఆందోళన వ్యక్తం చేశారు. తాజా ఘటనతో ఆమె భద్రతా ఏర్పాట్లపై సందేహాలు నెలకొన్నాయని, మాజీ సీఎంకు వెంటనే భద్రత పెంచాలని టీఎంసీ నేతలు కోరారు.

# గద్వాల జిల్లాలో వెట్టిచాకిరీ నిర్మూలనపై అవగాహన ప్రచారానికి 'స్వేచ్ఛా రథం' ను జెండా ఊపి ప్రారంభించిన అదనపు కలెక్టర్లు



**గద్వాల :** జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) Ch. మధన్ మోహన్, అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) నర్సింగరావు ఈరోజు 'స్వేచ్ఛా రథం'ను జెండా ఊపి ప్రారంభించారు. వెట్టిచాకిరీపై అవగాహన కల్పించడం, బాండెడ్ లేబర్ టోల్‌ఫ్రీ హెల్ప్‌లైన్ 080-69434343ను ప్రజలకు చేరువ చేయడం లక్ష్యంగా తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన రాష్ట్రవ్యాప్త అవగాహన ప్రచార కార్యక్రమంలో భాగంగా ఈ వాహనాన్ని ప్రారంభించారు. ఈ ప్రచార వాహనం జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో పర్యటిస్తూ, వెట్టిచాకిరీ, కార్మికుల హక్కులు, దోపిడీకి గురైన సందర్భాల్లో ఫిర్యాదు చేసేందుకు అందుబాటులో ఉన్న విధానాలపై ప్రజలకు, ప్రమాదానికి గురయ్యే అవకాశం ఉన్న కార్మికులకు అవగాహన కల్పిస్తుంది. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) శ్రీ నర్సింగరావు ,మాట్లాడుతూ, "వెట్టిచాకిరీపై మన దేశంలో చట్టం చాలా కాలంగా అమల్లో ఉన్నప్పటికీ, కొన్ని పరిస్థితుల్లో ఇప్పటికీ ఇటువంటి ఘటనలు వెలుగులోకి వస్తున్నాయి. ఇలాంటి కేసులను సమగ్రంగా విచారించి, బాధితులను రక్షించడం, వారికి పునరావాసం కల్పించడం, అవసరమైన సహాయాన్ని అందించడం కోసం జిల్లా యంత్రాంగం కట్టుబడి ఉంది" అని తెలిపారు. ప్రభుత్వ అధికారులు తమ విధి నిర్వహణలో భాగంగా వెట్టిచాకిరీకి గురైన వ్యక్తులను గుర్తించి, వారిని రక్షించి, పునరావాసం కల్పించడం ద్వారా బాధితులకు న్యాయం జరిగేలా కృషి చేయాలని పేర్కొన్నారు. వ్యవసాయం, ఇటుక బట్టీలు, ఆక్వాకల్చర్, గనులు, క్వారీలతో పాటు వెట్టిచాకిరీ చోటుచేసుకునే అవకాశం ఉన్న ఇతర పని ప్రదేశాల్లోని అసంఘటిత మరియు ప్రమాదానికి గురయ్యే అవకాశం ఉన్న కార్మిక రంగాలపై ఈ ప్రచారం ప్రత్యేకంగా దృష్టి సారిస్తుంది. అసిస్టెంట్ కమీషనర్ ఆఫ్ లేబర్, డీ.వేణుగోపాల్, మహిళా మరియు శిశు అభివృద్ధి శాఖ అధికారి (DWO) శ్రీమతి సునంద , జిల్లా విద్యాశాఖ అధికారి విజయలక్ష్మి, పాటు సంబంధిత శాఖల అధికారులు కార్మిక శాఖ సీనియర్ అసిస్టెంట్ అబ్రహం, డేటా ఎంట్రీ ఆపరేటర్ శ్రీమతి ఖ. నిహారికతో పాల్గొన్నారు. ఈ ప్రచార కార్యక్రమాన్ని విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు జిల్లా యంత్రాంగం అవసరమైన సహకారం అందిస్తుంది. ఇందులో భాగంగా IEC (సమాచారం, విద్య, కమ్యూనికేషన్) సామగ్రిని ప్రజలకు అందించడంతో పాటు, ప్రజలు మరియు ప్రమాదానికి గురయ్యే అవకాశం ఉన్న కార్మికులకు టోల్‌ఫ్రీ హెల్ప్‌లైన్ గురించి విస్తృతంగా అవగాహన కల్పించనున్నారు. కార్మికులకు తమ హక్కులపై అవగాహన లేకపోవడం, అందుబాటులో ఉన్న సహాయ వ్యవస్థల గురించి తెలియకపోవడం లేదా ప్రతీకార చర్యలకు భయపడటం వల్ల వెట్టిచాకిరీ అనేక సందర్భాల్లో వెలుగులోకి రాకుండా ఉండవచ్చు. అడ్వాన్స్‌లు, అప్పులు, బలవంతం, బెదిరింపులు, మోసం లేదా పని నుంచి బయటకు వెళ్లే స్వేచ్ఛను పరిమితం చేయడం వంటి మార్గాల ద్వారా కార్మికులు వెట్టిచాకిరీలో చిక్కుకునే అవకాశం ఉంది. 'స్వేచ్ఛా రథం' ద్వారా వెట్టిచాకిరీని ఎలా గుర్తించాలి, ఎక్కడ ఫిర్యాదు చేయాలి, ప్రభుత్వ అధికారులు ఎలా స్పందించగలరు అనే విషయాలపై ప్రజలకు అవగాహన కల్పించడమే ఈ ప్రచార కార్యక్రమం లక్ష్యం. ఈ రాష్ట్రవ్యాప్త ప్రచారం తెలంగాణలోని మొత్తం 33 జిల్లాల్లో కొనసాగుతుంది. ప్రచార వాహనాలు జిల్లాల్లోని వివిధ ప్రాంతాల్లో పర్యటిస్తూ, వెట్టిచాకిరీ చోటుచేసుకునే అవకాశం ఉన్న వ్యవసాయం, ఇటుక బట్టీలు, ఆక్వాకల్చర్, గనులు, క్వారీలతో పాటు ఇతర రంగాల్లో పనిచేస్తున్న ప్రమాదానికి గురయ్యే అవకాశం ఉన్న మరియు అసంఘటిత కార్మికులకు అవగాహన కల్పిస్తాయి. వెట్టిచాకిరీని ఎలా గుర్తించాలి, ఎక్కడ ఫిర్యాదు చేయాలి, ఎలాంటి సహాయం అందుబాటులో ఉంది అనే విషయాలపై కార్మికులు మరియు ప్రజలకు అవగాహన కల్పించడం ఈ ప్రచారం లక్ష్యం. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం వెట్టిచాకిరీ నిర్మూలనకు అధికారికంగా కట్టుబడి ఉంది. భారత చట్టాల ప్రకారం వెట్టిచాకిరీ నిషేధించబడింది. ఇటువంటి దోపిడీకి గురైన వ్యక్తులను గుర్తించడం, వారిని రక్షించడం మరియు వారికి అవసరమైన సహాయం అందించడం ప్రభుత్వ అధికారుల బాధ్యత. ప్రజలకు బాండెడ్ లేబర్ హెల్ప్‌లైన్ గురించి విస్తృతంగా అవగాహన కల్పించడం ద్వారా అనుమానిత వెట్టిచాకిరీ ఘటనలను నివేదించేందుకు, బాధిత కార్మికులను వారికి అందుబాటులో ఉన్న రక్షణ మరియు సహాయ వ్యవస్థలతో అనుసంధానించేందుకు 'స్వేచ్ఛా రథం' ప్రచారం దోహదపడుతుంది.

## సైబర్ నేరాల నివారణకు సాంకేతిక నైపుణ్యాలను వినియోగించాలి




వేకువ సమయం న్యూస్// మంచిర్యాల//రామగుండం : ప్రజలు, ఉద్యోగుల్లో సైబర్ భద్రతపై అవగాహన పెంపొందించేందుకు రామగుండం పోలీస్ కమిషనరేట్ ఆధ్వర్యంలో ఎన్టీపీసీ ఉద్యోగులు, అధికారులకు సైబర్ నేరాలు,ఆన్‌లైన్ మోసాలు,సోషల్ మీడియా వినియోగంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. పెద్దపల్లి జోన్, రామగుండం సర్కిల్, ఎన్టీపీసీ పోలీసులు, రామగుండం సైబర్ క్రైమ్ పోలీసులు, సైబర్ క్రైమ్ పోలీస్ స్టేషన్ సంయుక్త ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. కార్యక్రమానికి రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా,ఎన్టీపీసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ & హెడ్ ఆఫ్ ప్రాజెక్ట్ ఫియాజ్ టైయబ్, పెద్దపల్లి డీసీపీ బి. రామ్ రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా మాట్లాడుతూ.. ఎన్టీపీసీ సంస్థకు, స్థానిక పోలీసులకు మధ్య గత 40-50 సంవత్సరాలుగా కొనసాగుతున్న సత్సంబంధాలను మరింత బలోపేతం చేసుకోవాలని, పరస్పర సహకారంతో ముందుకు సాగాలని సూచించారు. ఎన్టీపీసీ వంటి ప్రతిష్టాత్మక సంస్థలో కార్యక్రమాల నిర్వహణకు ముందస్తు ప్రణాళిక, సమన్వయం ఎంతో అవసరమని తెలిపారు. సైబర్ నేరగాళ్లు ఆధునిక సాంకేతికతను వినియోగించుకుంటూ ప్రత్యేక కేంద్రాల ద్వారా వ్యవస్థీకృతంగా మోసాలకు పాల్పడుతున్నారని కమిషనర్ హెచ్చరించారు. అధిక వేతనాలు, ఆకర్షణీయమైన ఉద్యోగాల పేరుతో యువతను ప్రలోభపెట్టి, వారిని సైబర్ నేరాలకు పాల్పడేలా చేస్తున్నారని తెలిపారు. ప్రజల్లో సైబర్ భద్రతపై అవగాహన కల్పించడం పోలీసుల బాధ్యత అని,యువ ఇంజనీర్లు తమ సాంకేతిక పరిజ్ఞానం, నైపుణ్యాలను సైబర్ నేరాల నివారణకు, సమాజ శ్రేయస్సుకు వినియోగించాలని పిలుపునిచ్చారు. సైబర్ నేరాల బారిన పడకుండా ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. సందేహాస్పద సందేశాలు, లింకులు, ఫోన్ కాల్స్ లేదా డబ్బు బదిలీకి సంబంధించిన అభ్యర్థనలు వచ్చినప్పుడు తొందరపడి స్పందించకుండా "ఆగండి.. ఆలోచించండి.. నిర్ధారించుకోండి" అనే విధానాన్ని పాటించాలని సూచించారు. సైబర్ నేరగాళ్లు ప్రజల భయం, అత్యాశ, బలహీనతలు, అత్యుత్సాహాన్ని ఆసరాగా చేసుకుని మోసాలకు పాల్పడుతున్నారని హెచ్చరించారు. ఇతరులు ఎదుర్కొన్న సైబర్ మోసాల నుంచి పాఠాలు నేర్చుకుని, అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. కార్యక్రమంలో భాగంగా సైబర్ నేరగాళ్లు మోసాలకు పాల్పడే విధానాలకు సంబంధించిన వీడియోలను ప్రొజెక్టర్ ద్వారా ప్రదర్శించి, ఉద్యోగులు మరియు అధికారులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో గోదావరిఖని ఏసీపీ ఎం.రమేష్, సిసిపిఎస్ ఏసీపీ రంగా రెడ్డి, రామగుండం సర్కిల్ ఇన్‌స్పెక్టర్ కృష్ణ కుమార్,ఎన్టీపీసీ ఎస్ఐ వెంకట్, ఎన్టీపీసీ అధికారులు, ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

## మహబూబ్‌నగర్‌లో బతుకమ్మ పోస్టర్ ఆవిష్కరణ

### తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు బతుకమ్మ ప్రతీక: కలెక్టర్ ఖుష్బూ గుప్తా



మహబూబ్‌నగర్, (సమయం ప్రతినిధి): తెలంగాణ గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ (టీజీఓ) మహబూబ్‌నగర్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో మంగళవారం జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా బతుకమ్మ పండుగ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ బతుకమ్మ తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే ప్రకృతి పండుగ అని పేర్కొన్నారు. తెలంగాణ ఆడపడుచుల ఆత్మీయతకు, ప్రకృతి ఆరాధనకు బతుకమ్మ పండుగ ప్రతిబింబమని అన్నారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబించేలా బతుకమ్మ పండుగను ఘనంగా నిర్వహించుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ జె.ఎల్.బి. హరిప్రియ, శిక్షణ అసిస్టెంట్ కలెక్టర్ సాయి శివాని, టీజీఓ జిల్లా అధ్యక్షుడు విజయ్ కుమార్, జిల్లా కార్యదర్శి బైకాని బాలు యాదవ్, అసోసియేట్ అధ్యక్షుడు యాదగిరి, ఉపాధ్యక్షుడు తానాజీ, జాయింట్ సెక్రటరీ నరేష్, మహిళా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## అద్దె కార్లతో రూ.14.50 లక్షల మోసం.. కీసరలో నిందితుడి అరెస్ట్!

కీసర సమయం ప్రతినిధి: అక్టోబర్ 13 కీసర: అద్దెకు తీసుకున్న కార్లను యజమానులకు తిరిగి ఇవ్వకుండా ఇతరుల వద్ద తనఖా పెట్టి, నకిలీ పత్రాలతో వాహన బదిలీకి పాల్పడినట్లు నమోదైన కేసులో కీసర పోలీసులు ఒక నిందితుడిని అరెస్ట్ చేశారు. ఐదు కార్లకు సంబంధించిన లావాదేవీల ద్వారా రూ.14.50 లక్షలు పొందినట్లు ప్రాథమిక దర్యాప్తులో వెల్లడైందని మల్కాజిగిరి జోన్ పోలీసులు తెలిపారు. ఈ కేసులో వడ్డె మహేష్ (42)ను అరెస్ట్ చేసి, ఐదు కార్లు, ఒక మొబైల్ ఫోన్‌తో పాటు వాహన బదిలీకి ఉపయోగించిన ఫారం-35ను స్వాధీనం చేసుకున్నారు. అక్టోబర్ 13న ఈ అరెస్ట్ జరిగినట్లు పోలీసులు వెల్లడించారు.

**అద్దెకు కారు తీసుకుని.. తిరిగి ఇవ్వకుండా తనఖా**

పోలీసులు వెల్లడించిన వివరాల ప్రకారం.. దాసరి బ్రహ్మానంద రెడ్డి తన మారుతి స్విఫ్ట్ డిజైర్ గ్ఉశూ కారును (Y TG08AB1014) నెలకు రూ.35 వేల అద్దెకు వడ్డె మహేష్‌కు ఇచ్చారు. మొదటి మూడు నెలల పాటు అద్దె చెల్లించిన నిందితుడు ఆ తర్వాత అద్దె చెల్లించడం నిలిపివేయడమే కాకుండా కారును యజమానికి తిరిగి ఇవ్వలేదని ఫిర్యాదులో పేర్కొన్నారు. దీనిపై ఆరా తీయగా, సదరు కారును వట్టి అరుణ్ కుమార్ వద్ద తనఖా పెట్టి రూ.2 లక్షలు తీసుకున్నట్లు దర్యాప్తులో వెల్లడైందని పోలీసులు తెలిపారు. ఈ ఘటనపై బాధితుడు 2026 సెప్టెంబర్ 4న కీసర పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో క్రైం నంబర్ 885/2026గా కేసు నమోదు చేశారు. భారతీయ న్యాయ సంహిత (BNS)లోని 316(2), 318(4), 338 సెక్షన్ల కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

**ఐదు కార్లు.. ఐదు లావాదేవీలు**

దర్యాప్తులో భాగంగా మొత్తం ఐదు కార్లకు సంబంధించి తనఖా, వాహన బదిలీ లావాదేవీలు వెలుగులోకి వచ్చినట్లు పోలీసులు తెలిపారు. మారుతి స్విఫ్ట్ డిజైర్ ZXL (TG08AB 1014): వట్టి అరుణ్ కుమార్ వద్ద తనఖా పెట్టి రూ.2 లక్షలు పొందినట్లు ఆరోపణలు.

మారుతి ఎర్టిగా (TG34T5110): సత్తి రెడ్డి వద్ద తనఖా పెట్టి రూ.1.50 లక్షలు తీసుకున్నట్లు దర్యాప్తులో వెల్లడైంది.

మారుతి స్విఫ్ట్ డిజైర్ (TS08GF3399): వాహన బదిలీ పత్రంలో పరమేశ్వర్ రెడ్డి సంతకాన్ని ఫోర్జరీ చేసి, ఫారం-35ను ఉపయోగించినట్లు పోలీసులు గుర్తించారు. ఈ లావాదేవీలో రూ.3 లక్షలు పొందినట్లు పేర్కొన్నారు.

హ్యుందాయ్ వెన్యూ (TS07JX8732): నాగేశ్ వద్ద తనఖా పెట్టి రూ.3 లక్షలు పొందినట్లు ఆరోపణలు.

మారుతి ఎర్టిగా (TS06EZ9000): రేఖ పేరుపై ఉన్న ఈ కారును నాగేశ్ వద్ద తనఖా పెట్టి రూ.5 లక్షలు తీసుకున్నట్లు దర్యాప్తులో గుర్తించారు.

ఈ ఐదు వాహనాలకు సంబంధించిన లావాదేవీల ద్వారా మొత్తం రూ.14.50 లక్షలు పొందినట్లు ప్రాథమిక దర్యాప్తులో తేలిందని పోలీసులు వెల్లడించారు.

**ఐదు కార్లు, మొబైల్ ఫోన్ స్వాధీనం**

కేసు దర్యాప్తులో భాగంగా వడ్డె మహేష్‌ను అరెస్ట్ చేసిన పోలీసులు, అతడి నుంచి ఐదు కార్లు, ఒక మొబైల్ ఫోన్, వాహన బదిలీకి ఉపయోగించిన అసలు ఫారం-35ను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. అనంతరం నిందితుడిని న్యాయస్థానం ఎదుట హాజరుపరిచి తదుపరి చట్టపరమైన చర్యలు చేపట్టినట్లు వెల్లడించారు.

**వాహన యజమానులు అప్రమత్తంగా ఉండాలి**

కార్లను అద్దెకు ఇచ్చే సమయంలో వాహన యజమానులు అప్రమత్తంగా వ్యవహరించాలని కీసర పోలీసులు సూచించారు. అద్దెకు తీసుకునే వ్యక్తుల గుర్తింపు వివరాలు, ఒప్పంద పత్రాలు, వాహన వినియోగ నిబంధనలను పూర్తిగా పరిశీలించిన తర్వాతే వాహనాలను అప్పగించాలని కోరారు. వాహన రిజిస్ట్రేషన్, బదిలీ పత్రాలను భద్రంగా ఉంచుకోవాలని సూచించారు. తమ అనుమతి లేకుండా వాహనాలను తనఖా పెట్టడం, విక్రయించడం లేదా బదిలీ చేయడం వంటి ఘటనలు గుర్తించిన వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కేసు దర్యాప్తును జవహర్‌నగర్ ఏసీపీ ఎస్. చక్రపాణి మార్గదర్శకత్వంలో కీసర పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ బిక్కి రమేశ్, ఎస్ఐ ఎస్. అనిల్ కుమార్, కానిస్టేబుల్ శ్రీధర్ నిర్వహించినట్లు పేర్కొన్నారు.

# జడ్చర్లలో అనిరుద్ రెడ్డే ఆఖరి రెడ్డి ఎమ్మెల్యే






**జడ్చర్ల:** తెలంగాణలో బీసీలు, ఎస్సీలు, ఎస్టీలు, మైనారిటీలు, ఇతర బడుగు బలహీనవర్గాలకు జనాభా దామాషా ప్రకారం రాజకీయ అధికారం దక్కాల్సిందేనని ఎమ్మెల్సీ, తెలంగాణ రాజ్యాధికార పార్టీ అధినేత తీన్మార్ మల్లన్న అన్నారు. దశాబ్దాలుగా రాష్ట్రంలో సంపద సృష్టిస్తున్న బీసీ వర్గాలకు రాజకీయ అధికారంలో తగిన ప్రాతినిధ్యం దక్కడం లేదని పేర్కొన్నారు. బడుగు బలహీనవర్గాల ఐక్యతతోనే రాజకీయ మార్పు సాధ్యమవుతుందని తెలిపారు.తీన్మార్ మల్లన్న చేపట్టిన బీసీ రాజ్యాధికార యాత్ర జడ్చర్లకు చేరుకున్న సందర్భంగా స్థానిక యువకులు, ఉద్యమ అభిమానులు ఆయనకు గజమాలతో ఘన స్వాగతం పలికారు. అనంతరం జడ్చర్ల ప్రధాన కూడలిలో నిర్వహించిన కార్నర్ మీటింగ్‌లో మల్లన్న ప్రసంగించారు. ఈ సందర్భంగా వివిధ కుల సంఘాలు, విద్యార్థి సంఘాలు, తెలంగాణ రాజ్యాధికార పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలను ఉద్దేశించి మాట్లాడారు.సభలో స్థానిక నాయకుడు భాస్కర్ నాయక్ తన ముందు ఉంచిన ఐదు ప్రశ్నలకు సమాధానమిస్తూ బీసీ రాజ్యాధికార ఉద్యమ లక్ష్యాలను వివరించారు. బీసీల సంక్షేమం, రాజకీయ ప్రాతినిధ్యం, ప్రభుత్వ బడ్జెట్ కేటాయింపులు, విద్యార్థుల సమస్యలు, ఉద్యోగ నియామకాలు, జడ్చర్ల నియోజకవర్గ రాజకీయ పరిస్థితులపై సుదీర్ఘంగా మాట్లాడారు.

**బీసీ రాజ్యాధికార యాత్ర బడుగు వర్గాలందరిదీ**

బీసీ రాజ్యాధికార యాత్ర కేవలం బీసీల కోసమేనా, లేక బడుగు బలహీనవర్గాలందరి కోసమా అని భాస్కర్ నాయక్ అడిగిన మొదటి ప్రశ్నకు మల్లన్న సమాధానమిచ్చారు.బీసీ అంటే బ్యాక్‌వర్డ్ క్లాసెస్ అని, బ్యాక్‌వర్డ్ క్యాస్ట్స్ కాదని పేర్కొన్నారు. తన ఉద్యమంలో బీసీలతోపాటు ఎస్సీలు, ఎస్టీలు, మైనారిటీలు, కులవృత్తులపై ఆధారపడిన వర్గాలందరికీ ప్రాధాన్యం ఉంటుందని వివరించారు. ఈ వర్గాలన్నింటినీ కలుపుకొని తాను బీసీ రాజ్యాధికార ఉద్యమాన్ని ముందుకు తీసుకెళు తున్నట్లు చెప్పారు.ఇప్పటివరకు రాజకీయ నాయకులు బీసీలు వేరు, ఎస్సీలు వేరు, ఎస్టీలు వేరు, మైనారిటీలు వేరు అని చెప్పారని,ఈ వర్గాల మధ్య ఐక్యత ఏర్పడితేనే రాజకీయ అధికారం సాధ్యమవుతుందని పేర్కొన్నారు.తాను చేపట్టిన యాత్ర నూటికి నూరు శాతం బడుగు బలహీనవర్గాల యాత్రేనని స్పష్టం చేశారు.

**జనరల్ స్థానాల్లోనూ ఎస్సీ, ఎస్టీలకు అవకాశాలు కల్పిస్తాం**

బీసీలతో పాటు ఎస్టీలకు రాజకీయ అవకాశాలు ఎలా కల్పిస్తారని భాస్కర్ నాయక్ అడిగిన రెండో ప్రశ్నకు మల్లన్న సమాధానమిచ్చారు.మహారాష్ట్రలో ఎస్టీలుగా గుర్తింపు పొందిన కొన్ని వర్గాలు తెలంగాణలో బీసీలుగా ఉన్నాయని, రాష్ట్రాలవారీగా సామాజిక వర్గాల వర్గీకరణలో తేడాలు ఉన్నాయని ప్రస్తావించారు.తెలంగాణలో జనాభా తక్కువగా ఉన్న రెడ్లు, వెలమలకు అధిక సంఖ్యలో ఎమ్మెల్యే స్థానాలు దక్కుతున్నాయని అన్నారు.రాష్ట్రంలో రెడ్డి సామాజికవర్గానికి 43 ఎమ్మెల్యే స్థానాలు, వెలమ సామాజికవర్గానికి 13 ఎమ్మెల్యే స్థానాలు ఉన్నాయని పేర్కొన్నారు. ఈ రెండు వర్గాల జనాభాతో పోలిస్తే వారికి రాజకీయ ప్రాతినిధ్యం ఎక్కువగా ఉందని వ్యాఖ్యానించారు.రాష్ట్రంలోని 59 నియోజకవర్గాల్లో అగ్రవర్ణాల రాజకీయ ఆధిపత్యాన్ని మార్చడమే తమ ఉద్యమ లక్ష్యమని చెప్పారు.రాబోయే రోజుల్లో ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు రిజర్వుడు స్థానాలకే పరిమితం కాకుండా జనరల్ స్థానాల్లోనూ పోటీ చేసేలా రాజకీయ అవకాశాలు కల్పిస్తామని తెలిపారు.

**పేద రెడ్లకు కూడా సంక్షేమ పథకాలు అందిస్తాం**

అధికారంలోకి వస్తే పేద రెడ్ల పరిస్థితి ఏమిటని భాస్కర్ నాయక్ అడిగిన మూడో ప్రశ్నకు మల్లన్న స్పందించారు.తమ ఉద్యమం పేదలకు వ్యతిరేకం కాదని, పేదరికంలో ఉన్న ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందాలన్నదే తమ విధానమని వివరించారు.రెడ్డి సామాజికవర్గంలోనూ పేదలు ఉన్నారని, వారికి కూడా సంక్షేమ పథకాలు అందిస్తామని చెప్పారు.రాజకీయంగా విభేదించే నాయకుల కుటుంబాలకు సైతం ప్రభుత్వ సంక్షేమ పథకాలు వర్తింపజేస్తామని పేర్కొన్నారు.కల్వకుంట్ల కవిత పిల్లలకు కూడా కల్యాణలక్ష్మి వంటి పథకాల ప్రయోజనాలు అందిస్తామని, అనిరుధ్ రెడ్డి కుమారుడిని కూడా ప్రభుత్వ పాఠశాలలో చదివించే విధంగా విద్యావ్యవస్థను అభివృద్ధి చేస్తామని తెలిపారు.'ఎవరెంతో వారికంత' అనే నినాదంతో జనాభా దామాషా ప్రకారం రాజకీయ ప్రాతినిధ్యం, ప్రభుత్వ వనరుల పంపిణీ జరగాలని కోరుతున్నట్లు తెలిపారు.రాష్ట్రంలో రెడ్డి సామాజికవర్గానికి నాలుగు ఎమ్మెల్యే స్థానాలు, వెలమ సామాజికవర్గానికి ఒక ఎమ్మెల్యే స్థానం కేటాయించే విధంగా తమ రాజకీయ విధానం ఉంటుందని చెప్పారు. ఏ నియోజకవర్గాల్లో ఆ స్థానాలు కేటాయించాలన్నది నిర్ణయిస్తామని పేర్కొన్నారు.

**అధికారంలోకి వస్తే పాలనలో మార్పు తీసుకొస్తాం**

అధికారంలోకి వస్తే రెడ్లను పూర్తిగా పక్కన పెడతారా అని అడిగిన నాలుగో ప్రశ్నకు మల్లన్న సమాధానమిచ్చారు.గత 70 నుంచి 80 ఏళ్లుగా రాష్ట్ర రాజకీయాల్లో రెడ్లు,వెలమల సామాజిక వర్గాల ఆధిపత్యం కొనసాగిందని పేర్కొన్నారు.ఇకపై బడుగు బలహీనవర్గాలు పరిపాలన బాధ్యతలు చేపట్టాల్సిన సమయం వచ్చిందన్నారు.ఇప్పటివరకు పాలించిన వారు విశ్రాంతి తీసుకోవాలని, బీసీలు పరిపాలన చేపడతారని తెలిపారు.తాను ప్రజల నుంచి నాయకుడిగా ఎదిగానని, చివరివరకు ప్రజల నాయకుడిగానే ఉంటానని చెప్పారు.తాను మరణించిన రోజు లక్ష మంది తన అంతిమయాత్రకు రావాలన్నది తన కోరికగా గతంలో చెప్పిన విషయాన్ని గుర్తుచేశారు. ప్రజలతో ఉన్న అనుబంధమే తనకు ముఖ్యమని పేర్కొన్నారు.

**జడ్చర్లలో ఓట్లు మనవి.. రాజకీయ అధికారం రెడ్లదా..?**

జడ్చర్ల నియోజకవర్గంలోని సామాజికవర్గాల ఓట్ల లెక్కలను మల్లన్న ప్రస్తావించారు.జడ్చర్ల నియోజకవర్గంలో మొత్తం 2,20,503 ఓట్లు ఉన్నాయని చెప్పారు. వీటిలో రెడ్డి సామాజికవర్గానికి చెందిన ఓట్లు 10 వేల లోపే ఉన్నాయని పేర్కొన్నారు.బీసీ కులవృత్తుల వర్గాలకు చెందిన ఓట్లు 37,748 ఉన్నాయని, లంబాడ సామాజికవర్గానికి చెందిన ఓట్లు సుమారు 30 వేలు, ముదిరాజుల ఓట్లు మరో 30 వేలు ఉన్నాయని వివరించారు.ఇంత పెద్ద సంఖ్యలో బడుగు బలహీనవర్గాల ఓట్లు ఉన్నప్పటికీ రాజకీయ అధికారం మాత్రం రెడ్ల చేతుల్లోనే కొనసాగుతోందని మండిపడ్డారు.ఓట్లు బీసీలవే అయినప్పుడు ఎమ్మెల్యే స్థానాలు కూడా బీసీలకు దక్కాలని పేర్కొన్నారు.గత ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను గెలిపించాలని తాను ప్రచారం చేసిన విషయాన్ని ప్రస్తావిస్తూ, ఆ తర్వాత ప్రభుత్వ విధానాలపై ఎందుకు విభేదించాల్సి వచ్చిందో వివరించారు.

**కామారెడ్డి బీసీ డిక్లరేషన్ హామీ ఏమైంది?**

కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన కామారెడ్డి బీసీ డిక్లరేషన్‌ను మల్లన్న ప్రస్తావించారు.డిక్లరేషన్‌లోని 15వ పేజీలో ఐదో అంశం ప్రకారం బీసీల సంక్షేమానికి ప్రతి సంవత్సరం రూ.20 వేల కోట్ల చొప్పున ఐదేళ్లలో రూ.లక్ష కోట్లు ఖర్చు చేస్తామని కాంగ్రెస్ పార్టీ హామీ ఇచ్చిందని గుర్తుచేశారు.ఈ హామీని రాహుల్ గాంధీ కూడా ప్రకటించారని పేర్కొన్నారు.అయితే అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ హామీ అమలులో ప్రభుత్వం విఫలమైందని అన్నారు.ప్రతి సంవత్సరం రూ.20 వేల కోట్లు ఖర్చు చేస్తామని చెప్పిన ప్రభుత్వం బడ్జెట్‌లో రూ.11,500 కోట్లు మాత్రమే కేటాయించిందని మండిపడ్డారు.ఈ నిధుల్లో ఇప్పటివరకు ఎంత ఖర్చు చేశారని తాను తెలంగాణ శాసన మండలిలో ప్రశ్నించినట్లు తెలిపారు.శాసన మండలిలో తాను అడిగిన ప్రశ్న నంబరు 4429 అని పేర్కొన్నారు.రూ.11,500 కోట్ల కేటాయింపుల్లో కేవలం రూ.2 వేల కోట్లు మాత్రమే ఖర్చు చేసినట్లు ప్రభుత్వం సమాధానమిచ్చిందని వెల్లడించారు.తెలంగాణలో 62 శాతం ఉన్న బీసీలకు రూ.3.5 లక్షల కోట్ల రాష్ట్ర బడ్జెట్‌లో కేవలం రూ.2 వేల కోట్లు మాత్రమే ఖర్చు చేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు.బడ్జెట్‌లో నిధులు కేటాయించినట్లు చూపించి వాటిని పూర్తిస్థాయిలో ఖర్చు చేయకపోవడం బీసీలకు అన్యాయం చేయడమేనని అన్నారు.

**విద్యార్థుల స్కాలర్‌షిప్ నిధులు ఇవ్వకుండా మోసం**

బీసీ విద్యార్థుల స్కాలర్‌షిప్‌ల కోసం కేటాయించిన నిధుల వినియోగంపై మల్లన్న ప్రభుత్వాన్ని ప్రశ్నించారు.స్కాలర్‌షిప్‌ల కోసం సుమారు రూ.1,908 కోట్లు కేటాయించగా, అందులో రూ.365 కోట్లు మాత్రమే ఖర్చు చేశారని ఆవేదన వ్యక్తం చేశారు.మిగిలిన సుమారు రూ.1,600 కోట్ల నిధులను ఇతర అవసరాలకు మళ్లించారని,రెడ్డి కాంట్రాక్టర్ల బిల్లుల చెల్లింపులకు వినియోగించారని మండిపడ్డారు.ఈ సందర్భంగా మేఘా కృష్ణారెడ్డి పేరును ప్రస్తావిస్తూ బీసీ విద్యార్థులకు రావాల్సిన నిధులు కాంట్రాక్టర్లకు చెల్లించడంపై ప్రభుత్వాన్ని నిలదీశారు.విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు అందక ఇబ్బందులు పడుతుంటే వారి కోసం కేటాయించిన నిధులను ఇతర అవసరాలకు వినియోగించడం ఏమిటని ప్రశ్నించారు.

**సంక్షేమ హాస్టళ్ల నిధులను సైతం దారి మళ్లించారు**

సంక్షేమ హాస్టళ్లలో చదువుతున్న విద్యార్థుల భోజనం, ఇతర అవసరాల కోసం రూ.435 కోట్లు కేటాయించారని మల్లన్న పేర్కొన్నారు.అయితే అందులో రూ.315 కోట్లు మాత్రమే ఖర్చు చేశారని, మిగిలిన సుమారు రూ.120 కోట్లను ఇతర అవసరాలకు మళ్లించారని అన్నారు.బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ వర్గాలకు చెందిన విద్యార్థులు సంక్షేమ హాస్టళ్లపై ఆధారపడి చదువుకుంటున్నారని గుర్తుచేశారు.అలాంటి విద్యార్థుల ఆహారం కోసం కేటాయించిన నిధులను పూర్తిస్థాయిలో ఖర్చు చేయకపోవడాన్ని తప్పుబట్టారు.

**నాపై 83 కేసులు పెట్టినా పోరాటం ఆపలేదు**

ప్రభుత్వ విధానాలను ప్రశ్నించే వారిపై కేసులు పెట్టి వేధిస్తున్నారని మల్లన్న ఆరోపించారు.తనపై 83 కేసులు ఉన్నాయని పేర్కొంటూ, ఎన్ని కేసులు పెట్టినా ప్రజా సమస్యలపై ప్రశ్నించడం ఆపబోనని స్పష్టం చేశారు.తనపై కేసులు పెట్టడం ద్వారా ఉద్యమాన్ని అడ్డుకోలేరని స్పష్టం చేశారు.రాజ్యాంగం కల్పించిన హక్కులతోనే తాను ప్రజల తరఫున ప్రశ్నిస్తున్నానని తెలిపారు.తనను అరెస్టు చేస్తామని బెదిరించినా వెనక్కి తగ్గేది లేదని చెప్పారు.

**జడ్చర్లలో రోడ్ల నిర్మాణం ఎందుకు పూర్తి కావడం లేదు?**

జడ్చర్ల నియోజకవర్గంలోని రోడ్ల నిర్మాణ పనులపై మల్లన్న మండిపడ్డారు.ఒక్కో కాంట్రాక్టర్‌కు 40 గ్రామాల వరకు రోడ్ల నిర్మాణ పనులు అప్పగిస్తే ఆ పనులు ఎప్పుడు పూర్తవుతాయని ప్రశ్నించారు.రోడ్లపై కంకర వేసి పనులు నిలిపివేయడం వల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు.అసంపూర్తిగా ఉన్న రోడ్లపై ప్రమాదాలు జరిగి చిన్నపిల్లలు ప్రాణాలు కోల్పోయే పరిస్థితులు ఏర్పడుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు.ప్రజల సమస్యలను ప్రశ్నించే నాయకులను అరెస్టు చేస్తామని బెదిరించడం కాకుండా అభివృద్ధి పనులను పూర్తి చేయాలని సూచించారు.

**బీసీ బడ్జెట్ నిధులపై ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి సమాధానం చెప్పాలి**

బీసీ సంక్షేమానికి కేటాయించిన నిధులు ఇతర అవసరాలకు మళ్లించారన్న ఆరోపణలపై జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి సమాధానం చెప్పాలని మల్లన్న డిమాండ్ చేశారు.బడ్జెట్‌లో బీసీలకు కేటాయించిన నిధులు పూర్తిస్థాయిలో ఎందుకు ఖర్చు కాలేదని ప్రశ్నించారు.ఈ వ్యవహారంలో స్థానిక ఎమ్మెల్యేగా బాధ్యత వహించాల్సిన అవసరం లేదా అని నిలదీశారు.ఇప్పుడు సమాధానం చెప్పకుండా తప్పించుకున్నా భవిష్యత్తులో ప్రజల ముందుకు రావాల్సిందేనని స్పష్టం చేశారు.రాబోయే ఎన్నికల్లో జడ్చర్ల నుంచి బీసీ నాయకుడిని అసెంబ్లీకి పంపించడమే తమ లక్ష్యమని ప్రకటించారు.

**గత పదేళ్ల పాలనలోనూ బీసీలకు అన్యాయం**

గత బీఆర్ఎస్ ప్రభుత్వ పాలనలోనూ బీసీ సంక్షేమ నిధుల వినియోగంలో అన్యాయం జరిగిందని మల్లన్న అన్నారు.2014 నుంచి 2024 వరకు బీసీ హాస్టళ్ల కోసం రూ.3,915 కోట్లు ఖర్చు చేస్తామని పేర్కొని, రూ.2,914 కోట్లు మాత్రమే ఖర్చు చేశారని తెలిపారు.సుమారు రూ.వెయ్యి కోట్ల మేర నిధులు పూర్తిస్థాయిలో వినియోగించలేదని,హాస్టళ్లలో చదువుతున్న పేద విద్యార్థులకు అందాల్సిన సౌకర్యాలను కల్పించకుండా నిధులు మిగిల్చడం అన్యాయమని పేర్కొన్నారు.

**ఖైదీల కంటే హాస్టల్ విద్యార్థులకు తక్కువ ఖర్చా?**

హాస్టల్ విద్యార్థులకు అల్పాహారం, మధ్యాహ్న భోజనం, రాత్రి భోజనం కలిపి రోజుకు రూ.60 మాత్రమే ఖర్చు చేస్తున్నారని చెప్పారు.అదే చంచల్‌గూడ జైలులో ఖైదీలకు రోజుకు రూ.80 ఖర్చు చేస్తున్నారని పేర్కొన్నారు.పోలీసు శాఖలోని శు నకాల నిర్వహణకు రూ.16,500 ఖర్చు చేస్తున్నారని,పేద విద్యార్థుల భోజనానికి తగిన నిధులు కేటాయించకపోవడాన్ని తప్పుబట్టారు.బడుగు బలహీనవర్గాల పిల్లలకు మెరుగైన విద్య, పోషకాహారం అందించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు.

**ఎర్ర సత్యం పోరాట స్ఫూర్తిని కొనసాగిస్తాం**

జడ్చర్ల ప్రాంతానికి చెందిన ఎర్ర సత్యం ఉద్యమ చరిత్రను మల్లన్న గుర్తుచేశారు.ఎర్ర సత్యం బీసీల రాజకీయ చైతన్యం కోసం పోరాడిన నాయకుడని పేర్కొన్నారు.ఆయన తెలంగాణ ముఖ్యమంత్రి స్థాయికి ఎదిగే అవకాశం ఉన్న నాయకుడని రెడ్లు హత్య చేశారని అన్నారు.రాబోయే ఎన్నికల్లో జడ్చర్ల నుంచి ఎర్ర సత్యం రాజకీయ వారసత్వాన్ని కొనసాగించే నాయకుడిని అసెంబ్లీకి పంపిస్తాం అని స్పష్టం చేశారు.ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా నుంచి ముదిరాజు సామాజికవర్గానికి చెందిన నాయకులు పెద్ద సంఖ్యలో అసెంబ్లీకి పంపుతామని అన్నారుతెలంగాణలో పేదల పక్షాన నిలిచిన పండుగ సాయన్నను మల్లన్న గుర్తుచేశారు.పండుగ సాయన్నను తెలంగాణ రాబిన్‌హుడ్‌గా అభివర్ణించారు.పేదలకు అండగా నిలిచిన ఆయన చరిత్రను ప్రస్తావించారు.పండుగ సాయన్న కుటుంబానికి చెందిన వారసుడు తనను కలిసి వినతిపత్రం అందజేశారని తెలిపారు.పండుగ సాయన్న వంటి నాయకుల కుటుంబాలు నేడు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు.చరిత్రలో పేదల కోసం పోరాడిన నాయకుల వారసత్వాన్ని కాపాడుకోవాల్సిన అవసరం ఉందన్నారు.జడ్చర్ల రాజకీయాల్లో బడుగు బలహీనవర్గాల నాయకత్వాన్ని తీసుకురావడమే తమ లక్ష్యమని పునరుద్ఘాటించారు.

**కులవృత్తుల కార్పొరేషన్లకు కేటాయించిన నిధులెక్కడ?**

గత పదేళ్లలో వివిధ కులవృత్తుల కార్పొరేషన్లకు కేటాయించిన నిధులు, ఖర్చు చేసిన మొత్తాలను మల్లన్న సభలో వివరించారు.సాగర కార్పొరేషన్‌కు రూ.33 కోట్లు కేటాయించి రూ.4 కోట్లు మాత్రమే ఖర్చు చేశారని పేర్కొన్నారు.మేదర కార్పొరేషన్‌కు రూ.24 కోట్లు కేటాయించి రూ.4 కోట్లు ఖర్చు చేశారని తెలిపారు.పూసల కార్పొరేషన్‌కు రూ.26 కోట్లు కేటాయించి రూ.5 కోట్లు మాత్రమే ఖర్చు చేశారని చెప్పారు.భట్రాజు కార్పొరేషన్‌కు రూ.19 కోట్లు కేటాయించి రూ.95 లక్షలు మాత్రమే ఖర్చు చేశారని వివరించారు.కుమ్మరి కార్పొరేషన్‌కు రూ.61 కోట్లు కేటాయించి రూ.12 కోట్లు ఖర్చు చేశారని పేర్కొన్నారు.విశ్వకర్మ కార్పొరేషన్‌కు రూ.92 కోట్లు కేటాయించి రూ.26 కోట్లు మాత్రమే ఖర్చు చేశారని తెలిపారు.నాయీబ్రాహ్మణుల సంక్షేమానికి రూ.760 కోట్లు కేటాయించి రూ.83 కోట్లు మాత్రమే ఖర్చు చేశారని చెప్పారు.అందులో రూ.45 కోట్లు విద్యుత్ బిల్లులకే ఖర్చు చేసినట్లు పేర్కొన్నారు.కులవృత్తుల అభివృద్ధి కోసం కేటాయించిన నిధులను పూర్తిస్థాయిలో వినియోగించకపోతే ఆయా వర్గాల ఆర్థిక పరిస్థితులు ఎలా మెరుగుపడతాయని ప్రశ్నించారు.

**రాజకీయ పార్టీల వద్ద సీట్లు అడగాల్సిన పరిస్థితి మారాలి**

జడ్చర్లలోని బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ వర్గాల నాయకులు రాజకీయ అవకాశాల కోసం రెడ్లు,వెలమల నాయకులపై ఆధారపడాల్సిన అవసరం లేదని మల్లన్న పేర్కొన్నారు.జనాభా, ఓట్ల పరంగా అధిక సంఖ్యలో ఉన్న వర్గాలు ఐక్యంగా రాజకీయ నాయకత్వాన్ని నిర్మించుకోవాలని చెప్పారు.రాజకీయ ప్రాతినిధ్యం కోసం ఇతరులపై ఆధారపడే పరిస్థితిని మార్చడమే తమ ఉద్యమ లక్ష్యమని వివరించారు.బీసీలకు టిక్కెట్లు ఇవ్వడానికే తెలంగాణ రాజ్యాధికార పార్టీ పుట్టిందని అన్నారు

**బీసీలకు రాజకీయ అధికారం దక్కాలన్నదే లక్ష్యం**

తెలంగాణలో బీసీలు, ఎస్సీలు, ఎస్టీలు, మైనారిటీలు, కులవృత్తులపై ఆధారపడిన వర్గాలు రాజకీయంగా ఐక్యమవ్వాల్సిన అవసరం ఉందని మల్లన్న అన్నారు.రాష్ట్ర సంపద సృష్టిలో ప్రధాన పాత్ర పోషిస్తున్న బీసీ వర్గాలకు పాలనలోనూ తగిన ప్రాతినిధ్యం దక్కాలని పేర్కొన్నారు.కాంగ్రెస్, బీఆర్ఎస్ ప్రభుత్వాల పాలనలో బీసీ సంక్షేమానికి కేటాయించిన నిధుల వినియోగంపై సమగ్ర చర్చ జరగాలని డిమాండ్ చేశారు.జడ్చర్ల నియోజకవర్గంలో బీసీలు, ఎస్సీలు, ఎస్టీలు, ఇతర బడుగు బలహీనవర్గాల జనాభా, ఓట్ల సంఖ్యకు అనుగుణంగా రాజకీయ ప్రాతినిధ్యం కల్పించాల్సిన అవసరం ఉందన్నారు.ఎన్నికల్లో జడ్చర్లతోపాటు ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో బడుగు బలహీనవర్గాలకు చెందిన నాయకులను అసెంబ్లీకి పంపించేందుకు కృషి చేస్తామని ప్రకటించారు. బీసీ రాజ్యాధికార యాత్ర ద్వారా గ్రామగ్రామాన ప్రజలను చైతన్యపరుస్తూ, విద్య, ఉద్యోగాలు, సంక్షేమం, రాజకీయ ప్రాతినిధ్యం వంటి అంశాలపై పోరాటాన్ని కొనసాగిస్తామని తీన్మార్ మల్లన్న స్పష్టం చేశారు.

# భూ రీసర్వేలో జాప్యంపై కలెక్టర్ సీరియస్ గడువులోగా పనులు పూర్తి చేయాలి..





## ప్రతి మండలానికి రెండు సర్వే బృందాలు

**మహబూబ్‌నగర్, (సమయం ప్రతినిధి):** జిల్లాలో గ్రామాల భూ రీసర్వే పనులను వేగవంతం చేసి, నిర్దేశించిన గడువులోగా పూర్తి చేయాలని కలెక్టర్ ఖుష్బూ గుప్తా అధికారులను ఆదేశించారు. ప్రతి మండలానికి రెండు సర్వే బృందాలను ఏర్పాటు చేసి, ఎంపిక చేసిన గ్రామాల్లో పనులు వేగంగా జరిగేలా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో తహసీల్దార్లు, డిప్యూటీ తహసీల్దార్లు, సర్వేయర్లు, గ్రామ పాలన అధికారులతో నిర్వహించిన సమీక్షలో మండలాల వారీగా రీసర్వే పురోగతిని పరిశీలించారు. చిన్నచింతకుంట, కోయిలకొండ, హన్వాడ, జడ్చర్ల, మహబూబ్‌నగర్ రూరల్, మహబూబ్‌నగర్ అర్బన్, గండీడ్, మూసాపేట మండలాల్లో పనుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ప్రతి మండలంలో డిప్యూటీ తహసీల్దార్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ ఆధ్వర్యంలో రెండు సర్వే బృందాలను ఏర్పాటు చేసి పనులు వేగవంతం చేయాలని సూచించారు. రీసర్వే ప్రారంభానికి ముందు గ్రామసభలు నిర్వహించి, సర్పంచులు, పంచాయతీ కార్యదర్శుల ద్వారా రైతులకు, గ్రామ ప్రజలకు సర్వే ప్రక్రియపై అవగాహన కల్పించాలని తెలిపారు. ప్రజల సహకారంతో ఎలాంటి ఆటంకాలు లేకుండా ప్రభుత్వ భూములు, పట్టా భూములు, గ్రామ సరిహద్దులు, గ్రామకంఠం భూముల రీసర్వేను ప్రణాళికాబద్ధంగా పూర్తి చేయాలన్నారు. జడ్చర్ల మండలం ఖానాపూర్, అమ్మాపూర్, అడ్డాకల్ మండలం హాజీపూర్, పొన్నకల్, మహబూబ్‌నగర్ రూరల్ మండలం జమిస్తాపూర్, కోటకదిరతో పాటు మూసాపేట మండల పరిధిలో రీసర్వే పనులు ఆలస్యంగా సాగడంపై కలెక్టర్ ఆరా తీశారు. జాప్యానికి గల కారణాలను సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. లైసెన్స్ సర్వేయర్లు, రోవర్ల కొరతతో పాటు ఇతర సాంకేతిక సమస్యలు ఎదురైతే వెంటనే మండల ప్రత్యేక అధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. రోవర్ల కొరత ఉన్న మండలాలు జిల్లా సర్వే కార్యాలయం నుంచి అవసరమైన పరికరాలను సమకూర్చుకోవాలని ఆదేశించారు. రీసర్వేలో ఎదురయ్యే సమస్యలను తక్షణమే పరిష్కరించి, నిర్ణీత గడువులోగా పనులు పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. తహసీల్దార్లు, డిప్యూటీ తహసీల్దార్లు, మండల ప్రత్యేక అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ పనుల పురోగతిని నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. భూసేకరణ ప్రత్యేక డిప్యూటీ కలెక్టర్ ఎ. యాదగిరిని రీసర్వే పనుల నోడల్ అధికారిగా నియమించినట్లు కలెక్టర్ వెల్లడించారు. సమావేశంలో రెవెన్యూ అదనపు కలెక్టర్ జె.ఎల్.బి. హరిప్రియ, అసిస్టెంట్ కలెక్టర్ సాయి శివాని, జిల్లా రెవెన్యూ అధికారి ఎ. నిర్మల, ఆర్డీఓ నవీన్, జిల్లా సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ ఏడీ అశోక్, జిల్లా గృహనిర్మాణ శాఖ పీడీ ఉపేందర్ రెడ్డి, తహసీల్దార్లు, సర్వేయర్లు, గ్రామ పాలన అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# హిందూత్వ మూలం ఇజ్రాయెల్‌లో దొరకదు!



**(సమయం ప్రతినిధి):** రాణి శివశంకర శర్మ వ్యాసం 'ఇజ్రాయెల్ చరిత్ర... హిందూత్వ మూలాలు!' (13.09.2026) వ్యాసంలో 'హిందూత్వ' మూలాలు ఆధునిక రాజకీయ పరిణామాల్లో ఉన్నాయన్న వాదనలో కొంత వాస్తవం ఉంది. సావర్కర్ 1923లో హిందూత్వాన్ని రాజకీయ-సాంస్కృతిక భావనగా నిర్వచించారు. జియోనిజం పట్ల ఆయనకు ఆసక్తి ఉంది. యూదుల పితృభూమి-పుణ్యభూమి భావనను తన రచనలో ప్రస్తావించిన ఆధారాలు కూడా ఉన్నాయి. కానీ అక్కడి నుంచి 'ఇజ్రాయెల్ చరిత్రే హిందూత్వ మూలం' అన్న వాదన దాకా వెళ్ళగలమా? ఒక భావజాలానికి మరో భావజాలంతో సారూప్యతలు ఉండటం వల్లనే ఒకటి మరొకదాని నుంచే పుట్టిందని నిరూపించలేం. ప్రభావం, పోలిక, సమాంతర పరిణామం-ఇవి వేర్వేరు. వీటిని ఒకటిగా కలపడమంటే చరిత్రను సరళీకరించడమే. వ్యాసకర్త బ్రిటిష్ పాలన, పాశ్చాత్య సామ్రాజ్యవాదం, ఇజ్రాయెల్ ఆవిర్భావాన్ని ఒకదాన్ని ఒకటి ప్రేరేపించిన పరిణామాలుగా వరుసలో పెట్టారు. కానీ ఇజ్రాయెల్ ఏర్పడటానికి జియోనిజం, యూరప్‌లోని యూదు వ్యతిరేకత, నాజీ హింస, హోలోకాస్ట్, బ్రిటిష్ మాండేట్, రెండో ప్రపంచ యుద్ధానంతర రాజకీయాలు, ఐక్యరాజ్యసమితి విభజన ప్రణాళిక వంటి అనేక అంశాలు పనిచేశాయి. బ్రిటన్ పాత్రను చెప్పడం వరకు పర్లేదు, కానీ ఇజ్రాయెల్ ఆవిర్భావాన్ని కేవలం 'బ్రిటిష్-అమెరికన్ అండదండల ఫలితం'గా కుదించడం మిగిలిన కారణాలను మరుగు పరుస్తుంది. 1947లో ఐక్యరాజ్యసమితి పాలస్తీనా విభజన ప్రణాళికకు భారత్ వ్యతిరేకంగా ఓటు వేసింది. ఐన్‌స్టీన్ 1947 జూన్ 13న నెహ్రూకు ఉత్తరం రాసి యూదు రాష్ట్రానికి మద్దతు కోరారు. నెహ్రూ జూలై 11న సమాధానమిచ్చారు. ఇవి వాస్తవాలు. కానీ ఆ చరిత్రను ఉపయోగించి తరువాతి హిందూత్వ రాజకీయాలకు నేరుగా ఒకే మూలాన్ని నిర్ధారించడం సాధ్యం కాదు. గాంధీ 1938 నవంబరు 26న 'హరిజన్'లో 'ది జ్యూస్' వ్యాసంలో యూదుల పట్ల సానుభూతి చూపుతూనే, పాలస్తీనాలో అరబ్బుల హక్కులను పక్కన పెట్టడాన్ని అంగీకరించలేదు. జర్మన్ యూదులకు సత్యాగ్రహాన్ని మార్గంగా సూచించారు. మార్టిన్ బూబర్ వంటి యూదు మేధావులు దీన్ని విమర్శించారు. కానీ దీన్నుంచి 'గాంధీ యూదుల చారిత్రక హక్కును నిరాకరించాడు' లేదా 'హిందూ-ముస్లిం ఐక్యత అనే స్వప్రయోజనం కోసమే జియోనిజాన్ని వ్యతిరేకించాడు' అని తేల్చడం అంత సులభం కాదు. ఆయన వైఖరిలో అహింస, వలసవాద వ్యతిరేకత, అరబ్బుల హక్కులపై అవగాహన కూడా ఉన్నాయి. అంబేడ్కర్ విషయంలో వ్యాసకర్త చెప్పినది పూర్తిగా తప్పు కాదు. 1941లో 'జ్యూయిష్ అడ్వకేట్'కు ఇచ్చిన ఇంటర్వ్యూలో అంబేడ్కర్ పాలస్తీనాలో యూదుల సమాజం గురించి సానుకూలంగా మాట్లాడారు. 'మోసెస్ అండ్ హిస్ సిగ్నిఫికెన్స్' అనే తన వ్యాసంలో యూదుల విముక్తి ప్రయాణాన్ని దళితుల విముక్తి ఆకాంక్షతో పోల్చారు. కాబట్టి యూదు జాతీయ విముక్తి పట్ల ఆయనకు సానుభూతి ఉంది. అయితే 1941లో ఇజ్రాయెల్ స్వతంత్ర దేశంగా ఏర్పడలేదు. అందువల్ల అంబేడ్కర్ అభిప్రాయాన్ని 'ఇజ్రాయెల్ ఏర్పాటుకు మద్దతు'గా కాకుండా, అప్పటి యూదు జాతీయ ఉద్యమం పట్ల సానుకూలతగా చెప్పడం సరైనది. సావర్కర్ జియోనిజాన్ని ప్రశంసించారు, పితృభూమి-పుణ్యభూమి భావనను ప్రస్తావించారు, 1947లో యూదు దేశం ఏర్పాటును స్వాగతించారు-ఇవి ఆధారాలున్న వాస్తవాలే! కానీ వీటన్నిటినీ కలిపి 'హిందూత్వం పాశ్చాత్య నమూనాకు ప్రతిబింబం' అన్న నిర్ణయానికి వచ్చే వీలు లేదు. హిందూత్వానికి జియోనిజంతో సారూప్యతలు ఉన్నాయన్నది నిజమే. సావర్కర్‌పై జియోనిజం ప్రభావాన్ని సూచించే చారిత్రక ఆధారాలూ ఉన్నాయి. కానీ ఇజ్రాయెల్ చరిత్రే హిందూత్వానికి మూలమా? రాణి శివశంకర శర్మ వ్యాసం ఆ స్థాయి నిర్ధారణకు కావలసిన ఆధారాలు ఇవ్వలేదు.

# బహుజన బతుకమ్మ.. ఉత్సవం కాదు ఉద్యమం



**(సమయం ప్రతినిధి):** పదహారవ ఏటకు చేరిన బహుజన బతుకమ్మ ఈ ఏడాది దాశరథి స్వగ్రామమైన మహబూబాబాద్ జిల్లా చిన్నగూడూరు నుంచి ప్రారంభం కావాల్సి ఉంది. కానీ వర్షాభావం వల్ల గూడూరు చెరువు నిండలేదు. అందుకే బహుజన బతుకమ్మను ఒక పంటల పండుగగా జరుపుకోవాలని ఎల్లంపేటకు మార్చాల్సి వచ్చింది. అమెరికా-భారత్ మధ్య అసమాన వాణిజ్య ఒప్పందాలతో మన దేశ మార్కెట్లోకి ప్రవాహం లాగా వచ్చి పడుతున్న పాల ఉత్పత్తులు, చీజ్, సోయాబీన్.. మన రైతుల వెన్నెముక విరవనున్నాయి. అందుకే రైతాంగంతో భుజం కలుపుతూ ఆహార స్వావలంబన కోసం తెలంగాణ నవధాన్యాల సంస్కృతిని పునరుద్ధరించడమే సరైన ప్రత్యామ్నాయం అవుతుంది. తెలంగాణలోని వైవిధ్య పంటలు, చిన్న చిన్న కమతాలు, బహుజన సమూహాలు చిన్ననీటి వనరులను ఎత్తిపడితేనే కార్పొరేటీకరణను ప్రతిఘటించగలుగుతాం. ఇందుకోసం శ్రమజీవులైన దళిత బహుజనులను ఐక్యం చేయడానికి ఆటంకంగా ఉన్న సాంస్కృతిక సామాజిక అసమానతలపై బహుజన బతుకమ్మ పోరాడుతున్నది. బతుకమ్మకు ఎవరూ అంటరానివారు కాదని చెబుతూ దళితవాడలోంచి బయలుదేరుతున్నది. 'దళితులను ఐక్యం చేయండి-దళితులతో ఐక్యంకండి' అనే ఒక విప్లవ నినాదాన్ని ఊరూవాడల ఐక్యతగా అభివర్ణిస్తూ ఆచరిస్తున్నది. బతుకమ్మ ఒక పంటల పండుగ. బహుజన బతుకమ్మ ఒక సాంస్కృతిక ఉద్యమం అని చెబుతున్నాం. బతుకమ్మ పంటల పండుగ అని చెప్పడం... గతించిన పెద్దలకు పితరుల అమావాస్య (పెత్తరామాస) నాడు కొత్త పంట బియ్యం సమర్పించడంతో మొదలవుతుంది. కుటుంబ పెద్దలకు ఇష్టమైన ఆహారాన్ని వండి, వారికి నైవేద్యంగా సమర్పించి దానిని బతికున్న ఇంటి పెద్ద ఆరగించడంతో ఎంగిలిపూల బతుకమ్మ ప్రారంభమవుతుంది. ఆ విధంగా ఎంగిలిపూల బతుకమ్మలకు ముందు బాలికలు తొమ్మిది రోజులు ఆడుకునే మట్టి బొడ్డెమ్మలు కేరళంలో జరిగే ఓనం పండుగ అలంకరణలతో పోలి ఉంటాయి. భూమిలోకి తొక్కేసిన బలి చక్రవర్తిని కేరళం ప్రజలు ఆ భూమిలో నుంచి తీసుకున్న మట్టిబొడ్డెమ్మలుగా (అవన్నీ అమరుల స్తూపాకారాల్లా ఉంటాయి) అలంకరించి అయిదు రోజులకు నీళ్లలో నిమజ్జనం చేస్తారు. మట్టి బొడ్డెమ్మ, పూల బతుకమ్మ, నీళ్లు, సద్దులు... ఇవన్నీ వ్యవసాయ నాగరికతకు సంబంధించిన ఆనవాళ్లే. వీటికి తోడు బోనాలు. ఇవన్నీ స్త్రీల ఆధారిత పండుగలుగా ఎందుకున్నాయి? స్త్రీల పునరుత్పత్తికి-వ్యవసాయోత్పత్తికి ఉన్న సంబంధం ఏమిటి? స్త్రీల పునరుత్పత్తి మాత్రమే కొనసాగిన మాతృస్వామిక సమాజం తర్వాత మొదలైన తొలి సమాజమే వ్యవసాయోత్పత్తితో ప్రారంభమైంది. అది పారిశ్రామికోత్పత్తిగా మారి, కృత్రిమ మేధ (ఏఐ) రంగంగా మారినా, మనిషి ఆహారాన్ని తినడం మానలేదు. ఆహారంగా అందివచ్చిన పంటలకు పండుగను చేయడం ఆగలేదు. పంటల పండుగలో ఆ పంటలకు మూలమైన శ్రమజీవుల్లో కొందరిని అంటరానివారిగా చూసే దురాచారాలు ఇప్పటికీ ఉన్నాయి. వాటిని మార్చాలి. దొరల గడీల ముందు ఆడే కాలం నుంచి తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమ పతాకగా ఎగరేసి విజయం సాధించేదాకా బతుకమ్మలతో ఎన్నో అనుభవాలున్నాయి. స్వరాష్ట్రంలో దీనిని రాష్ట్ర పండుగగా, తంగేడు పువ్వును రాష్ట్ర పుష్పంగా ప్రకటించే వరకు ఎన్నో పరిణామాలున్నాయి. పితృస్వామ్యాన్ని ప్రశ్నించడం, సామాజిక న్యాయాన్ని సాధించడం, ఆచారాలను ప్రజాస్వామీకరించడం, ఆహార స్వావలంబన కోసం నవధాన్య సంస్కృతిని ఎత్తిపట్టడం, సామ్రాజ్యవాద జోక్యాన్ని ఎదిరించడం, పర్యావరణాన్ని రక్షించడం వంటి అనేక అంశాలను బహుజన బతుకమ్మ గత పదిహేనేళ్లుగా లేవనెత్తుతోంది. భారతదేశపు విశిష్ట దోపిడీ రూపంగా ఉన్న కుల వ్యవస్థతో బహుజన బతుకమ్మ దాదాపు తలపడుతున్నది. పదహారేళ్లుగా 250కు పైగా కేంద్రాల్లో మేం చేస్తున్న పోరాటం ఇప్పటికీ ఒక ప్రజా ఉద్యమ రూపం తీసుకోలేదు. ఈ పోరాటాన్ని విస్తృతపరచడానికి ప్రతి గ్రామానికొక కార్యకర్త అవసరం.




ఈ ఏడాది జననాయకుడు, విశ్వనాథ్ అండ్ సన్స్, 'బెత్లహాం కుటుంబ యూనిట్ చిత్రాలతో హ్యాట్రిక్ హిట్స్ అందు కున్నారు మమితా బైజు తాజాగా ఆమె గురించి ఓ వార్త నెట్టింట వైరల్ అవుతోంది. మమితా బైజు జీవితంలోని ప్రతీ నిర్ణయాన్ని ముఖ్యంగా ఆమె ఎవరిని పెళ్లి చేసుకోవాలనే దానిని కూడా తన సోదరుడు మిథున్ బైజునే డిసైడ్ చేస్తారనేది ఆ ప్రచారంలోని సారాంశం. తాజాగా ఈ అంశంపై ఆమె రియాక్ట్ అయ్యారు. సోషల్ మీడియాలో ఓ పేజీ ఈ విషయాన్ని పోస్ట్ చేయగా.. దానికి 'ఏంటీ?' అనే స్టిక్కర్‌ను బదులుగా పెట్టారు ఆమె. దీంతో ఆమె సినిమాల్లోనే కాదు నిజజీవితంలోనూ అంతే అల్లరిగా ఉంటారని అంతా అనుకుంటున్నారు. ప్రస్తుతం హాలో డియర్ అనే మలయాళ సినిమాతో పాటు తమిళంలో ఇరందు వానం, ప్రదీప్ రంగనాథ్ సినిమాల్లో నటిస్తూ మరోసారి ప్రేక్షకులను వరుస చిత్రాలతో పలకరించేందుకు సిద్ధమవుతోంది మమిత. అలాగే తెలుగులో 'జై హను-మాన్' లోనూ ఓ కీలక పాత్ర పోషిస్తోంది.




అసలు కోలీవుడ్ లో ఏం జరుగుతోంది.. ప్రస్తుతం అందరి మైండ్ లో రన్ అయ్యే ప్రశ్న ఇదే. ఏ ముహూర్తన కోలీవుడ్ స్టార్ హీరో విజయ్ రాజకీయాల్లోకి అడుగుపెట్టి ముఖ్యమంత్రి అయ్యారో.. అప్పటి నుంచి తమిళనాడులో ఎవరి నోట విన్నా పొలిటికల్ చర్చలే నడుస్తున్నాయి. విజయ్ సీఎం అయ్యాక.. హీరో అయితే చాలా సీఎం అయ్యిపోవచ్చు అనే రేంజ్ లో మాటలు సాగుతున్నాయి. అంతేనా.. ధనుష్, శివ కార్తికేయన్ ఇలా వరుసగా వీరందరూ రాజకీయ బయట పడుతున్నారు అంటూ వార్తలు వచ్చాయి. హీరోలేనా.. మాకేమీ తక్కువ అంటూ హీరోయిన్లు కూడా రాజకీయాల్లోకి ఎంట్రీ ఇస్తున్నట్లు పుకార్లు షికార్లు చేస్తున్నాయి. మొన్నటివరకు అందాల భామ త్రిష.. రాజకీయ రంగప్రవేశం గురించి అటు తమిళనాడు మాత్రమే కాకుండా మొత్తం ఇండస్ట్రీనే మాట్లాడుకుంది. జయలలితని అమ్మగా సంబోధించిన తమిళ తంబీలు త్రిషకు అక్కా అని పేరు పెట్టేశారు. నిజంగానే త్రిష పొలిటికల్ ఎంట్రీ ఇస్తుంది అనుకొనేలోపు ఆమెకు పోటీగా ఇప్పుడు మరో హీరోయిన్ పొలిటికల్ ఎంట్రీ ఇస్తున్నట్లు కొత్త పుకారు మొదలయ్యింది. ఆమె ఎవరో లేడీ సూపర్ స్టార్ నయనతార. తమిళనాట తిరుగులేని క్రేజ్ సంపాదించుకున్న నయనతార త్వరలోనే ప్రత్యక్ష రాజకీయాల్లోకి అడుగుపెట్టబోతుందంటూ టాక్ నడుస్తోంది. త్రిషకు పోటీగా నయన్ రంగంలోకి దిగుతుందని టాక్ రావడంతో కొందరు.. జయలలిత వారసురాలు నువ్వే అంటూ నయన్ ని ఆకాశానికి ఎత్తేస్తున్నారు. ఇక నయన్ పొలిటికల్ ఎంట్రీ వార్తలపై తాజాగా నయనతార భర్త, దర్శకుడు విఘ్నేశ్ శివన్ స్పందించాడు. ప్రస్తుతానికి నయనతారకు రాజకీయాల్లోకి వచ్చే ఎలాంటి ఆలోచన లేదని విఘ్నేశ్ స్పష్టం చేశాడు. ప్రస్తుతం నయన్ తన మాతృత్వాన్ని పూర్తిగా ఆస్వాదిస్తోందని, పిల్లల బాధ్యతలు చూసుకుంటూనే మరోవైపు తన సినిమా కెరీర్‌పై దృష్టి పెట్టాలని భావిస్తున్నట్లు చెప్పుకొచ్చాడు. అయితే ఇక్కడివరకు బాగానే ఉన్నా.. విఘ్నేశ్, నయన్ పాలిటిక్స్ లోకి రావడం లేదు, ఇంట్రెస్ట్ లేదు అని మాత్రం చెప్పకపోవడంతో నయన్ భవిష్యత్ లో ఏమైనా రాజకీయ రంగప్రవేశం చేసే అవకాశం ఉండొచ్చు అని నెటిజన్స్ అభిప్రాయపడుతున్నారు. మరి ముందు ముందు తమిళనాడు రాజకీయాలు ఎలా మారనున్నాయో చూడాలి.




రీల్స్ చేయడం వల్ల జీవితం బాగుపడదు. ఉన్నతస్థాయికి చేరుకోలేరని హీరో సూర్య హితవు పలికారు. నటుడు శివకుమార్ ఎడ్యుకేషనల్ ఫౌండేషన్ 47వ వార్షికోత్సవ వేడుకలు టి.నగర్‌లోని ఆగరం ఫౌండేషన్ కార్యాలయంలో ఆదివారం జరిగాయి. ఈ వేడుకల్లో ప్లస్ టూ పూర్తి చేసి కళాశాలలో చేరిన 25 మంది ప్రతిభావంతులైన విద్యార్థులకు ఆర్థిక సాయం చేశారు. అలాగే, ప్రముఖ చిత్రకారుడు జీవానందన్ కు కూడా రూ. లక్ష ఆర్థిక సాయం అందజేశారు. 25 మంది విద్యార్థులతో పాటు అణగారిన వర్గాలకు చెందిన పేద విద్యార్థులకు విద్యాదానం చేస్తున్న కొన్ని విద్యా సంస్థలతో కలిసి రూ.13.78 లక్షల మేరకు ఆర్థిక సాయం చేశారు. ఈ సందర్భంగా సీనియర్ నటుడు శివకుమార్ మాట్లాడుతూ.. 1979 లో నా వందో చిత్రం 'రోసాప్పూ రవి కైక్కారి'కి గాను ఇచ్చిన రూ.25 వేల పారితోషికాన్ని బ్యాంకులో ఫిక్స్‌డ్ డిపాజిట్ చేసి తద్వారా వచ్చిన వడ్డీని పేద విద్యార్థులకు సహాయం చేసేందుకు ఉపయోగిస్తున్నాం. ఆరంభంలో విద్యార్థులకు వివిధ రకాల బహుమతులు ఇచ్చేవాళ్ళం. ఆ తర్వాత నా సొంత నిధుల నుంచి ఉపకారవేతనాలు అందించాను. 2006 నుంచి అగరం ఫౌండేషన్ నా పౌండేషన్ బాధ్యతలను స్వీకరించి, ప్రతి యేటా ఉపకారవేతనాలను, అవార్డులను అందిస్తోందన్నారు.

## Cinema




దర్శకధీరుడు రాజమౌళి, సూపర్ స్టార్ మహేశ్ బాబు కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న అత్యంత ప్రతిష్టాత్మక చిత్రం వారణాసి. బాహుబలి, ఆర్‌ఆర్‌ఆర్ వంటి గ్లోబల్ హిట్ల తర్వాత రాజమౌళి నుంచి వస్తున్న ఈ ప్రాజెక్ట్ మీద అంచనాలు ఏ స్థాయిలో ఉన్నాయో ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. ప్రియాంక చోప్రా హీరోయిన్‌గా నటిస్తున్న ఈ చిత్రంలో మలయాళ హీరో పృథ్వీరాజ్ సుకుమారన్ విలన్ పాత్రలో కనిపించబోతున్నారు. కె.ఎల్. నారాయణ, ఎస్.ఎస్. కార్తికేయ ఈ చిత్రాన్ని దాదాపు రూ.1300 కోట్ల భారీ బడ్జెట్‌తో నిర్మిస్తున్నట్లు తెలుస్తోంది. అయితే, ఈ సినిమా విడుదల కోసం జక్కన్న హాలీవుడ్ స్థాయి ప్లాన్ వేసినట్లు సమాచారం. మరి రాజమౌళి వేసిన ఆ మాస్టర్ ప్లాన్ ఏంటో తెలుసుకుందాం. దర్శకధీరుడు ఈ చిత్రాన్ని కేవలం భారత్‌కే పరిమితం చేయకుండా, ప్రపంచవ్యాప్తంగా సరికొత్త రికార్డులు సృష్టించేలా భారీ ప్రణాళికలు రచిస్తున్నారు. వచ్చే ఏడాది రాబోతున్న ఈ సినిమాను ప్రపంచవ్యాప్తంగా ఏకంగా 60 వేల నుంచి 65 వేల స్క్రీన్లలో విడుదల చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు వార్తలు వస్తున్నాయి. ముఖ్యంగా ఉత్తర అమెరికా, చైనా మార్కెట్లలో ఒకేసారి భారీ స్థాయిలో సినిమాను రిలీజ్ చేసేందుకు రాజమౌళి అక్కడి ప్రముఖ డిస్ట్రిబ్యూటర్లు, ఎగ్జిబిటర్లతో వరుస సమావేశాలు నిర్వహిస్తున్నట్లు బాలీవుడ్ మీడియా కోడై కూస్తోంది. హాలీవుడ్ స్టార్ హీరోల సినిమాలకు మాత్రమే సాధ్యమయ్యే ఈ రేంజ్ వైడ్ రిలీజ్ ప్లాన్ చూస్తుంటే.. రాజమౌళి ఆలోచనలు ఏ స్థాయిలో ఉన్నాయో అర్థం చేసుకోవచ్చు.కేవలం స్క్రీన్ల మేనేజ్‌మెంట్‌తో పాటు కలెక్షన్ల విషయంలోనూ జక్కన్న మాస్టర్ ప్లాన్ వేసినట్లు తెలుస్తోంది. ఒక్క నార్త్ అమెరికా మార్కెట్లోనే కనీసం 50 మిలియన్ డాలర్ల వసూళ్లను సాధించడమే లక్ష్యంగా ఈ ప్రాజెక్ట్‌ను ముందుకు తీసుకెళ్తున్నారు. హాలీవుడ్ స్థాయి సినిమాలకే ఇంత పెద్ద మొత్తంలో వసూళ్లను ఆశించడం సవాలుతో కూడుకున్న అంశం. కానీ, రాజమౌళికి అసాధ్యమైనది అంటూ ఏదీ లేదని ఆయన గత సినిమాలే నిరూపించాయి. తెలుగు సినిమాకు ఆస్కార్ అవార్డు తెచ్చిపెట్టిన ఆయన, ఇప్పుడు 'వారణాసి'తో గ్లోబల్ స్థాయిలో మన సినిమా పేరు మారుమోగిపోయేలా కంకణం కట్టుకున్నారు. 'ఆర్‌ఆర్‌ఆర్'తో గ్లోబల్ ఆడియెన్స్‌ను ఫిదా చేసిన రాజమౌళి, ఈసారితో ఏకంగా వరల్డ్ సినిమా రికార్డులన్నింటినీ తిరగరాయాలని చూస్తున్నారు. ఇక గ్లోబల్ అడ్వెంచరస్ థ్రిల్లర్‌గా తెరకెక్కుతున్న ఈ చిత్రంలో మహేశ్ బాబు లుక్, ఆయన బాడీ లాంగ్వేజ్ సరికొత్తగా ఉండబోతున్నాయని సమాచారం. మహేశ్ బాబు క్రేజ్, రాజమౌళి టేకింగ్ మ్యాజిక్ తోడైతే అంతర్జాతీయ బాక్సాఫీస్ వద్ద ఎలాంటి సునామీ సృష్టిస్తుందో ఊహించడం కూడా కష్టమేనని అభిమానులు ధీమాగా ఉన్నారు. మరి రాజమౌళి వేస్తున్న ఈ గ్లోబల్ వ్యూహాలు ఏ మేరకు ఫలిస్తాయి? 'వారణాసి' సినిమా ప్రపంచ సినిమా చరిత్రలో ఎలాంటి అద్భుతాలు సృష్టిస్తుంది? ఇవన్నీ తెలియాలంటే సినిమా విడుదల వరకు వెయిట్ చేయాల్సిందే.

మీ ప్రత్యేకతను,
మీ వ్యాపార అభివృద్ధికి
కొందరు మాత్రమే
నమ్మకమైన సేవలందిస్తారు..



మీ శ్రేయస్సును ఆకాంక్షించే వారికి
ఆత్మీయతను పంచండి

మధురస్మృతులు
ద్వారా శుభాకాంక్షలు తెలియజేయండి మరింత దగ్గరవ్వండి. మీ కుటుంబం సభ్యులలో, మీ బంధుమిత్రులలో, మీ ఆఫీసులో సహోద్యోగి ఎవరైనా రిటైర్ అవుతున్నా, వైవాహిక జీవితం 60 వసంతాలు పూర్తి చేసి వసంతోత్సవం జరుపుకుంటున్నా, ప్రశంసలు అందుకున్న ఆయా సందర్భాల్లో వారి జీవిత విశేషాలు మధురస్మృతులు తో పంచుకోండి. పలువురికి ఆదర్శప్రాయులు కండి.



మా కార్యాలయము :-
మధురస్మృతులు
మాస పత్రిక
SREEJA SREE PUBLICATIONS
H.No: 1-3-129, Rajendra Nagar,
Mahabubnagar. PIN - 509001.
Ph : 9848997085, 08542-222814
e-Mail : ms.mbnr2@gmail.com

OWNED, PRINTED AND PUBLISHED BY KARNAM BHASKAR RAO, PRINTED AT SHREYA SREE PRINTERS, H.NO.1-3-129, RAJENDRA NAGAR, MAHABUBNAGAR DIST., T.S. PUBLISHED AT SREEJA SREE PUBLICATONS, H.NO.1-3-129, RAJENDRA NAGAR, MAHABUBNAGAR DIST, T.S, RNI NO: APTEL/2012/47246 EDITOR : KARNAM BHASKAR RAO, Ph: 08542-222814, Cell: 9848997085